గురువారం
10 జనవరి
2019

పేజీలు 12
సంపుటి 1, సంచిక 292

www.vijayakranthinews.com

విజయక్రాంతి

నిజం నిర్భయం నిష్పక్షం

హైదరాబాద్ | PUBLISHED SIMULTANEOUSLY FROM HYDERABAD, NIZAMABAD, KHAMMAM | VIJAYAKRANTHINEWS | రూ. 3.00



కుర్ర హీరో ప్రేమలో 10

రెండో రోజూ

సమ్మె పాక్షికమే



విజయక్రాంతి, హైదరాబాద్: సార్వత్రిక సమ్మె రెండో రోజు కూడా పాక్షికంగానే జరిగింది. బస్సులు, ఆటోలు ఎలాంటి ఆటంకాలు లేకుండా యథావిధిగా నడిచాయి. కార్మిక చట్టాలను సవరించడం ద్వారా కార్మిక హక్కులకు కేంద్ర ప్రభుత్వం భంగం కల్గిస్తుందంటూ 10 జాతీయ కార్మిక సంఘాలు రెండు రోజుల పాటు సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చాయి. దీంతో ఆయా సంఘాలకు అనుబంధంగా రాష్ట్ర కార్మిక సంఘాలు సమ్మె నిర్వహించాయి. రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె ప్రభావం ఏ మాత్రం కన్పించలేదు. ఆర్టీసీ బస్సులు నడిచాయి. కొన్ని బ్యాంకులు లావాదేవీలు నిర్వహించాయి.

కార్మిక వ్యతిరేక విధానాలు విడనాడాలి: కార్మిక సంఘాలు

మోదీ సర్కారు కార్మిక వ్యతిరేక విధానాలు విడనాడాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. సార్వత్రిక సమ్మె సందర్భంగా నిర్వహించిన నిరసన కార్యక్రమాల్లో సీఐటీయూ, ఏఐటీయూసీ కార్మిక సంఘాల నేతలు చుక్కా రాములు, రత్నాకర్‌రావు మాట్లాడారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మోదీ సర్కారు కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తోందని ఆరోపించారు. ప్రజల నుంచి తీవ్ర స్థాయిలో వ్యతిరేకత వస్తున్నా.. పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా మోదీ సర్కారు తన విధానాలను విడనాడాలని హితవు పలికారు.

అగ్రవర్ణ పేదలకు 10%



- ఈబీసీ బిల్లుకు పార్లమెంట్ ఆమోదం
- రాజ్యసభలో 165 మంది ఎంపీలు అనుకూలం
- రాష్ట్రపతి ఆమోదం అనంతరం అమలులోకి కొత్త రిజర్వేషన్ చట్టం
- బిల్లుపై పంతం నెగ్గించుకున్న బీజేపీ
- ఎన్నికల గిమ్మిక్కుగా విపక్షాల విమర్శ

న్యూఢిల్లీ: అగ్రవర్ణాల పేదలకు విద్య, ఉద్యోగాల్లో పది శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును పార్లమెంట్ ఉభయ సభలు ఆమోదించాయి. 124వ రాజ్యాంగ సవరణ బిల్లుపై బుధవారం రాజ్యసభలో సుదీర్ఘ చర్చ అనంతరం డివిజన్ పద్ధతిలో ఓటింగ్ జరిగింది. బిల్లుకు అనుకూలంగా 165 ఓట్లు రాగా వ్యతిరేకంగా 7 ఓట్లు వచ్చాయి. ఓటింగ్ సమయంలో రాజ్యసభలో 172 మంది సభ్యులున్నారు. బిల్లుకు దాదాపు అన్ని పార్టీలూ మద్దతు తెలిపాయి. మంగళవారం లోక్‌సభలో ఈ బిల్లు ఆమోదం పొందగా బుధవారం రాజ్యసభలో కూడా ఆమోదం పొందింది. అనంతరం రాజ్యసభ కూడా నిరవధికంగా వాయిదా పడింది. కాగా ఈ బిల్లును రాష్ట్రపతి సంతకం కోసం పంపించనున్నారు. రాష్ట్రపతి సంతకం తర్వాత ఈ బిల్లు చట్టంగా మారనుంది.

తొలుత బుధవారం కేంద్రమంత్రి గెహ్లాట్ ఈబీసీ బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టారు. ఈసందర్భంగా విపక్షాలు ఆందోళనకు దిగాయి. ప్రజలను మోసం చేయడం ఆపాలన్న నినాదాలతో హోరెత్తించాయి. ఈబీసీ బిల్లుపై తొందరెందుకుని కాంగ్రెస్ ప్రశ్నించింది. ఎన్నికల గిమ్మిక్కుగా ఆ పార్టీ అభివర్ణించింది. కాగా రాజ్యాంగ సవరణ బిల్లును తొలుత సెలెక్ట్ కమిటీకి పంపాలని డీఎంకే ఎంపీ కనిమొళి తీర్మానం ప్రవేశపెట్టగా పలు విపక్ష పార్టీలు మద్దతు పలికాయి. రాజ్యసభలో సంఖ్యా బలం కలిగిన కాంగ్రెస్, ఆర్జేడీ సహా పలు ప్రాంతాయ పార్టీలు కోటా బిల్లుపై అభ్యంతరం వ్యక్తం చేశాయి. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు ఉద్దేశించిన రిజర్వేషన్ల వ్యవస్థకు ఈ బిల్లుతో విఘాతం కలుగుతుందని ఆర్జేడీ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. న్యాయస్థానంలో బిల్లు నిలబడదని విపక్షాలు సందేహం వ్యక్తం చేశాయి. సెలక్ట్ కమిటీకి పంపాలని డిమాండ్ చేస్తూ విపక్షాలు పోడియం వద్ద ఆందోళనకు దిగడంతో కొంత గందరగోళ పరిస్థితి ఏర్పడింది. అనంతరం అగ్రవర్ణ పేదలకు 10 శాతం రిజర్వేషన్ల బిల్లుపై రాజ్యసభలో సుదీర్ఘ చర్చ జరిగింది.

95 శాతం మందికి ప్రయోజనం.. మోదీ చరిత్రలో నిలుస్తారు : బీజేపీ

లోక్‌సభలో మంగళవారం ఈ బిల్లును ఆమోదించిన విపక్షాలు రాజ్యసభలో మోకాలడ్డుతూ ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తున్నాయని బీజేపీ మండిపడింది. ప్రతి రాజకీయ పార్టీ జనరల్ కేటగిరిలోకి పేదలకు రిజర్వేషన్లు కల్పిస్తామని మేనిఫెస్టోల్లో చెబుతుంటే కేవలం నరేంద్ర మోదీ సర్కార్ మాత్రమే దీన్ని నెరవేర్చిందని బీజేపీ సభ్యుడు ప్రభాత్ ఝా పేర్కొన్నారు. మండల్ కమిషన్ నివేదికతో పాటు అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు సైతం జనరల్ కేటగిరిలోని పేదలకు రిజర్వేషన్లు వర్తింపచేయాలని కోరుకున్నారన్నారు. అయితే నాడు ఈ బిల్లుపై నోటిఫికేషన్ ఇచ్చినా రాజ్యాంగ సవరణ చేయకపోవడంతో కోర్టులో నిలవలేదన్నారు. ఈ బిల్లు ద్వారా 95 శాతం మందికి ప్రయోజనం చేకూరుతుందన్నారు. రిజర్వేషన్ బిల్లుతో ప్రధాని మోదీ చరిత్రలో నిలిచిపోతారని ప్రభాత్ ఝా అన్నారు. ఈ బిల్లు భారత యువత గొంతుక అని ఆయన అభివర్ణించిన ఆయన బిల్లు ఆమోదం పొందడానికి అసెంబ్లీల అనుమతి అవసరంలేదన్నారు.

సిన్హా కమిషన్ నివేదికలో ఈబీసీ ప్రస్తావన ఉంది: కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్

విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ల కోసం ఆర్టికల్ 15, 16కు క్లాజ్ (6)ను అదనంగా జోడిస్తున్నామని కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ సభకు తెలిపారు. అగ్రవర్ణ పేదలకు 10 శాతం రిజర్వేషన్ బిల్లుపై రాజ్యసభలో చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... "రాజ్యాంగంలోని 46వ అధికరణ ఇదే మార్గనిర్దేశనం చేస్తోంది. వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి చర్యలు తీసుకునే అవకాశం కల్పిస్తోంది. 2010లో యూపీఏ హయాంలోనే సిన్హా కమిషన్ నివేదిక సమర్పించింది. సిన్హా కమిషన్ (తరువాయి 4లో)

సీబీఐ డైరెక్టర్‌గా విధులు చేపట్టిన

అలోక్ వర్మ

- సుప్రీం కోర్టు తీర్పుమేరకు బాధ్యతల స్వీకరణ



న్యూఢిల్లీ: సీబీఐ డైరెక్టర్ అలోక్ వర్మ మళ్లీ తన బాధ్యతలు స్వీకరించారు. సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో బుధవారం ఉదయం సీబీఐ కార్యాలయానికి చేరుకొన్న ఆయన తన పూర్వపు విధులు చేపట్టారు. అయితే కోర్టు తీర్పు మేరకు ఆయనకు పరిమితమైన అధికారాలు మాత్రమే ఉండనున్నాయి. సీబీఐ డైరెక్టర్ అలోక్ వర్మ, స్పెషల్ డైరెక్టర్ రాకేశ్ అస్థానా మధ్య విభేదాలు, పరస్పర కేసుల నేపథ్యంలో సీవీసీ సిఫారసు మేరకు గత ఏడాది అక్టోబరులో వీరిద్దరిని కేంద్రంప్రభుత్వం బలవంతంగా సెలవుపై పంపింది. అయితే దీన్ని సవాల్ చేస్తూ అలోక్‌వర్మ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆయన పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం మంగళవారం అలోక్ వర్మకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. సీబీఐ డైరెక్టర్ పదవిలో ఉన్న వ్యక్తిని సెలవులో పంపడం చెల్లదని సుప్రీంకోర్టు స్పష్టం చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్రం, సీవీసీ జారీ చేసిన ఆదేశాలను కొట్టివేసింది. అలోక్ వర్మను వెంటనే డైరెక్టర్ పదవిలో కూర్చోబెట్టాలని కేంద్రాన్ని ఆదేశించింది. అదే సమయంలో అలోక్ వర్మ అధికారాలకూ కత్తెర వేసింది. ఆయన పునర్నియామకంపై తదుపరి నిర్ణయాన్ని సీబీఐ డైరెక్టర్‌ను ఎంపిక చేసే ఉన్నతస్థాయి కమిటీకే వదిలేసింది. ఇందుకోసం ఎంపిక కమిటీకి సుప్రీం కోర్టు వారం రోజుల సమయం ఇచ్చింది. ఈ కమిటీలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ప్రధానమంత్రి, లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత సభ్యులుగా ఉంటారని పేర్కొంది. సెలెక్షన్ కమిటీ తేల్చేదాకా అలోక్ వర్మ ఎలాంటి విధానపరమైన నిర్ణయాలు తీసుకోరాదని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. సుప్రీం కోర్టు తీర్పుమేరకు అలోక్ వర్మ బుధవారం సీబీఐ కార్యాలయానికి చేరుకుని తన విధులకు హాజరయ్యారు. అయితే సీబీఐ డైరెక్టర్ అలోక్ వర్మ రెండేళ్ల పదవీ కాలం ఈ నెల 31తో ముగియనుంది.

అత్యున్నత స్థాయి కమిటీ నుంచి తప్పుకున్న సీజేఐ

మరోవైపు సీబీఐ డైరెక్టర్ అలోక్ వర్మ విషయంలో నిర్ణయం తీసుకోనున్న అత్యున్నత స్థాయి కమిటీ నుంచి సుప్రీంకోర్టు ప్రధాన (తరువాయి 4లో)

మౌలిక సదుపాయాలపై

దృష్టి పెట్టాలి..

- మార్చి నాటికి పనులు పూర్తి చేయాలి
- రైల్వే బోర్డు ఛైర్మన్ వినోద్‌కుమార్ యాదవ్

విజయక్రాంతి, హైదరాబాద్ : మౌలిక సదుపాయాల అభివృద్ధిపై దృష్టి సారించాలని రైల్వే బోర్డు ఛైర్మన్ వినోద్‌కుమార్ యాదవ్ అధికారులను ఆదేశించారు. న్యూఢిల్లీ నుంచి ఆయన రైల్వే జోన్ల జనరల్ మేనేజర్‌లు, రైల్వే వికాస్ నిగమ్ లిమిటెడ్ (ఆర్‌వీఎన్‌ఎల్), కోర్ ల అధికారులతో మాట్లాడారు. రైల్వే అభివృద్ధిపై ప్రధాన మంత్రి కార్యాలయం, రైల్వే, బొగ్గు శాఖల మంత్రులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో పూర్తి చేయతలపెట్టిన పనులన్నింటిని మార్చి నాటికి పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. నూతన రైలు మార్గాల నిర్మాణం, డబ్లింగ్, ట్రిప్లింగ్ తదితర ప్రాజెక్టు పనులను పూర్తి చేయాలన్నారు. అడిషనల్ జనరల్ మేనేజర్ జాన్ థామస్ సమీక్షా సమావేశంలో పాల్గొని నివేదిక సమర్పించారు.



కాపలాదారుడిని బెదిరించలేరు



- 'మిషెల్'తో సంబంధం వెల్లడించండి
- 'ఈబీసీ'తో ప్రజలకు మేలు
- 'పౌరసత్యం'తో ఈశాన్య రాష్ట్రాలకు ఇబ్బంది లేదు
- ప్రధాని మోదీ

విజయక్రాంతి, ఢిల్లీ: 'అవినీతిని తుదముట్టించే కాపలాదారుడిని బెదిరంచలేరు, కొనలేరు... అటువంటి ప్రయత్నాలు చేసినా.. అవిశ్రాంతంగా పని చేసే కాపలాదారుడు తప్పు చేసిన వారిని చీకట్లో కూడా పట్టుకోగలడు.' అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. అగస్టా వెస్ట్‌ల్యాండ్ హెలికాప్టర్ల కొనుగోలు ఒప్పందం కేసులో నిందితుడిగా ఉన్న క్రిస్టియన్ మిషెల్‌ను దేశానికి రప్పించిన అంశాన్ని పరోక్షంగా ప్రస్తావిస్తూ పై విధంగా వ్యాఖ్యానించారు. షోలాపూర్, లక్నోలలో బుధవారం జరిగిన బహిరంగ సభల్లో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకపడ్డారు. అగస్టా హెలిక్యాప్టర్ల కేసులో అరెస్టయినా క్రిస్టియన్ మిషెల్.. రఫేల్ డీల్ విషయంలోనూ జోక్యం చేసుకునేందుకు ప్రయత్నించారన్న వార్తలను ప్రస్తావిస్తూ దీనిపై కాంగ్రెస్ సమాధానం చెప్పాలని అన్నారు. ఈ సందర్భంగా మిషెల్‌తో ఏ కాంగ్రెస్ నేతకు సంబంధాలున్నాయో ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు.

'ఈబీసీ'తో ప్రజలకు మేలు

ఆర్థికంగా వెనుకబడిన వారికి విద్య, ఉద్యోగాల్లో 10 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి తెచ్చిన బిల్లు కారణంగా ప్రజలకు మేలు జరుగుతుందని మోదీ తెలిపారు. అయితే ఈ బిల్లుకు వ్యతిరేకంగా కొంత మంది ప్రచారం చేస్తున్నారని కాంగ్రెస్‌ను ఉద్దేశించి ఆరోపించారు. పది శాతం రిజర్వేషన్ వల్ల బలహీన వర్గాలకు కేటాయించిన రిజర్వేషన్లకు ఎంతమాత్రం విఘాతం కలగదని ప్రధాని హామీ ఇచ్చారు. దళితులు, గిరిజనులు సహా బడుగు వర్గాల హక్కులకు కొత్త బిల్లుతో ఎలాంటి ఇబ్బంది ఉండదని స్పష్టం చేశారు. బలహీన వర్గాల నుంచి రిజర్వేషన్ ఊడలాక్కుని అగ్ర వర్ణాల వారికి ఇస్తారంటూ విపక్షాలు జరుపుతున్న ప్రచారంలో ఎంత మాత్రం నిజం లేదన్నారు. పది శాతం అనేది అదనపు కోటా కిందకు వస్తుందన్నారు. పౌరసత్వ సవరణ–2018 బిల్లుపైనా ఆయన స్పందిస్తూ ఇది చాలా కీలకమైన బిల్లు అని పేర్కొన్నారు. బంగ్లాదేశ్, పాకిస్థాన్, ఆఫ్ఘనిస్తాన్ నుంచి వచ్చే ముస్లిమేతరులకు భారత పౌరసత్వం కల్పించే కీలకమైన బిల్లు అని స్పష్టం చేశారు. భారతదేశంలో నివసించాలని కోరుకునే ఇతర దేశాల వలసదారులకు దీనిద్వారా భారత పౌరసత్వం లభిస్తుందన్నారు. బిల్లు నిబంధనల వల్ల అసోం, ఈశాన్య రాష్ట్రాల ప్రజల హక్కులను హరించడం ఉండదని ప్రధాని స్పష్టం చేశారు. ఈ రెండు బిల్లులపై విపక్షాలు లేవనెత్తిన అభ్యంతరాలను ఆయన తోసిపుచ్చారు. అబద్ధాలను ప్రచారం చేయడమే పనిగా పెట్టుకున్న విపక్షాలకు పార్లమెంటులో గట్టి జవాబిచ్చామని అన్నారు. ఈ రెండు బిల్లులకు ఆమోదం లభించడం ద్వారా 'సబ్ కా సాత్ సబ్ కా వికాస్' సిద్ధాంతం బలపడిందన్నారు. రఫేల్‌పై అనవసర రాద్ధాంతం చేస్తున్న కాంగ్రెస్‌కు రక్షణ శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ గట్టి జవాబిచ్చారని కొనియాడారు. ఈ సందర్భంగా ఆమెకు నారీ శక్తి అని మోదీ కితాబిచ్చారు.

శంకుస్థాపనలు–ప్రారంభోత్సవాలు

షోలాపూర్– ఉస్మానాబాద్ నాలుగు లైన్ల రోడ్డును మోదీ ప్రారంభించారు. దీనికి 2014లో ఆయన శంకుస్థాపన చేశారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన క్రింద 30 వేల గృహాల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. సొంతిళ్లు లేని చెత్త ఏరుకునేవారు, రిక్షా కార్మికులు, బీడీ కార్మికుల కోసం వీటిని నిర్మించనున్నారని తెలిపారు.

రైతుల సత్తా మోదీకి తెలిసింది



- మూడు రాష్ట్రాల్లో కాంగ్రెస్‌కు పట్టం కట్టింది రైతులే
- రుణాల రద్దుపై మోదీ విధాన నిర్ణయం తీసుకోవాలి
- జైపూర్ సభలో రాహుల్‌గాంధీ

జైపూర్ : దేశంలో రైతుల సత్తా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి తెలిసివచ్చిందని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ అన్నారు. రాజస్థాన్ రాజధాని జైపూర్లో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన శాసన సభల ఎన్నికల్లో రైతులు తమ సత్తా చూపించారన్నారు. మధ్య ప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్గఢ్ రాష్ట్రాల్లో బీజేపీని ఓడించి, ప్రభుత్వాలను ఏర్పాటు చేసిన కాంగ్రెస్ రైతు రుణాలను రద్దు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో రాహుల్ మాట్లాడుతూ ఒత్తిడిలో ఉన్న వ్యవసాయ రంగంలో సమస్యల పరిష్కారానికి రైతు రుణాల రద్దు చాలా చిన్న ముందడుగు అని తెలిపారు. నరేంద్ర మోదీ సర్కార్ పై కాంగ్రెస్ చీఫ్ రాహుల్ గాంధీ క్రికెట్ పరిభాషలో నిప్పులు చెరిగారు. మోదీ బ్యాక్‌ఫుట్‌లో ఆడుతున్నారని..రైతులు, యువత ముందుకొచ్చి సిక్సర్లు బాదాలని పిలుపు ఇచ్చారు. రైతులకు వ్యవసాయ క్షేత్రం వద్దే ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేసి వారి టమోటాలు, బంగాళాదుంపలను ఎగుమతి చేస్తామని రాహుల్ హామీ ఇచ్చారు.

కాంగ్రెస్ సర్కార్ రాగానే రైతు రుణాల రద్దు

రానున్న సార్వత్రిక ఎన్నికలో తాము కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయగానే దేశవ్యాప్తంగా రైతు రుణాలను మాఫీ చేస్తామని రాహుల్ రైతులకు హామీ ఇచ్చారు. వ్యవసాయ రుణాల మాఫీ రైతులకు ఉపశమనం కలిగిస్తుందని, అయితే ఇది ఒక్కటే తుది పరిష్కారం కాదన్నారు. రఫేల్ ఒప్పందంపై సంయుక్త పార్లమెంటరీ కమిటీచే విచారణ జరిపించాలని ఆయన పునరుద్ఘాటించారు. రఫేల్‌పై పార్లమెంట్లో చర్చ జరిగితే ప్రధాని పత్తా లేరని, రెండున్నర గంటలు మాట్లాడిన రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ తాము అడిగిన ఏ ప్రశ్నకూ బదులివ్వలేదని ఆరోపించారు.

దిమాక్ ఖరాబ్



అన్నివర్గాలనూ మోసం చేసిన చంద్రబాబు

- పాదయాత్ర ముగిసినా పోరాటం కొనసాగుతుంది
- ఇచ్ఛాపురంలో పాదయాత్ర ముగింపు సభలో వైఎస్ జగన్



విజయక్రాంతి, ఇచ్ఛాపురం: పాదయాత్ర ముగింపు సభలో ఏపీ సీఎం చంద్రబాబుపై ప్రతిపక్ష నేత జగన్ విరుచుకుపడ్డారు. చంద్రబాబు అసమర్ధపాలనలో రైతుల అప్పులు పెరిగాయని దుమ్మెత్తిపోశారు. రైతు రుణమాఫీ పెద్ద మోసమని, రైతులు కష్టాల్లో ఉంటే జాతీయ రాజకీయాలంటూ సీఎం డ్రామాలు ఆడుతున్నారని ధ్వజమెత్తారు. రైతులకు ఏ పంటకూ గిట్టుబాటు ధర రాలేదని ఆరోపించారు. చంద్రబాబు పాలన చూస్తుంటే ఆందోళన కలుగుతోందని, నిరుద్యోగ భృతి పేరుతో యువతను మోసం చేశారని జగన్ మండిపడ్డారు. మేనిఫెస్టోలో 650 వాగ్దానాలు పెట్టి మోసం చేశారని, చంద్రబాబు పాలనలో ఓ వైపు కరవు, మరోవైపు తుపాను వచ్చాయని విమర్శించారు. దళారీ వ్యవస్థకు చంద్రబాబు నాయకుడని జగన్ విరుచుకుపడ్డారు.

పాదయాత్ర ముగింపులో హామీల వర్షం

ఇచ్ఛాపురంలో ఏపీ విపక్ష నేత జగన్ ప్రజలపై హామీల వర్షం కురిపించారు. ప్రతి పార్లమెంట్ నియోజకవర్గాన్ని జిల్లాగా చేస్తానని, రైతు జీవితాన్ని పూర్తిగా మారుస్తామని భరోసా ఇచ్చారు. ప్రజా సంకల్ప యాత్ర పేరుతో 2017 నవంబర్ 6న కడప జిల్లా ఇడుపులపాయలో ప్రారంభమైన జగన్ పాదయాత్ర 341 రోజుల పాటు 3,648 కి.మీ మేర సాగింది. (తరువాయి 4లో)

ఆర్టీసీ ఎన్నికలు ఇప్పట్లో లేనట్టే

- ఆసక్తి చూపని సర్కారు
- వరుస ఎన్నికలతో జాప్యం



విజయక్రాంతి, హైదరాబాద్: ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికలపై నీలి మేఘాలు కమ్ముకున్నాయి. గుర్తింపు సంఘం గడువు ముగిసి నాలుగు నెలలు గడిచినా.. ఇప్పటివరకూ ఎన్నికల అంశంపై ఒక్క అడుగు కూడా ముందుకు పడడం లేదు.

ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికలు 2016 ఆగస్టులో జరిగాయి. ఆ ఎన్నికల్లో టీఆర్ఎస్ అనుబంధ సంఘమైన తెలంగాణ మజ్దూర్ యూనియన్ (టీఎంయూ) ఒంటరిగానే గెలుపు సాధించింది. నిబంధనల ప్రకారం గెలుపొందిన కార్మిక సంఘం టీఎంయూ రెండేళ్ల పాటు గుర్తింపు సంఘంగా కొనసాగింది. గత ఆగస్టుతో గడువు ముగియడంతో మళ్లీ ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా.. ఇప్పటివరకూ ఎన్నికలపై ఎలాంటి కసరత్తు జరగడం లేదు. గుర్తింపు సంఘం గడువు ముగియడంతో ఎన్నికలు నిర్వహించాలని ఆర్టీసీ కార్మిక సంఘాలు లేబర్ కమిషన్‌ను పలుమార్లు కోరాయి. అయితే లేబర్ కమిషన్ అధికారి గంగాధర్‌ను ఆర్టీసీ ఎన్నికల అధికారిగా నియమించి నెల గడిచిపోయింది. ఎప్పుడు ఎన్నికలు జరిగినా.. సంబందిత ప్రక్రియ దాదాపు మూడు నెలల పాటు సాగుతుందని కార్మిక సంఘాల ప్రతినిధులు చెబుతున్నారు. ఎన్నికల అధికారిని నిమించి నెల గడిచినా.. (తరువాయి 4లో)







సూక్తి సుధ

వేదం బోధించేది ధర్మానుగుణమైన నియమబద్ధమైన జీవితం.
సమాజ కళ్యాణం చేకూర్చే విధంగా స్వధర్మాన్ని ఆచరించటం.
– శ్రీ కంచి పరమాచార్య

తిరుప్పావై పాశురం–26



మాలే! మణివణ్ణా! మార్గళి నీరాడువాన్
మేలైయార్ శియ్యనగళ్ వేణ్డువన కేట్టియేల్
ఇలత్తై యెల్లామ్ సదుజ్ఞ మరల్వన
పాలన్న వణ్ణత్తు ఉన్న పాఞ్చశన్నియమే
పోల్వన శజ్ఞజ్గళ్ పోయ్ప్పాడు డైయనవే
శాప్పెరుమ్ పఱైయే పల్లాణ్డిశైప్పారే
కోలవిళక్కే, కొడియే వితానమే
అలినిలై యాయ్! అరుళేలో రెమ్బావాయ్!

'ఆశ్రిత వ్యామోహం కలవాడా! ఇంద్రనీలమణిని పోలిన కాంతి స్వభావం కలవాడా! చిన్న మర్రి ఆకుపై పరుండి, అఘటిత ఘటనా సామర్థ్యం కలవాడా! మేము మార్గశీర్ష స్నానంను చేయగోరి ఆ వ్రతానికి కావలసిన పరికరాలను కోరి వచ్చితిమి. ఈ వ్రతాన్ని పూర్వులు ఆచరించి ఉన్నారు. నీవు విన్నచో కావలసిన పరికరాలను తెలిపెదము.

ఈ భూమండలమంతయు వణుకునట్లు శబ్దం చేయు పాలవలె తెల్లనైన నీ పాంచజన్య శంఖాన్ని పోలిన శంఖాలు కావాలి. మంగళ దీపాలు కావాలి. ధ్వజాలు కావాలి. మేలుకట్లు కావలి. దయచేసి ప్రసాదింపుము.'

శ్రీకృష్ణునకు మణికి పోలిక చెప్పారు.

మణి ఉన్నవారు ఉన్నవారిగా, మణి లేనివారు లేనివారిగా పరిగణింతురు. భగవంతుడు కలవాడనువారు ఉన్నవారు. భగవంతుడు లేడనువారు, లేనివారుగా ఉందురు. మణి ఉన్నవారిని అందరూ గౌరవింతురు. భగవంతుని భక్తునికి అందరూ దాసోహమంటారు. గొప్పవారు ధరింతురు. చిన్నవారు అమ్ముకొని బతుకుదురు.





భగవంతుని అనుభవించి ఆనందించు వారు భగవంతుని నలుగురికి తెలిపి ధనం సంపాదించువారుందురు.

ఇక్కడ స్నానం అనగా భగవద్గుణాశ్లేషమే అని తెలియాలి. ఇది ప్రపన్నులు ఆచరించు కైంకర్యంగా తెలియాలి. అనగా కర్మలను త్యజించక ఫలసంగకర్తృత్వ త్యాగపూర్వకంగా ఆచరించుటే ఈ స్నానం అని అభిప్రాయం.

శిష్టాచారానుసరణంగా అనగా భగవత్భాగవతాచార్యాజ్ఞానుసరణంను సూచించును.

ఇక్కడ శంఖం అనగా ప్రణవం. ప్రణవం భగవచ్ఛేషత్వంను బోధించును. కైంకర్యం లేనిదే శేషత్వం నిలువదు. కావున ప్రణవ శబ్దానికి కైంకర్యం అర్థం. ఆ కైంకర్యాలు పలు విధాలుగా ఉండటమే పలు శంఖాలు అడగటంలో ఓ తాత్పర్యం.

ఇక చాలా పెద్ద వరం అనగా అష్టాక్షరిలోని 'నమః' పదం. ఇక్కడ పెద్ద చాలాపెద్ద అనుటలో పరిణామం కాక అర్ధ బోధనలో పెద్దతనం. ఇచట ప్రణవం కన్ననూ నారాయణ పదం కన్నను చాలా అర్థాన్ని బోధిస్తున్నది. స్వరూపంలోని పురుషార్థంలోని దోషాన్ని పోగొట్టునది నమః పదమే. కావున చాలా పెద్దవరం అనగా నమఃపదమని తెలియాలి. కైంకర్యంలోని ఆనందం శ్రియఃపతిదే కాని తనకు కాదని బోధించి వాని దోషాలను తొలగించును. పండులోని గుణాలు భోక్తకు ఆనందం ఇచ్చును. కాని పండుకు ఈయజాలవు కదా. నమః పదం ఇటు ప్రణవంలోను అటు నారాయణ పదంలోను అన్వయించునది. కావున చాలా పెద్దది అని అభిప్రాయం.

'ఇక పల్లాండి శైప్పారే' అనగా మంగళాన్ని పాడు వారు అనగా పరమ భాగవతోత్తములతో సహవాసం. అనగా సత్సంగతి. సత్సాంగత్యమే పురుషార్థ సీమను చేర్చునది. పరమాత్మను సేవించువారికి కార్యసిద్ధి కలుగకపోవచ్చును కానీ భక్తులను సేవించే వారికి తప్పక కార్యసిద్ధి కలుగును.

'కోలవిలక్కే' అందమైన మంగళదీపం. ఇతర పదార్థాల యధార్ధ స్వరూపాన్ని ప్రకాశింపచేసేది దీపం. జీవుని భగవచ్ఛేషత్వం మంగళ దీపం. దీని సౌందర్యం అనగా భాగవత శేషత్వ జ్ఞానమని తెలియచేయటమే. ఈ భాగవత శేషత్వం శ్రీవైష్ణవ సర్వస్వమగు అష్టాక్షరీ మంత్రంలోని ప్రణవ నమః నారాయణ పదాలతో తెలియచేయు అత్యంత రహస్య సర్వస్వంగా పేర్కొనవచ్చును.

ఇక 'కొడియే' అనగా ధ్వజం. ధ్వజం అనగా సూచకం కదా. శేషత్వానికి సూచకం కైంకర్యం. కావున ధ్వజం అనగా కైంకర్యమని భావం. ఈ కైంకర్యం ప్రార్థించిననే లభించును. శ్రియఃపతి అంగీకరించినపుడే ఇది పురుషార్థమగును.

ఇక 'వితానం' అనగా చాందినీ, అనగా దారిలో నడుచువారికి పైనుండి మంచు మొదలగునవి పడకుండా రక్షణగా ఉండునది. 'కొడి' అనగా కైంకర్యమన్నాం కదా! కైంకర్యం వల్ల కలుగు ఆనందం తనది అను బుద్ధి ఉండరాదు. అనగా భోక్తృ త్వబుద్ధి నివృత్తి. ఇదే వితానం.

ఇట్లు అనన్యార్హ శేషత్వ జ్ఞానం, పారతంత్ర్య జ్ఞానం, భాగవత సహవాసం, భాగవత శేషత్వ జ్ఞానం భగవత్కైంకర్యం. కైంకర్యాన భోక్తృత్వబుద్ధి నివృత్తి కావాలని కోరారని అభిప్రాయం.



డా. బాలుశర్మ పన్నాల

దైవం ఎవరిపై ఎలా ఉండును?

చాణక్యం


శ్లో।। అగ్నిర్దేవో ద్విజాతీనాం మునీనాం హృదిదైవతమ్।
ప్రతిమా స్వల్ప బుద్ధీనాం సర్వత్ర సమదర్శినః।।

బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులను ద్వీజాతులవారికి అగ్నిహోత్రమే(యజ్ఞం) దేవుడు. మునులకు దైవం హృదయంలో ఉంటుంది. స్వల్పబుద్ధులు కలవారికి విగ్రహంలో ఉంటుంది. అంతటిని సమానంగా చూసే సమదర్శులకు దైవం అంతా కలిగి ఉంటుంది. పై మూడు వర్ణాల వారికి అగ్నిహోత్రం చేసే అర్హత ఉంటుంది. వారికి ప్రత్యక్ష దైవం అగ్నియే.

వారు అగ్నికి నిత్యపూజ చేయవచ్చు. రోజూ యజ్ఞం చేయవచ్చు. మునులకు దేవుడంటూ ప్రత్యేకంగా ఉండవలసిన అవసరం లేదు. వారి హృదయమే దైవం. వారు ఎల్లవేళలా తమను తాము పూజించుకుంటూనే ఉంటారు. ఇక దైవం మీద ప్రత్యేక అవగాహన అంటూ లేనివారికి మొక్కుబడిగా విగ్రహాన్ని నమస్కరించుకుంటే చాలు అనుకుంటారు. అంతటినీ, అందరినీ సమానంగా చూసే సమదర్శులకు దైవం అంతటా కలిగి ఉంటుంది. ఇక దైవపూజ విషయంలో మూర్తి పూజ (విగ్రహారాధన) అథమం.

ఉత్తమా సహజావస్థా మధ్యమా ధ్యాన ధారణా!
అధమా మూర్తిపూజా చ తీర్థయాత్రాఽధమాఽధమా।।

సహజావస్థ ఉత్తమం, ధ్యానధారణం మధ్యమం, మూర్తి పూజ అధమం, తీర్థయాత్రలు చేయటమనేది అధమాధమం. ఈ శ్లోకంలో కూడా మనుషులకు వారికి సహజంగా ఉండే గుణాన్ని బట్టి వారి ప్రవర్తనలుంటాయి. ఇది ఉత్తమం అని పై శ్లోకంలో చెబుతున్నారు. తర్వాత మధ్యమంగా చెప్పేది ధ్యానం చేయటం, ఇక మూర్తి పూజ అంటే విగ్రహారాధన చేయడం అధమం. తీర్థయాత్రలు చేయడం అనేది అధమాధమంగా చెప్పబడుతోంది. ఈ విధంగా భిన్న రీతిలో పూజలు జరుపుకోవచ్చునంటున్నారు చాణక్యులవారు తమ నీతిశాస్త్రంలో.



యత్తీర్థబుద్ధిః సలిలేన కర్హిచిత్,
జనేష్వభిజ్ఞేషు న ఏవ గోఖరః – అని శ్లోకంలో చెప్పబడుతోంది. ఎవరైతే వాత, పిత్త, కఫాలను త్రిధాతువులతో కూడిన శరీరాన్ని ఆత్మీయంగా ప్రేమించునో, స్త్రీ, పుత్రాదులందు మమకార బుద్ధి కలిగి ఉంటుందో, ఎవడు మూర్తియందు (విగ్రహం) పూజ చేయాలనే తపనతో ఉంటారో, ఎవరైతే నీటియందు తీర్థబుద్ధితో వ్యవహరిస్తారో వారు విద్వాంసుల దృష్టిలో ఆవుల కోసం వేసే మేత మోయు ఎద్దో, గాడిదయో అవుతారని చాణక్యుల వారు తమ నీతిశాస్త్రంలో తెలుపుతున్నారు.

చింతామణి రఘునాథాచార్య (జనన – శక. 1750)

వేద విజ్ఞానం

భాగం–75

ఈయన 17 సంవత్సరాలకాలం మద్రాస్‌లోని ఖగోళ వేధశాలలో మొదటి సహాయకునిగా నియమించబడ్డాడు. వారణాసి ప్రాంతంలో బాపూదేవ్ వలె, మహారాష్ట్రలో కేరోపంత్ వలె, మద్రాస్ ప్రెసిడెన్సీ ప్రాంతంలో చింతామణి రఘునాథ ఆచార్య అంత సాధికారికత కలిగినవాడు. సౌరమానం ప్రకారం శక. 1749లో సర్వజిన్నామ సం।। పంగుణి శుద్ధ షష్ఠినాడు, చాంద్రమాన పంచాంగం ప్రకారం శక.1750 చైత్ర శుక్ల విదియనాడు, అంటే 17 మార్చి, క్రీ.శ 1828లో జన్మించాడు. ఈయన జన్మస్థానం(తమిళ ప్రాంతం), మాతృభాష తమిళం (ద్రవిడం) తనకు సంస్కృతం రాదని తానే చెప్పుకున్నాడు. అయితే యూరోపియన్ ఖగోళశాస్త్రం, గణితం పైన అదే సమయంలో భారతీయ ఖగోళశాస్త్రంపైన సాధికారమైన జ్ఞానం కలిగినవాడు. అనేక సంవత్సరాలు ఖగోళ పరిశీలనలు చేస్తూండేవాడు. ఆ విధంగా అతను చాలా ప్రాచుర్యాన్ని పొందాడు. 1872 నుండి రాయల్ ఆస్ట్రనామికల్ సొసైటీ ఇంగ్లండ్ ఫెలోగా ఉండేవాడు. 1847లో మద్రాసు వేధశాలలో ఉద్యోగిగా ప్రవేశించినది మొదలు చివరి వరకు అక్కడే పనిచేశాడు. ఈయన శక.1801 ఫిబ్రవరి 5న మరణించాడు. వీరి కుటుంబమంతా ఖగోళశాస్త్రవేత్తలే. ఈయన తండ్రి మద్రాస్ వేధశాలలో సహాయకునిగా ఉండేవాడు. మద్రాస్ వేధశాలవారు సంకల నం చేసిన నక్షత్రాల కేటలాగులలోని అనేక నక్షత్రాలు చింతామణితో నమోదు చేయబడినవే. అంతేకాక 1867, 1878లో రెండు నూతన నక్షత్రాలను గుర్తించాడు. ఈ విధంగా ఇటువంటి క్రొత్త ఆవిష్కరణ చేసిన మొట్టమొదటి భారతీయ ఖగోళవేత్తగా గుర్తింపును పొందాడు.

సంకలనాలు

ఈయన జ్యోతిష చింతామణి అనే గ్రంథం సంకలనం చేశాడు. ఇందులో మూడు భాగాలు ఉన్నాయి. మొదటి భాగంలో మధ్యస్థితులు, భూమి, ఇతర గ్రహాల పరిమాణం, ఘనత చెప్పబడ్డాయి. రెండవ భాగంలో స్పష్టగ్రహాలు వాటి గతులు వివరించబడ్డాయి. మూడవ భాగం పేరు కరణ పద్ధతి. ఇందులో గ్రహగణితానికి చెందిన పట్టికలు ఇవ్వబడ్డాయి. ఈ మూల గ్రంథం తమిళ భాషలో సంకలనం చేయబడింది. క్రీ.శ. 1874లో మద్రాస్‌లో జరిగిన సమావేశంలో ఈ గ్రంథం సంస్కృత అనువాదాన్ని తెలుగు, తమిళ, దేవనాగరి లిపులలో ముద్రించాలని నిర్ణయం తీసుకున్నారు. ఒక భాషలో సుమారు 800 పేజీలతో డెమి ఆక్టేవ్ సైజ్‌లు 500 కాపీలు ముద్రించడానికి రూ.7,000 ఖర్చు అవుతుందని అంచనా కారణంగా, ఇది ముద్రణకు నోచుకోలేదు.

మనం అంతే...

నాబలం.. నా తెలివి తేటలు.. నా కార్యదక్షత .. నేను.. నా.. అనే అంటూ ఉంటాం. కొంచెం పరిస్థితులు పట్టుదప్పగానే దేవుడికే పరీక్షలు పెడతాం. నువ్వు ఉంటే నన్ను గట్టెంకించాలి, నువ్వున్నది నిజమయితే, మా అమ్మాయికి పెళ్లి కావాలి అంటూ ఆయన ఉనికిని కాపాడుకోమని ఆయనకే సవాలు విసురుతాం. ఆతరువాత ఆయనతో డీల్ పెట్టుకుంటాం. పరీక్షలో పాస్ చేయిస్తే గుండు కొట్టించుకుంటా, నీ హుండీలో వంద రూపాయలు వేస్తా , మెట్లెక్కి వస్తా , కళ్యాణం చేయిస్తా , అది చేస్తే సత్యనారాయణ వ్రతం చేస్తా . ఇది చేస్తే గుడి కట్టిస్తా. ఇలా అన్నిటికీ మనవి అగ్రిమెంట్లే. దేవుడికి లంచమో, కమిషనో ఆఫర్ చేస్తాం. ఈ మాత్రం ఆఫర్ ఇచ్చే వారు కరువయ్యారు అనుకుని పాపం ఆయన చేస్తున్నాడేమో? చాలాసార్లు అలా చేయకపోతే నేను లేనని అనుకుంటారేమోనని ఆయన చేయాల్సి వస్తుందట. భగవతంలోనే ఒకచోట వాడు నా కొరకు రక్షింపవలయు అన్నాడు శ్రీహరి. నేనున్నానని నిరూపించుకోవడానికయినా, లేదా నాకోసం భక్తుడిని రక్షించాల్సిందే అన్నది ఆయన విధానం.

మధు


గురియే గదా గురువు? (రమణాశ్రమ లేఖలు)

ఒకసారి రామయోగిగారు భగవానులను ఇలా ప్రశ్నించారు. 'స్వామీ! సాయిబాబా శిష్యులు కొందరు బాబా పటం పెట్టుకొని పూజిస్తూ ఆ పటమే గురువంటారే ఎట్లా పొసగుతుంది? దైవమని పూజింపవచ్చుగాని గురువని సేవిస్తే వీరు పొందే లాభమేమిటి?' 'చిత్తైకాగ్రత కలుగుతుం'దన్నారు భగవాన్. కాని ఆ ఏకాగ్రత స్థిరపరచుకోటానికి గురువు కావద్దా? అన్నారు యోగిగారు. 'అవునంది గురియే గదా గురువు' అన్నారు భగవాన్. 'ఆ గురి కుదరటానికి ఆచరణ రూపంగా చూపించే సజీవ గురువు కావాలిగాని, నిర్జీవ ప్రతిమ ఏం చేస్తుంది? అట్లా సజీవ గురువు లేకుండానే సిద్ధి పొందటం భగవాన్ కంటె సరిపోయిందిగాని మా బోంట్లకు సాధ్యమా? అన్నారు వారు.

'వాస్తవమే, అయినా, నిర్జీవ ప్రతిమను ఆరాధించినందువల్ల కొంతవరకు చిత్తైకాగ్రత కలుగుతుంది. ఆ ఏకాగ్రత స్థిరపడుటకు తానెవరో విచారించి తెలుసుకుంటేగాని కుదరదు. ఆ విచారణకు గురుసహాయం అవసరమే. అందుకే ఉపాసనతో ఆగకూడదంటారు పెద్దలు. అయితే, ఈ ఉపాసన వృథాకాదు. ఎప్పటికైనా ఫలిస్తుంది. కాని ఈ ఉపాసనలో డాంబికం ఉండరాదు. మనసు స్వచ్ఛంగా ఉంటే అంతా ఫలిస్తుంది. లేకుంటే చవిటి నేలన నాటిన విత్తనముల వలె వృథా అవుతుంది" అన్నారు భగవాన్.


'ఏమో స్వామి! మీరు నూరు చెప్పండి వెయ్యి చెప్పండి. తన నడత సరిచూచుకోటానికి మీవంటి సజీవ గురువు కావాలిగాని, నిర్జీవ ప్రతిమలకు గురుస్థానం ఎట్లా ఇవ్వటం?' అన్నారు వారు. భగవాన్ మందహాసంతో 'ఊ ఊ' అంటూ తలూపి మౌనం వహించారు. మౌనసహితమైన ఆ మందహాసంలో మాణిక్యాలు ఒలికినయ్యన్నా! ఏం వ్రాయమంటావు?

–సూరి నాగమ్మ



ధర్మ సందేహాలకు సమాధానాలు

త్రిశంకు స్వర్గం అంటుంటారు కదా! ఏమిటి?



అటూ, ఇటూ కాకుండా మధ్యలో ఊగిసలాడే వ్యక్తులను గూర్చి త్రిశంకుస్వర్గం అనే మాటను ఉపయోగిస్తారు. త్రిశంకుడు ఇక్ష్వాకు వంశానికి చెందిన త్రయ్యారణ్యుని కుమారుడు. ఈయనకు సత్యవ్రతుడు అనేది అసలు పేరు. ఈ సత్యవ్రతుడు యువరాజుగా ఉన్నప్పుడు ఒక వివాహితను బలవంతం చేయడానికి ప్రయత్నిస్తే, తండ్రి, కులగురువు వశిష్ఠుని ముందే నిందించి రాజ్యబహిష్కరణ చేస్తాడు. సత్యవ్రతుడు రాజ్యబహిష్కృతుడైన తర్వాత రాజ్యంలో కరువు కాటకాలు సంభవించాయి. వశిష్ఠమహర్షి రాజ్యసంరక్షణ చేస్తున్న సమయంలో ఈ విపత్తు వచ్చింది.

అదే సమయంలో విశ్వామిత్రుడు తపస్సుకోసం వెళ్ళాడు. అడవిలో విశ్వామిత్రుని భార్యబిడ్డలు ఆకలితో బాధపడుతున్నారు. విశ్వామిత్రుని భార్య తన కుమారుల్లో ఒకని కంఠానికి త్రాడు కట్టి ఈ బాలుణ్ణి తీసుకొని నూరు గోవులిస్తారా! మా కుటుంబ పోషణాభారం వహిస్తారా! అని గట్టిగా అరిచింది. ఆమె ఆవేదన చూసిన సత్యవ్రతుడు, విశ్వామిత్రుని కుటుంబాన్ని పోషించడానికి ఒప్పుకున్నాడు. తన తండ్రి బహిష్కరిస్తుంటే వశిష్ఠుడు మందలించ లేదన్న కోపంలో విశ్వామిత్రుని కుటుంబాన్ని రక్షించాలన్న ఉద్దేశ్యంతో, వశిష్ఠుని హోమధేనువును దొంగలించి ఆ మాంసాన్ని తానే తిన్నాడు సత్యవ్రతుడు. దాంతో కోపించిన వశిష్ఠుడు తండ్రిని కష్టపెట్టడం, హోమధేనువును వధించడం, గోమాంస భక్షణం చేయడం అనే మూడు పాపాలను చేసినందుకు నీకు త్రిశంకుడుగా పేరు స్థిరపడుతుందని శపించాడు.

తండ్రి మరణానం తరం త్రిశంకుడు రాజ్యానికి రాజయ్యాడు. కొన్నేళ్ళ తర్వాత సశరీరంగా త్రిశంకుడు స్వర్గానికి వెళ్ళాలని వశిష్ఠుడిని, ఆయన కుమారులను అర్థించాడు.

పాపపుణ్యాలు, కర్మ పరిపక్వత వల్ల స్వర్గనరకాలు లభిస్తాయని, అందుకు తగిన శరీరం ఏర్పడుతుందని వారు చెప్పారు. వారిమాటలను లెక్కపెట్టని త్రిశంకుడు వాళ్ళను నిందించాడు. దాంతో వశిష్ఠ కుమారులు త్రిశంకుడిని వికృత రూపం ధరించమని శపించారు. జరిగిన విషయమంతా విశ్వామిత్రునికి వివరించాడు త్రిశంకుడు. తనను సశరీరంగా స్వర్గానికి వెళ్ళే యాగం చేయమని కూడా విశ్వామిత్రుడిని అర్థించాడు. యాగం చేయడానికి సంకల్పించిన విశ్వామిత్రుడు ఋత్విక్కుల్ని ఆహ్వానించాడు.

అసమంజసమైన ఈ యాగానికి ఋత్విక్కులెవరు రాలేదు. విశ్వామిత్రుడొక్కడే యాగం నిర్వహించి తపఃఫలం ధారపోసాడు. స్వర్గానికి వెళ్ళిన త్రిశంకునికి గురువు శాపం అడ్డొచ్చింది. ఇంద్రుడు స్వర్గం నుండి కిందకు గెంటేసాడు. విశ్వామిత్రుణ్ణి పార్థించాడు త్రిశంకుడు. మహర్షి త్రిశంకుణ్ణి మధ్యలోనే ఆపి అక్కడే తన తపోబలంతో స్వర్గాన్ని సృష్టించాడు. అలా చేయవద్దని ఇంద్రుడు విశ్వామిత్రుడిని వేడుకొన్నాడు. దాంతో త్రిశంకుడు మధ్యలోనే ఉండిపోయాడు. ఇలా మధ్యలో ఎటూ కాకుండా ఉండే దాన్నే త్రిశంకుస్వర్గం అంటారు.


చతుర్విధ దైవోపాసకులెవరు?

ద్విజాతులు



అగ్నిహోత్రమే దైవంగా భావించి నమ్మి పూజించేవారు.

మునులు



భగవంతున్ని హృదయస్థునిగా భావించేవారు.

అల్పబుద్ధులు




విగ్రహాలను మాత్రమే పూజించేవారు.

విదితాత్ములు



సర్వజీవులు ఆత్మస్వరూపమే అని భావించే వారు.

డా।। పి. భాస్కరయోగి

చిక్కియున్న వేళ సింహంబునైనను
బక్కకుక్క కరచి బాధచేయు
బలిమి లేనివేళ బంతంబు చెల్లదు
విశ్వదాభిరామ వినురవేమ

భావం: అడవికి మృగరాజు అయిన సింహం చిక్కిపోయి ఉంటే వీధిన పోయే బక్క కుక్క కూడా బాధ పెడుతుంది. అందుకే తగిన బలం లేని చోట పౌరుషం ప్రదర్శించకుండా సంయమనం పాటించాలి.

అమూల్యం.. ఈ క్షణం

వికాసమే విజయం

- నిన్న అనేది గతం,
  రేపు అనేది ఓ రహస్యం,
  కానీ నేడు అనేది ఓ వరం,
  అందుకే ఓ బహుమానం లాంటిది ఈ వర్తమానం,
  దాన్ని సంపూర్ణంగా ఆస్వాదిద్దాం!
- మనం దిగులుగా ఉంటే, గతంలో మునిగిపోయినట్లు,
- మనం ఆతురత పడుతుంటేనేమో భవిష్యత్తులో విహరిస్తున్నట్లు,
- మనం శాంతంగా ఉంటే వర్తమానంలో జీవిస్తున్నట్లు!
- చింతించడం వల్ల నిన్నటి బాధ తీరిపోదు, దిగులు పడటం వల్ల రేపటి దుఃఖం దూరం కాదు, నేటి సుఖమే నాశనం అవుతుంది!

సమాయాన్ని గురించిన రహస్యం ఒకటుంది..

రేపు అనేది ఎన్నటికీ రాదు! ఎందుకంటే.. నిన్న మనం రేపు అనుకున్నదే.. ఈ రోజంటే!



శివానందలహరి

శ్రీ ఆదిశంకరాచార్యుల విరచితం

శ్లోకం:

పభు స్త్వం దీనానాం ఖలు పరమబంధుః పశుపతే
ప్రముఖ్యోహం తేషామపి కిముత బంధుత్వమనయోః |
త్వయైవ క్షన్తవ్యాః శివ మదపరాధాశ్చ సకలాః
ప్రయత్నాత్కర్తవ్యం మదవనమియం బంధుసరణిః ||

భావం: ఓ పరమేశ్వరా! నీవు సమర్థుడవు, దీనులకు ముఖ్యబంధువు కదా. నేను ఆ దీనులలో మొట్టమొదటివాడను. ఇంక మన ఇద్దరి బంధుత్వం గురించి వేరే చెప్పనక్కరలేదు కదా. ఓ శివా! నా సమస్త అపరాధాలనూ నీవు క్షమించుము. నన్ను ప్రయత్న పూర్వకంగా రక్షించుము. ఇదేకదా బంధుమర్యాద (బంధువులతో మెలగవలసిన తీరు).

వివరణ

కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోవడానికి ఒకొక్కప్పుడు తన ,మన పర ,అనే బేధాలను చూడడం గూడా లోక సామాన్యం. మహారాజంతవాడు గూడా బావమరిదిని ఆదుకొన్నట్లు పరాయివాడిని ఆదుకోడు.

ముందు తనకు సంబంధించిన వారు ఆ తర్వాతనే ఇతరులు అనే లోక సామాన్య వ్యవహారాన్ని కూడా గుర్తు తెచ్చుకుని శ్రీ ఆదిశంకరులు ఈ శ్లోకం లో తనకూ పరమాత్మకు గల చుట్టరికాన్ని దృష్టి లో పెట్టుకుని ప్రార్ధించారు.

శివుడు దీన జన బాంధవుడు. భక్తుడైనవాడు దీనాతి దీన స్థితిలో ఉన్నప్పుడు ముందుగా ఆ దైవానికి ఆ భక్తుని కాపాడవలసిన బాధ్యత ఉంటుది కదా! కాబట్టి , తెలియక కొన్ని పొరపాట్లు చేసినా అయినవారిని కాపాడడం లోకసహజం. దగ్గరగా వున్న దీన భక్తులను వదిలి దూరంగా ఉన్న వారినెవరినో ఉద్ధరించడం గూడా అంత సమంజసంకాదు గదా! అనే తర్కంతో శ్రీ ఆదిశంకరులు ఈ శ్లోకంలో శివుడిని ప్రార్ధించారు. ఆ ఆదిదంపతుల పాదపద్మాలకు నమస్కరిస్తూ.. -సర్వేజనా సుఖినోభవంతు

-డా. శ్రీరామ్, హైదరాబాద్

శ్రీ రాముని జన్మకై సన్నద్ధం



ప్రవచనం

– డా౹౹ శ్రీ చాగంటి కోటేశ్వర రావు

ఒకనాడు దశరథ మహారాజు ఋష్యశృంగుడి వద్దకు వచ్చి ఇలా అన్నాడు.. అయ్యా! నేను సంతానహీనుడిని, నాకు చాలా దిగులుగా ఉంది, నాకు సంతానం కలగకుండ ఏ పాపం ప్రతిబంధకంగా నిలబడుతోందో, ఆ పాపాన్ని పరిహరించుకోడానికి వేదం చేత నిర్ణయింపబడిన అశ్వమేధ యాగాన్ని మీరు నాతో చేయించాలి అని కాళ్ళు పట్టి ప్రార్ధించాడు. అప్పుడు ఋష్యశృంగుడు ఇలా అన్నాడు..యాగం చెయ్యాలనే ధార్మికమైన బుద్ధి నీకు ఎప్పుడైతే కలిగిందో ఆనాడే నీకు మంచి జరగడం మొదలయ్యింది. కావున నీకు శూరులు, లోకముచేత కీర్తింపబడే నలుగురు కుమారులు కలుగుతారని ఆశీర్వదించాడు.

చైత్ర మాసంలో చిత్రా నక్షత్రంతో వచ్చే పౌర్ణమి నాడు యాగాశ్వాన్ని తీసుకొచ్చి ఒక స్తంభానికి కట్టి, దానికి ప్రోక్షణ, స్నాపన, విమోచన చేశారు. ఇంకా కొన్ని ఇతరమైన క్రతువులు చేశాక ఆ యాగాశ్వాన్ని విడిచిపెట్టారు. అది అలా ఒక 12 నెలలు తిరుగుతుంది, దాని వెనకాల మహా శూరులైన వాళ్ళు వెళతారు. ఆ అశ్వం తిరిగొచ్చేలోపు అంటే ఫాల్గుణ మాసంలో వచ్చే అమావాస్యకి రాజు యాగశాల ప్రవేశం చెయ్యాలి. కాబట్టి దశరథ మహారాజు ఋష్యశృంగుడిని, వశిష్ఠుడిని పిలిచి యాగం ప్రారంభించాల్సిందిగా కోరాడు. ఆ యాగానికి ఇతర దేశాల నుండి రాజులను, ప్రజలను, జానపదులను, వేద బ్రాహ్మణులను, విద్వాంసులను ఆహ్వానించాడు. వచ్చిన వాళ్ళందరికి భోజనాలు పెట్టారు. పల్లెటూర్లనుంచి వచ్చిన వాళ్ళని అశ్రద్ధగా చూడకండి, భోజనం పెట్టేటప్పుడు అందరికీ శ్రద్ధగా వడ్డించండి అని వశిష్ఠుడు చెప్పాడు.

సర్వే వర్ణా యథా పూజాం ప్రాప్నువంతి సుసత్కృతాః |
న చ అవజ్ఞా ప్రయోక్తవ్యా కామ క్రోధ వశాత్ అపి ||

పది మంది భోజనం చేసేటప్పుడు కొంతమంది కామక్రోధాలకిలోనై అనరాని మాటలు మాట్లాడితే, మీరు నవ్వి వచ్చెయ్యండి, పట్టించుకోవద్దు. భోజనం చెయ్యడానికి పంక్తిలో కూర్చున్నవాడు అతిధి రూపంలో ఉన్న సాక్షాత్తు భగవంతుడు, కాబట్టి మర్యాదలకి ఎటువంటి లోటు రాకూడదు అని వశిష్ఠుడు ఆజ్ఞాపించాడు. అలాగే జనక మహారాజు, కాశి రాజు, రోమపాద రాజు, కైకేయ రాజుని పిలవడానికి ఎవరినో కాకుండా స్వయంగా మంత్రులనే వెళ్ళమని చెప్పి, అందరికి విడిది ఏర్పాటుచెయ్యండి అని ఆదేశించాడు. అలా వచ్చిన వాళ్ళందరికి భోజనాలు పెడుతున్నారు.

వృద్ధాః చ వ్యాధితాః చ ఏవ స్త్రీ బాలాః తథా ఏవ చ |
అనిశం భుంజమానానాం న తృప్తిః ఉపలభ్యతే ||

అక్కడికి వచ్చినవాళ్ళల్లో వృద్ధులు, వ్యాధిగ్రస్తులు, స్త్రీలు, చిన్ని చిన్ని పిల్లలు ఉన్నారు. భోజనం చేస్తున్నప్పుడు వాళ్ళంతా, ఆహా! భోజనాలు ఏమి రుచిగా ఉన్నాయి అని అంటున్నారు. ఇంత రుచికరమైన భోజనాలు మళ్ళీ ఎప్పుడు తింటామో అని అనుకుంటున్నారు. దశరథ మహారాజు వాళ్ళందరిని చూసి, ఇంకా తినండి, ఇంకా తినండి అంటున్నాడు. వచ్చిన వాళ్ళందరికి ధనం, వస్త్రాలు దానం చేశాడు దశరథుడు. వచ్చిన వాళ్ళందరూ 'ఆహా! ఎంతచక్కని భోజనం పెట్టావు రాజ, ఎంత గొప్ప వస్త్రాలు ఇచ్చావయ్య, నీ కోరిక తీరి, నీకు సుపుత్రులు కలిగి, నీ వంశం ఆచంద్ర తారార్కంగా వర్ధిల్లుతుందని ఆశీర్వదించి వెళ్లారు. ఆ యాగశాలని చాలా అద్భుతంగా నిర్మించారు, ఆ యాగశాలలో 21 యూప స్తంభాలని పాతారు, మారేడు కర్రలతో చేసినవి 6, మోదుగు కర్రలతో చేసినవి 6, ఛంద్ర కర్రలతో చేసినవి 6, దేవదారు కర్రలతో చేసినవి 2, శ్లేష్మాతక కర్రతో చేసినది ఒకటి ఉంటుంది. దశరథుడు శుక్ల యజుర్వేదానికి చెందిన వాడు కనుక, దానికి అనుగుణంగా ఆ యాగశాలని నిర్మించారు. ఎంతో శాస్త్రయుక్తంగా ఆ యాగం జరుగుతుంది. చివర్లో ఆ యాగాశ్వాన్ని తీసుకొచ్చి ఆ యూప స్తంభానికి కట్టారు. పట్టమహిషి అయిన కౌసల్య మూడు కత్తులతో ఆ యాగాశ్వాన్ని వధించింది. ఆ రోజు రాత్రి ఓ శాలలో కౌసల్య ఆ గుర్రం పక్కన పడుకొని ఉండాలి. మరుసటి రోజున ఈ యాగం చేయించిన ఋత్విక్కులకి, రాజు 4 భార్యలని దానం చెయ్యాల్సి ఉంటుంది. మొదట పట్టమహిషిని, ఉపేక్షిత భార్యని, ఉంపుడుగత్తెని, చివరిగా ఫాలాకలిని దానం చేస్తాడు. ఆ ఋత్విక్కులు ఆ నలుగురు భార్యలని తిరిగి రాజుకి ఇచ్చేస్తారు. అప్పుడు ఆ రాజు తన భార్యలను తీసుకొని ఆ ఋత్విక్కులకి ద్రవ్యాన్ని(ధనం) దానం ఇస్తాడు. ఇప్పుడు ఆ గుర్రం శరీరంలో నుంచి వప(జంతువుల కడుపులో బొడ్డు కింద వుండే ఉల్లిపొర వంటి కొవ్వు) ని తీసి ఆ అగ్నిలో వేశారు. ఆ వప అగ్నిలో కాలుతున్నప్పుడు వచ్చే ధూమాన్ని రాజు పీల్చాలి, దీనినే అశ్వమేధయాగం అంటారు. అలా పీలిస్తే, తనకి సంతానం కలగకుండా ఏ పాపం అడ్డుపడుతుందో, ఆ పాపం పోతుంది. చివరగా ఆ గుర్రం శరీరంలోని మిగతా భాగాలని ఆ హోమంలో హవిస్సుగా సమర్పిస్తారు. దశరథ మహారాజు తన రాజ్యాన్ని అశ్వమేధయాగం చేయించిన ఋత్విక్కులకి దానం చేశాడు, అప్పుడు వాళ్ళు మేము ఈ భూభారాన్ని వహించలేము, నువ్వు రాజువి, నువ్వే పరిపాలించాలి అని ఆ రాజ్యాన్ని తిరిగి రాజుకే ఇస్తారు. దక్షిణలేని యాగం జరగకూడదు కనుక, దశరథ మహారాజు ఆ ఋత్విక్కులకి 10 లక్షల గోవుల్ని, 100 కోట్ల బంగారు నాణాలని, 400 కోట్ల వెండి నాణాలని దానం చేశాడు. అక్కడికి వచ్చిన మిగతా బ్రాహ్మణులందరికీ ఒక కోటి బంగారు నాణాలని దానం చేశాడు. ఋష్యశృంగ మహర్షి లేచి.. ఓ రాజా! నీకు సంతానం కలగడం కోసం, నేను అధర్వ వేదంలో చెప్పబడిన ఒక బ్రహ్మాండమైన యిష్టిని చేయిస్తాను. అదే పుత్రకామేష్టి యాగం అని చెప్పి ఆ యిష్టి చెయ్యడం ప్రారంభించారు.

తతో దేవాః స గంధర్వాః సిద్ధాః చ పరమ ఋషయః |
భాగ ప్రతిగ్రహార్థం వై సమవేతా యథావిధి ||

ఆ యిష్టి జరుగుతున్నప్పుడు, అందులో తమ తమ భాగాలని పుచ్చుకోవడానికి దేవతలు, యక్షులు, గంధర్వులు, కింపురుషులు మొదలైనవారు అందరూ వచ్చి నిలబడ్డారు. అప్పుడు బ్రహ్మగారు కూడా అక్కడికి వచ్చారు. అందరూ ఆయన దెగ్గరికి వెళ్లి, ' పితామహా! మీరు ఆ రావణుడి తపస్సుకి మెచ్చి ఆయనకి అనేక వరాలు ఇచ్చారు, మీరు ఇచ్చిన వరాల వల్ల గర్వం పొంది వాడు ఈరోజు..

నైనం సూర్యః ప్రతపతి పార్శ్వే వాతి న మారుతః |
చలోర్మిమాలీ తం దృష్ట్వా సముద్రోపి న కంపతే ||

రావణుడికి భయపడి సూర్యుడు బాగా ప్రకాశించడం లేదు, సముద్రం తరంగాలు లేకుండా నిశ్చలంగా ఉంటుంది, వాయువు రావణుడి వద్ద అవసరంలేకపోయినా మెల్లగా వీస్తుంది, ఈ రకంగా వాడు దిక్పాలకులని బాధపెడుతున్నాడు, ఎక్కడా యజ్ఞాలు జరగనివ్వడంలేదు, ఋషులని హింసిస్తున్నాడు, పర భార్యలని తన వారిగా అనుభవిస్తున్నాడు. ఇన్ని బాధలు పడుతున్న మాకు వాడిని సంహరించే మార్గం చెప్పవలసింది' అని ఆ దేవతలు బ్రహ్మదేవుడిని కోరారు.

అప్పుడు బ్రహ్మగారు ' నేనూ వాడి అకృత్యాలు వింటున్నాను, వాడు తపస్సుతో నన్ను మెప్పించి, రాక్షసులతో, దేవతలతో, యక్షులతో, గంధర్వ కిన్నెర కింపురుషులతో మరణం లేకుండా వరం కోరుకున్నాడు, కాని వాడికి మనుషుల మీద ఉన్న చులకన భావంతో మనుష్య వానరాలని అడగలేదు' అని అన్నారు. అక్కడున్న అందరూ ఒక మార్గం తెలిసిందని సంతోషపడ్డారు.ఒకరు పిలిచారా లేదా అని చూడకుండా, అంతా నిండిపోయిన పరమాత్మ, ఎంతో దయామూర్తి అయిన శ్రీ మహావిష్ణువు ఆ సభ మధ్యలో తనంతట తానుగా వచ్చారు....

ఏతస్మిన్ అనంతరే విష్ణుః ఉపయాతో మహాద్యుతిః |
శఙ్ఖ చక్ర గదా పాణిః పీత వాసా జగత్పతిః ||

ఒక్కసారి నల్లని మేఘం వస్తే ఎలా ఉంటుందో, అందమైన రూపందో, మెడలో వైజయంతి మాలతో, శంఖ చక్ర గధ పద్మాలని పట్టుకొని శ్రీమహా విష్ణువు ఒక ప్రతిజ్ఞ చేశారు......

హత్వా క్రూరం దురాధర్షం దేవ ఋషీణాం భయావహం |
దశ వర్ష సహస్రాణి దశ వర్ష శతాని చ ||
వత్స్యామి మానుషే లోకే పాలయన్ పృథ్వీం ఇమాం |
ఏవం దత్వా వరం దేవో దేవానాం విష్ణుః ఆత్మవాన్ ||

మీరెవరు కంగారు పడొద్దు, రావణుడు చేసే అక్రుత్యాలన్ని నాకు తెలుసు, వాడిని సంహరించడానికి నేనే మనుష్యుడిగా జన్మించాలని నిర్ణయం తీసుకున్నాను. నన్ను నమ్ముకున్న దేవతలని, ఋషులని క్రూరంగా బాధపెడుతున్నాడు, అందుకని వాడిని సంహరించి ఈ భూమండలం మీద పదకొండు వేల సంవత్సరాలు ఉండి ఈ పృథ్వి మండలాన్ని పరిపాలన చేస్తాను అని భగవానుడు అన్నాడు.

తతః పద్మ పలాశాక్షః కృత్వా ఆత్మానం చతుర్విధం |
పితరం రోచయామాస తదా దశరథం నృపం ||

నేనే నలుగురిగా ఈ దశరథ మహారాజుకి పుడతాను అని ప్రతిజ్ఞ చేశారు. అక్కడ ఋష్యశృంగుడు చేయిస్తున్న పుత్రకామేష్టి యాగం పూర్తవబోతుంది. ఇంతలో ఆ యోగాగ్నిలో నుంచి ఒక దివ్య పురుషుడు నల్లని ఎర్రని వస్త్రాలు ధరించి, చేతిలో వెండి మూత కలిగిన ఒక బంగారు పాయస పాత్ర పట్టుకొని, సింహంలా నడుస్తూ బయటకి వచ్చి దశరథ మహారాజుని పిలిచాడు. దశరథుడు ఆయనకి నమస్కరించి నేను మీకు ఏమిచెయ్యగలను అన్నాడు. అప్పుడు ఆ పురుషుడు ఇలా అన్నాడు ' నాయనా దశరథా! నన్ను ప్రాజాపత్య పురుషుడు అంటారు, నన్ను ప్రజాపతి పంపించారు, ఈ పాత్రలోని పాయసాన్ని దేవతలు నిర్మించారు. ఈ పాయసాన్ని నీ భార్యలు స్వీకరిస్తే నీకు సంతానం కలుగుతుంది. ఈ పాయసాన్ని స్వీకరించడం వల్ల నీ రాజ్యంలోని వాళ్ళు ధన ధాన్యాలతో తులతూగుతారు, ఆరోగ్యంతో ఉంటారు' అని చెప్పి వెళ్ళిపోయాడు.

వెంటనే దశరథుడు ఆ పాయసాన్ని తన ముగ్గురు పత్నులకి ఇద్దామని అంతఃపురానికి వెళ్ళాడు. ముగ్గురినీ పిలిచి, ఆ పాయసంలో సగభాగం కౌసల్యకి ఇచ్చాడు, మిగిలిన సగంలోని సగభాగాన్ని సుమిత్రకి ఇచ్చాడు, ఆ మిగిలిన భాగాన్ని సగం సగం చేసి, ఒక భాగాన్ని కైకేయకి మరొక భాగాన్ని సుమిత్రకి ఇచ్చాడు. యాగం పూర్తయ్యాక, అక్కడికి వచ్చిన రాజులందరికీ బహుమానాలు ఇచ్చి సత్కారాలు చేసి పంపించారు. రుష్యశృంగుడికి సాష్టాంగ నమస్కారం చేసి, ఆయనని సత్కరించి శాంతా రుష్యశృంగులను అన్ని మర్యాదలు చేసి సాగనంపారు. ఆ యాగానికి వచ్చిన వాళ్ళందరిని తగిన విధంగా సత్కరించారు దశరథ మహారాజు.కొంత కాలానికి దశరథ మహారజులోని తేజస్సు ఆయన భార్యలలోకి ప్రవేశించి వాళ్ళు గర్భవతులయ్యారు.

–సేకరణ : నరేందర్ చింతం

సరదాల హోళికి నాంది..?

కృష్ణుడు అల్లరిబాలుడు. అతడు బృందావనంలోని గోపాలురతో కలసిమెలసి తిరిగేవాడు. ఆ పరమాత్ముడినే సహచరుడిగా పొందగలిగిన వారు. గత జన్మలో చేసిన పుణ్యం ఎటువంటిదో కదా?! కృష్ణుడు హాని కలిగించని అల్లరి చేష్టలతో స్నేహితుల్ని ఆటపట్టించే వాడు. గోపబాలురు కూడా కృష్ణుడి అన్నగారైన బలరాముడితో కలసి 'నల్లనయ్యా' అంటూ ఆటపట్టించే వారు. అంతేకాదు అతడి స్నేహితురాలు 'రాధ' తెల్లగా ఉండగా, తను మాత్రమే నల్లగా ఉన్నాడని ఉడికించేవారు. ఒకసారి స్నేహితుల అల్లరికి ఉడుకున్న కృష్ణుడు ఏడుస్తూ యశోదమ్మను చేరి 'రాధ తెల్లగా ఉంటే, తనెందుకు నల్లగా ఉన్నాడో చెప్పమని' ఆమెను నిలదీసాడు. ఆ సమయంలో యశోదమ్మకు ఏం చెప్పాలో తోచక నవ్వుతూ నువ్వూ రంగు తీసుకెళ్లి రాధ ముఖానికి పులుము అంటూ ఆటపట్టిస్తూ సలహా ఇచ్చింది. కృష్ణుడికి ఆ సలహా ఎంతగానో నచ్చింది. కృష్ణుడు రకరకాల రంగులను వెంట తీసుకుని రాధ ఇంటికెళ్ళి ఆమె ముఖానికి అద్దాడు. అలా కృష్ణుడు మొదటిసారి రంగులతో ఆట మొదలుపెట్టాడు. ఆయన మొదలు పెట్టాకే నేడు మనం 'హోళి పండుగ'గా జరుపుకుంటున్నాం.

గ్రహించవలసిన లక్షణం: సరదా మనస్తత్వం

– డా. హరె క్రిష్ణ చంద్రశేకరన్

అర్జున ఉవాచ

యద్యప్యేతే న పశ్యంతి లోభోపహత చేతసహ।
కులక్షయకృతం దోషం మిత్రద్రోహే చ పాతకమ్।।

తాత్పర్యము

యుద్ధం చేయడానికి ఇష్టం లేని అర్జునుడు కృష్ణునితో ఇలా పలికాడు...దురాశపరులైన కౌరవులకి వారి మిత్రులనూ, బంధువులనూ చంపడంలో ఏ దోషం కనబడలేదు.

నీతి

అత్యాశ కారణంగానే కౌరవులు రాజ్యం, ప్రాణాలు పోగొట్టుకొన్నారు. కౌరవుల విధిరాత ఎలా మారిందో చూసాకైనా మనం అత్యాశను వదిలించుకోవలసిందే!

ముఖ్యపదం: ప్రారంభం.

బాల మకరందం



ప్రకృతితో సమతుల్యత 'వాస్తు'

శాస్త్రీయ విజ్ఞానం



నేడు పాశ్చాత్యులను మంత్రముగ్ధలను చేస్తూ, తనవైపు ఆకర్షిస్తున్న భారతీయ విద్యలలో యోగశాస్త్రం, ఆయుర్వేదం, వాస్తుశాస్త్రం ముఖ్యమైనవి.

భవన నిర్మాణంలో ప్రకృతిసమతుల్యం అవసరమని (Eco– friendly and green buildings concepts) భావిస్తూ, నేటి ఇంజనీర్లు, ఆర్కిటెక్చర్లు తదనుగుణంగా భవన నిర్మాణ చట్టాలలో ఎన్నో శాసనాలు రావడానికి కృషి చేస్తున్నారు. 'పంచ భూతాత్మక ప్రకృతితో సమతుల్యత పాటించి, నిర్మించే భారతీయ భవన నిర్మాణ విజ్ఞానమే 'వాస్తు శాస్త్రం'. భారతీయ మేధస్సు కేవలం 'స్థూల జగత్తు'కే పరిమితం కాకుండా, ఈ జగత్తును నడిపించే 'సూక్ష్మ శక్తులకు' పెద్దపీట వేసి వాస్తు రచన గావించింది. వాస్తు శాస్త్రంలో మానవుని సుఖజీవనం ఆశించి, పంచ భూతాత్మకమైన ప్రకృతిలోని పలు శక్తి కేంద్రాలు (ఎనర్జీ పాయింట్స్). శక్తి రేఖలను (ఎనర్జీ లైన్స్) శక్తి మండలాలను (ఎనర్జీ గ్రిడ్స్) గృహ క్షేత్రంతో అనుసంధానం చేశారు.

భారత విజ్ఞానం మానవుల గృహాన్ని ఒక చేతన వస్తువు (లీవింగ్ ఆర్గనిజమ్) గానే పరిగణించి ఈ శాస్త్రాన్ని ప్రబోధించింది. 'వసంత్యస్మిన్నితి వాస్తుః ఉండదగిన వసతిని గూర్చి చెప్పేది వాస్తు అని అర్థం. హిందూ దేవాలయాల నిర్మాణం ఆగమశాస్త్రం, వాస్తుశాస్త్రం, జ్యోతిష్యశాస్త్రం ప్రకారం నిర్మింపబడింది. ప్రాచీన భారతంలో రాజప్రసాదాలు, నగరాలు, గృహాలు, ఇవన్నీ కూడా వాస్తుశాస్త్ర ప్రకారం నిర్మించేవారు. వాస్తుశాస్త్రం, స్తపత్య వేదం – అథర్వణ వేదంలోని భాగం. మత్స్య పురాణంలో తెలుపబడిన 18 మంది వాస్తు శాస్త్రోపదేశకులు.

1. భృగువు, 1. అత్రి, 3. వశిష్టుడు, 4. విశ్వకర్మ, 5. మయుడు, 6. నారదుడు, 7. నగ్నజిత్, 8. విశాలా మొదలైన వారు. ఇక మత్స్యపురాణం, స్కంధపురాణం, అగ్నిపురాణం, గరుడ పురాణం, విష్ణుపురాణాలలో అనేక ప్రాసాద నిర్మాణాలను వివరించారు.

ప్రసిద్ధ వాస్తుశాస్త్రం గ్రంథాలు

1. కాశ్యప శిల్పము– కాశ్యప మహాముని.
2. బృహత్ సంహిత– వరాహ మిహురుడు.
3. మాయామత వాస్తుశాస్త్రం – మయుడు
4. విశ్వకర్మ వాస్తుశాస్త్రం – విశ్వకర్మ
5. సమరాంగణ సూత్రధార–భోజ మహారాజు.

ఇంకా అపరాజిత పృశ్ఛ, జయపృశ్ఛ మొదలైన గ్రంథాలు ఉన్నాయి. మహాభారతంలో 'మయుడు' నిర్మించిన 'మయసభ' భవనం పది వేల హస్తాల పరిధిగా, సమకోణ చతురస్రాకారంలో ఉన్నదని వ్యాసుడు వివరించాడు. ఇంద్రప్రస్థపురంలో ఎత్తయిన భవనాలు నిర్మించబడినాయని తెలియజేశాడు. రామాయణంలో అయోధ్య నగర వర్ణనలో, ఆ నగరం వాస్తుశాస్త్ర సిద్ధాంతం ప్రకారం నిర్మించబడిందన్నట్టున్నది.

హనుమంతుడు లంకా నగరం వీక్షిస్తూ..

'ప్రతి ప్రాసాదం, వాస్తు దోషం లేకుండా, అతి సుందరంగా నిర్మింపబడింది అని చెబుతాడు.

వాస్తు పురుష మండలమంటే అది ఒక శక్తి మండలం. 8 x 8 = 64 లేక 9x9=81 అను సమకోణ చతురస్రపు భూమిక. దీనినే Energy Grid అని అంటారు.భవన నిర్మాణం గాని, గృహ నిర్మాణం గాని చేపట్టినప్పుడు ఈ కింది అంశాలను వాస్తుశాస్త్రం పరిగణనలోకి తీసుకుంటుంది. అవి:

1. భూమి స్వభావం, 2. వాస్తు పురుష మండలితో అనుసంధానింపబడిన గృహ నిర్మాణ ప్లాన్, 3. గృహ యజమాని యొక్క జన్మకుండలి. 4. గడపలు, కిటికీల యొక్క స్థానం, 5. బ్రహ్మస్థానం (సెంట్రల్ ప్లేస్ ఆఫ్ ద హౌస్), 6. అష్టదిక్పాలకుల అనుగ్రహప్రాప్తినుద్దేశించి గదుల నిర్మాణం, 7. ఎత్తు నిర్ణయం. ముఖ్యంగా భవనానికి తూర్పు, ఉత్తరదిశల్లో ఎక్కవ ఖాళీ స్థలం ఉంచి, గృహాన్ని నిర్మించిన ఎడల సుఖ, సంపదలు కలుగుతాయని వాస్తుశాస్త్ర నిర్ణయం. గృహానికి శాన్యంలో నీటి బావి, పూజామందిరం, ఆగ్నేయంలో వంటగది, నైరుతిలో యజమాని నివాసం, వాయవ్యంలో స్నానాలు, మరుగుదొడ్డి నిర్మించుకున్న ఎడల మంచి జరుగును.

నైరుతి ఎత్తుగానూ, ఈశాన్యం పల్లంగాను ఉన్నచో అట్టి గృహానికి శుభములు మెండు. ఇంటి మధ్య ప్రదేశాన్ని 'బ్రహ్మస్థానం' (సెంట్రల్ కోర్ట్ యార్డ్) అంటారు. ఇది ఎంతో ప్రాముఖ్యత గల ప్రదేశం. గృహనిర్మాణంలో ఈ ప్రదేశాన్ని కప్పు లేకుండా వదిలిపెట్టడం మన సంప్రదాయం. గృహంలో నివసించే వారికీ, యజమానికి మరింత బలం. దివ్యశక్తిని గ్రహించేందుకు వాస్తు సూత్రాల ప్రకారం గృహ నిర్మాణం చేయటం అవసరం.


ఓటు హక్కు చాలా ముఖ్యం

విజయక్రాంతి, ముషీరాబాద్: ఓటు హక్కు ప్రతి ఒక్కరు కలిగి ఉండాలని ఓటర్ల నమోదును పకడ్బందీగా చేపట్టాలని, ఏ ఒక్కరి ఓటు తొలగిపోకుండా జాగ్రత్త పడాలని నగర కాంగ్రెస్ అధ్యక్షుడు అంజన్‌కుమార్ యాదవ్ ఆదేశించారు. బుధవారం ముషీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో అడిక్‌మెట్ డివిజన్ హనుమాన్ టెంపుల్ వద్ద ఏర్పాటుచేసిన ఓటర్ నమోదు కార్యక్రమాన్నికి ముఖ్య అతిథిగా అంజన్ కుమార్ యాదవ్ హాజరై ప్రారంభించారు. సవరణ ప్రక్రియలో భాగంగా ప్రతి ఓటరు పేరు నమోదయ్యేల్లా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అంజన్‌కుమార్ యాదవ్ ఈ సందర్భంగా పార్టీ నాయకులను కోరారు. కార్యక్రమంలో యువజన రాష్ట్ర అధ్యక్షుడు అనిల్‌కుమార్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు తిరుమళ్, గోవర్ధన్, బిక్షపతి, విజయ్ యాదవ్, సురేష్ గౌడ్, అన్సారీ భాయ్ తదితరులు పాల్గొన్నారు.

అగ్రవర్ణ పేదలకు 10%

(మొదటిపేజీ తరువాయి) నివేదికలో ఈబీసీలకు రిజర్వేషన్ల ప్రస్తావన ఉంది. ఇప్పటి వరకు రిజర్వేషన్లలో విద్య, ఉద్యోగాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అవకాశం కల్పించారు. కానీ చట్ట సభల్లో రిజర్వేషన్లు ఎస్సీ, ఎస్టీలకు మాత్రమే ఉన్నాయి. ఆర్థిక వెనుకబాటును ఎప్పటికప్పుడు నిర్ణయించే అధికారం రాష్ట్రాలకే కల్పించాం. రాజకీయపరమైన చర్చలు ఎప్పుడూ జరుగుతూనే ఉంటాయి. మహిళలు యుద్ధ విమానాలు నడిపే అవకాశం కల్పించింది ఈ ప్రభుత్వమే. గణతంత్ర వేడుకల్లో బీఎస్ఎఫ్ మహిళా జవాన్లకు అవకాశం కల్పించింది ఈ ప్రభుత్వమే. నాలుగున్నరేళ్లలో 9.5 కోట్ల శౌచాలయాలు నిర్మించాం. మహిళా ఉద్యోగుల ప్రసూతి సెలవులను 6 నెలలకు పొడిగించాం" అని రవిశంకర్ ప్రసాద్ తెలిపారు. బిల్లు చాలా ఆలస్యంగా తెచ్చారని కొన్ని విపక్ష పార్టీలు ఆరోపిస్తున్న నేపథ్యంలో .. బహుశా మేం ఆలస్యం కావచ్చు, కానీ బిల్లును తీసుకువచ్చేందుకు ధైర్యం చేశామన్నారు. క్రికెట్ ఆటలో ఎక్కువగా సిక్సర్లు చివరి ఓవర్లలో కొడుతుంటారని, మ్యాచ్ టైట్‌గా ఉన్న సమయంలో బౌండరీల మోత ఉంటుందని, దీని పట్ల ఎవరూ పరేషాన్ కావద్దన్నారు. ఇదే మొదటి సిక్సర్ కాదు అని, ఇంకా మునుముందు మరిన్ని సిక్సర్లు కురుస్తాయని మంత్రి రవిశంకర్ తెలిపారు. ఈబీసీ బిల్లు వెనుకబడిన వర్గాల కోటాను దెబ్బతీయదన్నారు. వారిపై ఈ బిల్లు ప్రభావం ఉండదన్నారు. 50 శాతం పరిమితి రాజ్యాంగంలో లేదని, ఇంద్రా సాహ్నీ కేసులో సుప్రీం 50 శాతం కోటా తీర్పునిచ్చిందని, అది కూడా సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాల కోసం ఆ తీర్పునిచ్చిందన్నారు. ఆ తీర్పులోని నిబంధనల వల్ల ఈబీసీ బిల్లుకు ఎటువంటి ప్రమాదం లేదన్నారు. జనరల్ క్యాటగిరీలోనూ పేద ప్రజలు ఉన్నట్లు మంత్రి వెల్లడించారు. బ్రాహ్మణ, రాజ్పుత్ వర్గాల్లోనూ పేదలు ఉన్నారని, వారి గురించి కూడా మనం ఆలోచించాలన్నారు.


ఆదాయ పన్ను పరిమితి సడలించాలి: కపిల్ సిబల్



ఈబీసీ బిల్లు విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఖరిని కాంగ్రెస్ సీనియర్ నేత కపిల్ సిబల్ తప్పుపట్టారు. 21 లక్షల కుటుంబాల కోసమే ఈ బిల్లు తెచ్చారని, ఉద్యోగాలు ఇవ్వలేని మీరు రిజర్వేషన్లు ఇవ్వాలనుకోవడం ఏమిటని ఆయన నిలదీశారు. ప్రభుత్వం ఉద్దేశం ఏమిటో తాము తెలుసుకోవాలని అనుకుంటున్నామన్నారు. 'ఈబిల్లును ఇంత హడావుడిగా ఎందుకు తెస్తున్నారో వారికే తెలియాలి. ఈ బిల్లుకు మూడు ప్రధాన అడ్డంకులు ఉన్నాయి. ఈ బిల్లును ప్రవేశపెట్టడంలో మోదీ ప్రభుత్వం శ్రద్ధపెట్టి పనిచేసినట్లు కనిపించడం లేదు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు 10 శాతం రిజర్వేషన్లు వస్తాయని చెబుతున్నారు. రాష్ట్రాల్లో పరిస్థితులు ఎలా ఉన్నాయో పరిశీలించారా? మండల్ కమిషన్ నివేదిక ఆమోదానికి పదేళ్లు పట్టింది. మీరు ఒక రోజులోనే అంతా చేయాలని చూస్తున్నారు ' అని సిబల్ విమర్శించారు. 'ఆర్టికల్ 15 సామాజికంగా, విద్యా పరంగా వెనుకబడిన వారికి రిజర్వేషన్లు కల్పిస్తుంది. ఇప్పుడు చేస్తున్న సవరణలతో ఆర్థిక వెనుకబాటు అంశాన్ని చేరుస్తున్నారు. కొత్త చట్టం ప్రకారం రూ.4 వేలు సంపాదించే ఎస్సీలు అణగారిన వర్గాలు కారు. నెలకు రూ.60 వేలు సంపాదించే వేరే వర్గాల వారిని పేదలుగా గుర్తిస్తున్నారు. నెలకు రూ.5 వేలు, రూ.10 వేలు సంపాదించే ఎస్సీ, ఎస్టీ ఓబీసీల మాటేంటి? వారు ఆర్థికంగా వెనుకబడిన వారు కాదా? ఒడిశాలో జనరల్ కేటగిరీ జనాభా 6 శాతమే.. వారికి 10శాతం రిజర్వేషన్లు వస్తాయి. వీటి ఆధారంగా చూస్తే మీరు ఏం ఆలోచించి బిల్లు తయారు చేశారు. ఆదాయం తక్కువున్నా గానీ ఈ 10 శాతం కోటాలోకి ఎస్సీ, ఎస్టీలు వచ్చే అవకాశం లేదు. నిజమైన పేదలను ఈ రిజర్వేషన్ల పరిధి నుంచి ఎలా తప్పిస్తారు? ప్రభుత్వాలు ఇలాంటి దృక్పథంతోనేనా ఆలోచించేది? అని సిబల్ ప్రశ్నించారు. ' ఈ బిల్లు తీసుకొస్తున్న విధానం పూర్తిగా రాజ్యాంగ విరుద్ధం. ఈ బిల్లు రాజ్యాంగ సమ్మతమేనని న్యాయ అభిప్రాయం చెప్పింది ఎవరు? మీరు సేకరించిన గణాంకాలు ఉంటే .. వాటిని సభ ముందు పెట్టాలి. ఇలాంటి చర్యలకేనా రాజ్యాంగ పరిషత్తు మనకు మహత్తర అవకాశం అందించింది. రూ.2.5 లక్షల ఆదాయం దాటినవారు ఆదాయ పన్ను కట్టాలంటున్నారు. ఇప్పుడు రూ.8 లక్షల లోపు ఆదాయం ఉన్నవారికి రిజర్వేషన్లు అంటున్నారు. ఆదాయ పన్ను పరిమితిని కూడా సడలిస్తూ నిబంధనలు తీసుకురండి. కొత్త ఉద్యోగాలు వస్తున్నాయన్న మాట నిజమే... అంతకు మించి ఉద్యోగాలు కోల్పోతున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో లక్షలాది మంది ఉద్యోగాలు కోల్పోయారు. డిజిటల్ ఇండియాలో భాగంగా చిన్నమొత్తంలో ఉద్యోగాలొస్తే.. భారీగా ఉద్యోగాలు పోయాయి" అని కపిల్ సిబల్ అన్నారు. కోటా బిల్లుకు రాజ్యాంగ పరంగా చాలా చిక్కులు ఎదురవుతాయని ఆయన అన్నారు. ఆర్థికంగా బలహీనంగా ఉన్న వర్గాలకు 10 శాతం రిజర్వేషన్ ఇవ్వాలన్న మండల్ కమిషన్ ప్రొవిజన్ రాజ్యంగవిరుద్ధమని గతంలో సుప్రీంకోర్టు ప్రకటించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. 9 మంది న్యాయమూర్తుల బెంచ్ రాజ్యంగ విరుద్ధమని చెప్పినప్పుడు, మీరు రాజ్యంగాన్ని ఎలా సవరిస్తారని సిబల్ ప్రశ్నించారు. అతి తక్కువ మంది వ్యక్తులకు లబ్ధి చేకూర్చేందుకే ప్రభుత్వం ఈ బిల్లు తెస్తోందని ఆయన ఆరోపించారు. 2019 ఎన్నికల తర్వాత పెడబొబ్బలు పెట్టొదంటూ కపిల్ సిబల్ఆయన విసుర్లు విసిరారు.

బీజేపీ మైండ్ సెట్ మారాలి: కాంగ్రెస్ ఎంపీ ఆనంద్ శర్మ

కాంగ్రెస్ ఎంపీ ఆనంద్ శర్మ బీజేపీ తీరును ఎండగట్టారు. ఈబీసీ రిజర్వేషన్ బిల్లుపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ మైండ్ సెట్ మారాలన్నారు. తాము ఈబీసీ రిజర్వేషన్ బిల్లును వద్దని చెప్పడం లేదని, కానీ నాలుగున్నరేళ్ల పాలన తర్వాత ఇప్పుడే ఎందుకు తెచ్చారని అడుగుతున్నామన్నారు.



తమకు ప్రజాస్వామ్యంపై నమ్మకం ఉందన్నారు. అచ్చే దిన్ ఎప్పుడు వస్తాయని జనం ఎదురు చూస్తున్నారన్నారు. రకరకాల టోపీలతో, వస్త్ర ధారణతో మోదీ బయట కనిపిస్తారు.. కానీ సభలో మాత్రం ఉండరని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. తామేదీ చేయలేదంటున్నారని.. తామేమీ చేయకుండానే దేశం ఆర్థికంగా, వైజ్ఞానికంగా ముందుందా అని ఆనంద్ శర్మ ప్రశ్నించారు. ఈబీసీల కోసం కాంగ్రెస్ పార్టీ 2006లో కమిషన్ వేసిందని, 2014లో మేనిఫెస్టోలో పెట్టిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.

కోటాపై శాస్త్రీయ అధ్యయనం చేశారా ?: డీఎంకే ఎంపీ కనిమొళి



ఈబీసీ బిల్లుతో కేంద్రం ఓ ఒప్పును తప్పు చేయాలని చూస్తున్నదని డీఎంకే ఎంపీ కనిమొళి విమర్శించారు. పెరియార్ పుట్టిన నేల నుంచి వచ్చానని, తమ రాష్ట్ర వెనుకబడిన వర్గాల కోసం జీవో తెచ్చిందని ఆమె గుర్తు చేశారు. కోటా అనేది ఆర్థికపరమైన అంశం కాదని, అది వారు హక్కు అన్నారు. ఉద్యోగ ప్రదేశాల్లో ఇంకా వివక్ష ఉందన్నారు. మహిళల సాధికారత గురించి ప్రభుత్వం ఆలోచిస్తే, మరి మహిళా బిల్లును ఎందుకు తేవడం లేదని కనిమొళి ప్రశ్నించారు. విద్యా రుణాలు ఇవ్వలేనప్పుడు, మరి ఆర్థికంగా వెనుకబడిన వారిని ఎలా ఆదుకుంటారని నిలదీశారు. ప్రధాని నెహ్రూ రాజ్యాంగంలో మొట్టమొదటి సవరణ చేసినప్పుడు ఆర్థిక పదాన్ని తొలిగించారని గుర్తు చేశారు. అగ్రకులాలకు పది శాతం రిజర్వేషన్ ఇవ్వాలన్న దానిపై మీ దగ్గర ఏమైనా డేటా ఉందా? ఈ కోటాను సమర్థించేందుకు మీదగ్గర శాస్త్రీయ అధ్యయన వివరాలు ఉన్నాయా అని ఆమె ప్రశ్నించారు. రైతులు ఇప్పటికీ బతుకీడుస్తున్నారని, కానీ వారిని కలిసేందుకు ప్రధానికి టైం లేదని, అలాంటి సమస్యలు ఉంటే, మరి ఆర్థిక అర్హతలను ఎలా నిర్ణయిస్తారని కనిమొళి అడిగారు. ఈబీసీ బిల్లు తేవడానికి ఇప్పుడింత అర్జెన్సీ ఏముందని, మరో వంద రోజుల్లో ఎన్నికలు ఉందన్న కారణంగా ఆ బిల్లును తెచ్చినట్లు ఆమె చెప్పారు. కేంద్రం ప్రవేశపెట్టిన ఈబీసీ బిల్లును తాము వ్యతిరేకిస్తున్నట్లు కనిమొళి స్పష్టం చేశారు.

ఉద్యోగాలే లేనప్పుడు రిజర్వేషన్లు ఇచ్చి ప్రయోజనమేంటి?: ఎస్పీ ఎంపీ రాంగోపాల్ యాదవ్



దేశంలో ఉద్యోగాల కల్పనే లేనప్పుడు రిజర్వేషన్లు ఇచ్చి ప్రయోజనమేంటని సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ రాంగోపాల్ యాదవ్ అన్నారు. దేశంలో ప్రజా ప్రయోజనాల వ్యాజ్యాల సంఖ్య పెరుగుతోందని, ఈబీసీ రిజర్వేషన్ల పైనా చాలా మంది సుప్రీంకోర్టుకు వెళ్లే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే ఉన్న ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లనే సక్రమంగా అమలుచేయడంలేదని, ఏ స్థాయిలో ఉద్యోగ నియామకాలు చూసినా సామాజిక సమతూకం లేదన్నారు. రెండు, మూడు శాతం జనాభా ఉన్న వర్గాల వారికే ఉన్నత పదవులు దక్కుతున్నాయన్నారు. పెద్ద నోట్ల రద్దు వల్ల పరిశ్రమల్లో భారీ సంఖ్యలో ఉద్యోగాల కోత పడగా, పట్టణ ప్రాంతాల్లో భారీ సంఖ్యలో యువత ఉద్యోగాల కోసం ఎదురు చూస్తోందన్నారు. ఉద్యోగాల్లో రిజర్వేషన్లు అనేది విషయం కానే కాదని, ఎందుకంటే ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగాల కల్పనపై దృష్టిపెట్టలేదని ఆయన విమర్శించారు. ' రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేడ్కర్ చదువు కోసం ముంబయి వెళ్లినప్పుడు ఆయనను కుర్చీలో కూడా కూర్చోనివ్వలేదు. ఒక శూద్రుడు కుర్చీలో ఎలా కూర్చుంటాడని ఆనాడు ఆయనను అవమానించారు. అంతకుముందు, ఆ తర్వాత కూడా అణగారిన వర్గాలు ఎంతో వివక్షను ఎదుర్కొన్నాయి. కేంద్రంలో ఉన్నది ఏ ఒక్కరి ప్రభుత్వమో కాదు. ఇది దేశం మొత్తానికి ప్రభుత్వమని గుర్తించాలి. ఈ బిల్లు లక్ష్యం నిజంగా పేదలకోసం తెచ్చింది కాదు. కేవలం 2019 ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని తీసుకొచ్చారు. ఈబీసీలకు న్యాయం చేయాలనుకుంటే మూడేళ్ల క్రితమే బిల్లు తేవాల్సింది. ఈ బిల్లును ఎవరి కోసం తెస్తున్నామని చెబుతున్నారో.. నిజంగా ఆ వర్గాలకు న్యాయం జరగదు" అని రాంగోపాల్ యాదవ్ అన్నారు.


పార్లమెంటరీ వ్యవస్థను అగౌరవపరుస్తున్నారు: టీఎంసీ ఎంపీ ఒబ్రెయిన్



పార్లమెంట్ నడుస్తున్న తీరు పట్ల తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ డెరిక్ ఒబ్రెయిన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యసభలో ఈబీసీ బిల్లుపై చర్చ సందర్భంగా ఆయన తన అసహనాన్ని వ్యక్తం చేశారు. బిల్లులను ప్రతిపాదిస్తున్న తీరు సరిగా లేదని, పార్లమెంట్‌ను అగౌరవపరుస్తున్నారని, పార్లమెంట్ వ్యవస్థను ఏం చేస్తున్నారని, ఆ వ్యవస్థను అవమానిస్తున్నారని ఒబ్రెయిన్ మండిపడ్డారు. ఉద్యోగాలు ఎక్కడ ఉన్నాయని దేశ యువత ప్రశ్నిస్తోందన్న ఆయన గత వందేళ్ల చరిత్రను చూస్తే డిమానిటైజేషన్ అతిపెద్ద డిజాస్టర్ అన్నారు. కావాల్సినన్ని ఉద్యోగాలు ఉంటే, రిజర్వేషన్లు అవసరం లేదని గతంలో ప్రధాని చెప్పారని, కానీ ఇప్పుడు సభలో ప్రధాని లేరని ఆయన గుర్తు చేశారు. 2013లో గుజరాజ్ సీఎంగా ఉన్న సమయంలో మోదీ.. మతపరమైన రిజర్వేషన్లపై ఆ కామెంట్ చేసినట్లు ఆయన గుర్తు చేశారు.

ఈబీసీ బిల్లుకు టీఆర్ఎస్ మద్దతు: టీఆర్ఎస్ ఎంపీ బండ ప్రకాశ్

తెలంగాణ అసెంబ్లీలో ప్రవేశపెట్టిన రిజర్వేషన్ల తీర్మానాలను ఆమోదించాలని టీఆర్ఎస్ ఎంపీ బండా ప్రకాశ్ కేంద్రాన్ని కోరారు. రాజ్యసభలో ఈబీసీ బిల్లుపై తెలుగులో మాట్లాడిన ఆయన స్థానిక సంస్థల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించిన రాష్ట్రం తెలంగాణే అని



అన్నారు. ఆర్థికంగా వెనుకబడిన వారికి ఈబీసీ స్కాలర్షిప్‌లు ఇస్తున్నామన్నారు. ఈబీసీ విద్యార్థులకు 20 లక్షల ఫెల్లోషిప్ కూడా ఇస్తున్నామన్నారు. గురుకుల పాఠశాలలో ఈబీసీ విద్యార్థులకు కోటా కల్పిస్తున్నామన్నారు. వెనుకబడిన తరగతుల వారికి 33 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని కేంద్రాన్ని కోరినట్లు ఆయన గుర్తు చేశారు. బీసీల కోసం కేంద్రం ఇంత వరకు మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయలేదన్నారు. తెలంగాణలో నామినేటెడ్ పోస్టులకు కూడా రిజర్వేషన్లు అమలు చేస్తున్నామన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ల కోసం కోటా పాటిస్తున్నామన్నారు. జనాభాకు తగ్గట్లుగా ఇతర వర్గాలకు కూడా రిజర్వేషన్ కల్పించాలని ప్రకాశ్ డిమాండ్ చేశారు. ముస్లింలకు రిజర్వేషన్ కల్పించాలని తీర్మానం చేసి పంపినా కేంద్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. కేంద్రం ప్రవేశపెట్టిన ఈబీసీ బిల్లులో కొన్ని సవరణలు కోరుతున్నట్లు ఆయన తెలిపారు. తెలంగాణ పెండింగ్ బిల్లులను అప్రూవ్ చేయాలని రాజ్యసభ వేదికగా కేంద్రాన్ని కోరారు. మహిళల బిల్లుపై తీర్మానం చేసి పంపామని, మరి కేంద్రం ఆ బిల్లును ఎందుకు ఆలస్యం చేస్తోందని ప్రశ్నించారు. ఈబీసీ బిల్లుకు తెలంగాణ రాష్ట్ర సమితి మద్దతు తెలుపుతున్నట్లు ఎంపీ ప్రకాశ్ వెల్లడించారు.

ఈబీసీలకు మేలు చేసే బిల్లు: టీడీపీ ఎంపీ సుజనా చౌదరి



ఈబీసీ రిజర్వేషన్ బిల్లుకు తెలుగుదేశం పార్టీ బేషరతుగా మద్దతు తెలుపుతున్నట్లు చర్చలో పాల్గొన్న టీడీపీ ఎంపీ సుజనా చౌదరి అన్నారు. ఈబీసీలకు మేలు చేసేందుకు తీసుకువచ్చిన ఈ బిల్లు మంచిదే, కానీ, ఇంత హడావుడిగా బిల్లు తీసుకురావడం దురదృష్టకరమన్నారు. రిజర్వేషన్ల అమలుకు ప్రభుత్వ ఉద్యోగాలు ఎక్కడ ఉన్నాయని ఆయన ప్రశ్నించారు. విస్తృత చర్చ కోసం ఈ బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపించాలని సుజనా చౌదరి సూచించారు. కాగా నోట్ల రద్దు తరహాలోనే ఎలాంటి హోంవర్క్ లేకుండా బిల్లును తెచ్చారని టీడీపీకి చెందిన మరో ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ విమర్శించారు. ఎన్నికల ముందు రాజకీయ లబ్ధి కోసం మోదీ జిమ్మిక్కులు చేస్తున్నారన్నారు. అగ్రవర్ణాలకు రిజర్వేషన్లు కల్పించే బిల్లుకు టీడీపీ కట్టుబడి ఉంది కానీ.. అన్ని వర్గాలకు న్యాయం జరగాలన్న కనకమేడల తమ డిమాండ్లు పరిశీలించాలని కోరారు. కాపుల రిజర్వేషన్లు, కేంద్రం దగ్గర పెండింగ్లో ఉన్న కోటాల సంగతి తేల్చాలని టీడీపీ ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ అన్నారు.

రాజ్యాంగంలో ఎక్కడా ఆర్థిక వెనుకబాటుతనం అని లేదు: రాజా

ఆర్థిక బలహీనవర్గాల రిజర్వేషన్ల బిల్లు తీసుకొచ్చిన తీరు దేశ ప్రజలను కలవరపరిచిందని సీపీఐ ఎంపీ రాజా అన్నారు. రాజ్యాంగ సవరణ బిల్లు తీసుకొచ్చే తీరు ఇదేనా? అని ప్రశ్నించిన ఆయన ఈ ప్రభుత్వం కార్పొరేట్ల పక్షానే ఉందని విమర్శించారు. కార్మికులు, రైతులు, యువత పక్షాన ప్రభుత్వం లేదని, బిల్లును సెలక్ట్ కమిటీకి పంపంచాల్సిందేనని రాజా డిమాండ్ చేశారు.




రాజ్యాంగంలో ఎక్కడా ఆర్థిక వెనుకబాటుతనం అని లేదని రాజా అన్నారు. వివక్ష ఎదుర్కొంటున్న వారికే రిజర్వేషన్లు ఉండాలని అంబేద్కర్ చెప్పారని ఆయన చెప్పారు. దేశంలో దళితులపై దాడులు విపరీతంగా జరుగుతున్నాయని, ప్రైవేటురంగంలో రిజర్వేషన్లు తీసుకొచ్చే దమ్ము ఈ ప్రభుత్వానికి ఉందా? అని, రాజ్యాంగ స్ఫూర్తిని ప్రభుత్వం దెబ్బతీస్తోందని రాజా మండిపడ్డారు.

దళితులకు రిజర్వేషన్లు ఉన్నాయనే దాడులు: అథవాలే



కాగా దళితులపై తరచుగా దాడులు జరగడానికి రిజర్వేషన్ ఒక కారణమని కేంద్ర మంత్రి అథవాలే అన్నారు. ఈబీసీ బిల్లుపై చర్చలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. "దళితులకు రిజర్వేషన్లు ఉన్నాయన్న ఆక్రోశంతోనే దాడులు జరుగుతున్నాయి. అగ్రవర్ణాలకు రిజర్వేషన్ కల్పిస్తే అందరికీ న్యాయం జరిగి పరిస్థితులు చక్కబడతాయి." అని అన్నారు. చర్చ సందర్భంగా ప్రధాని మోదీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షాను రాందాస్ అథవాలే పొగడ్తలతో ముంచెత్తారు. రాజసభలో ఈబీసీ బిల్లు చర్చ సమయంలో ఆయన మోదీని ప్రశంసిస్తూ కాంగ్రెస్‌పై విమర్శలు చేశారు. మోదీ, అమిత్ షా నాయకత్వాన్ని పొగుడుతూ తనకు అవకాశమిస్తే కాంగ్రెస్‌పై సిక్సర్ కొడతానంటూ సుదీర్ఘ కవిత చదివారు. బీజేపీ రాజకీయంగా బలహీనపడటంతో కోటా బిల్లు తెరపైకి తెచ్చారన్న విమర్శలను అథవాలే ఖండించారు. అంతేకాదు రాజస్థాన్, మధ్యప్రదేశ్లో బీజేపీ ఓటమి అతి సాధారణమంటూ జోకులేశారు.

అగ్రవర్ణాల పేదలకు ఇప్పటివరకు న్యాయం జరగలేదు: జీవీఎల్



కాగా అగ్రవర్ణాల పేదలకు ఇప్పటివరకు న్యాయం జరగలేదని బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు అన్నారు. రాజ్యసభలో ఈబీసీ బిల్లుపై చర్చలో పాల్గొన్న ఆయన "ఇప్పుడు ప్రధాని మోదీ అగ్రవర్ణాలకు న్యాయం చేస్తున్నారు. జనం కోసం నిలబడే నాయకుడు మోదీ. గత ఏడాదిలోనే 71 లక్షల ఉద్యోగాల కల్పన జరిగింది. మోదీ హయాంలో ఉద్యోగాలు రాలేదని అబద్ధపు ప్రచారం. పేదలందరికీ న్యాయం చేస్తున్నాం." అని అన్నారు.

పది శాతం కోటాపై కుట్ర: అరవింద్ కేజ్రీవాల్

కాగా అగ్ర వర్ణాల పేదలకు పది శాతం రిజర్వేషన్ కల్పించే అంశంలో కుట్ర ఉందని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. ఈ నిర్ణయాన్ని ఆమ్ ఆద్మీ పార్టీ తొలుత ఆహ్వానించింది. అయితే ఇందులో పెద్ద కుట్ర ఉందని కేజ్రీవాల్ బుధవారం ట్వీట్ చేశారు. ప్రభుత్వం కేవలం జనరల్ కేటగిరీలోని పేదలకు ఉద్యోగాలు, చదువులో రిజర్వేషన్ కల్పించాలనే లక్ష్యంతోనే ఈ కోటా ప్రతిపాదించలేదని, కుల ఆధారిత రిజర్వేషన్లకు అంతం పలికేందుకు వేసిన పెద్ద ప్రణాళికలో ఇదీ భాగమని ఆయన అభిప్రాయపడ్డారు. 'నేను చాలా మందితో మాట్లాడాను. అందులో ఎక్కువ మంది ఇది భాజపా వ్యూహం అని భావిస్తున్నారు (కుల ఆధారిత రిజర్వేషన్లు అంతం చేసేందుకు). ఇది చాలా డేంజరస్' అని కేజ్రీవాల్ ట్వీట్ చేశారు. గుజరాత్ ఎమ్మెల్యే జిగ్నేశ్ మేవానీ అభిప్రాయాలతో తాను ఏకీభవిస్తున్నానని కేజ్రీవాల్ పేర్కొన్నారు.



ఆర్టీసీ ఎన్నికలు ఇప్పట్లో లేనట్టే



(మొదటిపేజీ తరువాయి) ఇప్పటివరకూ ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని తెలుస్తోంది. పైగా గతంలో ఆర్టీసీకి చైర్మన్‌గా ఉన్న సోమారపు సత్యనారాయణ ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఓడిపోయారు. పైగా ఈ సంస్థకు ఇప్పుడు ఎండీ కూడా లేరు. దీంతో ఈ రెండు పోస్టుల్లో బాధ్యులను నియమించిన తరువాత ఎన్నికలు జరుగుతాయా..? అన్న అంశంపై ఆర్టీసీలో చర్చ జరుగుతోంది.

ఆసక్తి చూపని సర్కారు..?

ఆర్టీసీ ఎన్నికలపై సర్కారు ఆసక్తి కనబరచడం లేదని తెలుస్తోంది. గత ఎన్నికల్లో గుర్తింపు సంఘంగా టీఆర్ఎస్ అనుబంధ సంఘమైన తెలంగాణ మజ్దూర్ యూనియన్ గెలుపొందింది. అయితే ఆర్టీసీపై సర్కారు చూపిస్తున్న వైఖరితో కార్మికుల్లో టీఆర్ఎస్ పైనా, గుర్తింపు సంఘమైన టీఎంయూపై కూడా అసహనం పెరిగిపోయింది. పలుమార్లు టీఎంయూ బాధ్యులైన అశ్వథామరెడ్డి, థామస్‌రెడ్డిపై కార్మికులు ఆగ్రహం చూపించిన సంగతి తెలిసిందే. ఆర్టీసీ కార్మికులు తమ డిమాండ్ల సాధన కోసం సమ్మెకు దిగడానికి చేసిన ప్రయత్నంపై ముఖ్యమంత్రి కేసీఆర్ తీవ్ర ఆగ్రహం కూడా వ్యక్తం చేశారు. అప్పటి నుంచి సర్కారుపై కార్మికులు మరింత కోపంతో ఉన్నారు. ఇటీవల ఎన్నికల్లో ఆర్టీసీ కార్మికుల్లో ఎక్కువ మంది టీఆర్ఎస్‌కు వ్యతిరేకంగానే పని చేశారు. ఈ అంశాలను గమనిస్తే ఇప్పుడు గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహిస్తే.. టీఎంయూను ఓడిస్తారన్న చర్చ కూడా జరుగుతోంది. దీంతో గుర్తింపు సంఘం ఎన్నికలపై సర్కారు ఏ మాత్రం ఆసక్తి చూపడం లేదన్న ప్రచారం జోరుగానే సాగుతోంది.

వరుస ఎన్నికలతో మరింత జాప్యం

పైగా ఇప్పుడు రాష్ట్రంలో వరుస ఎన్నికలు జరుగుతున్నాయి. జనవరి నెలాఖరుకు గ్రామ పంచాయతీ ఎన్నికలు ముగుస్తాయి. ఆ తరువాత వరుసగా జిల్లా పరిషత్, సహకార సంఘాలు, లోక్‌సభ ఎన్నికలు జరుగనున్నాయి. ఇవే కాకుండా.. ఎమ్మెల్సీలుగా ఉన్న పలువురు ఎమ్మెల్యేలుగా గెలవడంతో ఆ స్థానాలు ఖాళీ అయ్యాయి. వీరితో పాటు పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్సీలపై వేటు వేయాలని కౌన్సిల్ చైర్మన్ స్వామీ గౌడ్‌కు టీఆర్ఎస్ ఫిర్యాదు చేసింది. లోక్‌సభ ఎన్నికలు ముగిసిన తరువాత ఖాళీ అయిన ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరుగుతాయి. ఈ ఎన్నికలతో ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికలకు సంబంధం లేకున్నా.. ఇవి ముగిసే వరకూ ఆర్టీసీలో ఎన్నికలు జరిగే అవకాశం కన్పించడంలేదు. ఎన్నికలన్నీ ముగిసిన తరువాత జరుగుతాయా..? లేదా..? అన్న అంశంపై కార్మిక సంఘాలు అనుమానం వ్యక్తం చేస్తున్నాయి. తెలంగాణ ఉద్యమం తీవ్ర స్థాయిలో జరుగుతున్న 2012లో టీఎంయూ, ఎంప్లాయిస్ యూనియన్ కలిసి ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించాయి. నిబంధనల ప్రకారం రెండేళ్లే గడువు అయినప్పటికీ.. అప్పట్లో మూడున్నర ఏళ్లు టీఎంయూ, ఎంప్లాయిస్ యూనియన్ గుర్తింపు సంఘంగా కొనసాగిన అంశాన్ని కార్మిక సంఘాల నేతలు గుర్తు చేస్తున్నారు. ఆర్టీసీ ఎన్నికలు నిర్వహించాలని అధికార పార్టీ భావిస్తేనే జరిగే అవకాశముందని, లేని పక్షంలో ఎన్నికల జరిగేదీ అనుమానేనని అంటున్నారు. ఏదీ ఏమైనా.. ఈ ఏడాది జూన్ నాటికి ఆర్టీసీలో ఎన్నికలు జరిగే అవకాశాలు మాత్రం కన్పించడం లేదు.

ఎన్నికలు నిర్వహించాలి: ఎన్ఎంయూ

ఆర్టీసీలో వెంటనే గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఈ అశోక్ డిమాండ్ చేశారు. గడువు ముగిసి నాలుగు నెలలు గడుస్తున్నా.. ఎన్నికల కసరత్తును ప్రారంభించక పోవడం సరికాదని అన్నారు.

జీహెచ్ఎంసీ సిబ్బందితో మేయర్ సమావేశం

విజయక్రాంతి, మెహదీపట్నం: హైదరాబాద్ నగరాన్ని 2019లో అగ్రభాగాన నిలుపాలని నగర మేయర్ బొంతు రామ్మోహన్ అన్నారు. ఇప్పటికే నగరం అత్యుత్తమ నగరాలలో ఒకటిగా పలు అవార్డులు సొంతం చేసుకుందని తెలిపారు. గత సంవత్సరం హైదరాబాద్ నగరం 27వ ర్యాంకు సాధించిందని, ఈ సంవత్సరం అంతకంటే మెరుగైన ర్యాంకు సాధిస్తుందని అన్నారు. బుధవారం గుడిమల్కాపూర్‌లోని కింగ్ ప్యాలేస్ ఫంక్షన్ హాల్‌లో దాదాపు 3 వేల మంది పారిశుద్ధ్య కార్మికులు, ఇతర జీహెచ్ఎంసీ సిబ్బందితో సమావేశం నిర్వహించి క్షేత్రస్థాయి సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో జీహెచ్ఎంసీ కమిషనర్ దానకిశోర్ మాట్లాడుతూ.. నిబంధనలు అమలు చేయడంలో అధికారులందరు పక్కాగా వ్యవహరించాలని పేర్కొన్నారు. చెత్త, ఇతర వ్యర్థాలను రొడ్డుపై వేసే వారిని గుర్తించి ఇందుకు తగినట్లుగా జరిమానాలు విధించాలని తెలిపారు. తడి, పొడి చెత్త నిర్వహణకు ప్రత్యేకంగా వేరు చేయాలని ఇందుకోసం ప్రజలలో అవగాహన పెరగాలన్నారు.

కనీస వసతులు కల్పించండి

విజయక్రాంతి, సికింద్రాబాద్: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బస్తీల సమస్యలపై ప్రజలకు న్యాయ పరమైన సలహాల కొరకు సదస్సు ను బుధవారం ఓయూ క్యాంపస్‌లో నిర్వహించారు. ఈ సదస్సుకు హైదరాబాద్ జిల్లా లీగల్ సర్వీస్ జడ్జి జి. సుదర్శన్, ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్ డా.గాలి వినోద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జడ్జి సుదర్శన్ మాట్లాడుతూ ఇక్కడి ప్రజలకు న్యాయ పరమైన సమస్యలు ఏమైనా ఉంటే వారికి ఉచిత న్యాయ సలహాలు అందించి అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కారిస్తామన్నారు. అనంతరం డా. గాలి వినోద్ కుమార్ మాట్లాడుతూ యూనివర్సిటీలో పనిచేసే సుమారుగా 2500 కుటుంబాలు, ఎనిమిది వేల మంది ప్రజలు తాగునీటి, మరుగుదొడ్లు, రోడ్లు, కరెంట్ లేక అనేక సమస్యలతో సతమతమౌతున్నారని ఇటు యూనివర్సిటీ అధికారులు ఒప్పుకోవడం లేదు అటు రాష్ట్ర ప్రభుత్వాలు ఒప్పుకోవడం లేదు. మరోవైపు విద్యార్థుల సమస్య కాబట్టి ఇలాంటి పరిస్థితిలో ఇక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. వీరికి పరిష్కారం కొరకు న్యాయ వ్యవస్థ అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం బస్తీ ప్రజలు జడ్జికి తమ సమస్యలు రాసి వినతిపత్రం అందచేశారు.

సీబీఐ డైరెక్టర్‌గా విధులు చేపట్టిన అలోక్ వర్మ



(మొదటిపేజీ తరువాయి) న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయ్ తప్పుకున్నారు. అలోక్ వర్మను సెలవుపై పంపడం తగదని మంగళవారం తీర్పు వెల్లడించిన సుప్రీంకోర్టు ధర్మాసనంలో రంజన్ గొగొయ్ భాగమై ఉన్నందున ఈ కమిటీకి ఆయన దూరంగా ఉన్నారు. అయితే తన స్థానంలో జస్టిస్ ఏకే సిక్రీని ఆయన ప్రతిపాదించారు. అలోక్ వర్మ వ్యవహారంలో నిర్ణయం తీసుకునే కమిటీలో ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో అత్యున్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేశారు. ఇందులో లోక్ సభలో ప్రతిపక్ష నేత, సీజేఐ లేదా ఆయన నామినీ సభ్యులుగా ఉంటారు. అలోక్ వర్మ వ్యవహారంపై ఈ కమిటీ వారంలోగా నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు మంగళవారం స్పష్టం చేసింది. దీంతో ప్రధాని మోదీ, కాంగ్రెస్ నేత మల్లికార్జున్ ఖర్గే, జస్టిస్ ఏకే సిక్రీలతో కూడిన కమిటీ సమావేశమై అలోక్ వర్మ భవిష్యత్తును నిర్ణయించనుంది.

కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా వైద్య ఉద్యోగుల నిరసన



విజయక్రాంతి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య ఉద్యోగులు నిరసన తెలిపారు. ఏఐటీయూసీ అనుబంధ విభాగం తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం వివిధ ఆసుపత్రుల్లో నిరసన తెలిపారు. నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించాలని, కనీస వేతనం రూ.18 వేలుగా నిర్ణయించాలని, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి రెగ్యులరైజ్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. వివిధ ఆసుపత్రుల్లో జరిగిన నిరసన కార్యక్రమాల్లో రాష్ట్ర మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు యస్.విఠల్, ప్రధాన కార్యదర్శి యన్.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

అన్నివర్గాలనూ మోసం చేసిన చంద్రబాబు



(మొదటిపేజీ తరువాయి) ఈ పాదయాత్ర శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం వద్ద ముగిసింది. ఈ సందర్భంగా ఇచ్ఛాపురం సమీపంలోని లొద్దపుట్టి వద్ద ఏర్పాటు చేసిన పైలాన్ను జగన్ ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో జగన్ మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వస్తే వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేస్తానని, తాను చెప్పిన పథకాలన్నీ పేదవాడి ఇంటికి చేర్చేలాగా చర్యలు చేపడతానని కూడా జగన్ మాట ఇచ్చారు. 13 జిల్లాలను 25 జిల్లాలుగా మారుస్తానని, నవరత్నాల్లాంటి పథకాలను అమలు చేస్తానాని జగన్ మాట ఇచ్చారు. వ్యవసాయానికి పగటిపూట 9 గంటల విద్యుత్ పూర్తిగా ఉచితంగా ఇస్తామని, రైతులకు వడ్డీలేని రుణాలు అందిస్తామని, ప్రతి ఏడాది మేలో రైతుకు 12,500 రూపాయల ఆర్థిక సాయం అందిస్తామని జగన్ హామీ ఇచ్చారు. గ్రామ సచివాలయం ద్వారా పథకాల అమలును సమీక్షిస్తామని, కుల, మత, పార్టీల కతీతంగా పథకాల అమలు చేస్తామని తెలిపారు. గ్రామంలో ప్రతి 50 ఇళ్లకు ఒక వాలంటీర్ను నియమిస్తామని, గ్రామ వాలంటీర్కు 5వేల రూపాయల నెల జీతం ఇస్తామని జగన్ హామీ ఇచ్చారు. ఇడుపుల పాయ నుంచి మొదలైన యాత్రలో అనేక అనుభవాలు ఎదురయ్యాయని ఆయన నెమరువేసుకున్నారు. ఈ బహిరంగసభకు వైకాపా నాయకులు భూమన కరుణాకర్‌రెడ్డి, బొత్స సత్యనారాయణ, తమ్మినేని సీతారామ్, వాసిరెడ్డి పద్మ, మాజీ ఎంపీ వరప్రసాద్ పార్టీ శ్రేణులు, ప్రజలు భారీగా హాజరయ్యారు.



విశ్వబ్రహ్మణ స్వర్ణకార సంఘం ఎల్బీనగర్ మధురపురి కాలనీ దిల్‌సుఖ్‌నగర్ వారి స్వర్ణకార సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రమేష్‌ముదిరాజ్, అధ్యక్షుడు కీర్తి, ఆనంతచారి, ప్రధాన కార్యదర్శి శ్రీరామదాసు గోవర్ధన్‌చారి, కోశాధికారి వలబోజు కృష్ణమాచారి, ఉపాధ్యక్షుడు చేపూరి సతీష్, సహాయ కార్యదర్శి తుడిమిల్ల లవకుమార్, ప్రచార కార్యదర్శి శ్రీ రామదాసు తిరుపతిచారి, గౌరవ సలహాదారులు వలబోజు శ్రీనివాసచారి, రవి, సాయి, గిరి, దయాకర్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

(విజయక్రాంతి, ఎల్బీనగర్)

ఈ నెల 10న బీసీ సంఘాల ఛలో పార్లమెంట్

విజయక్రాంతి, హైదరాబాద్: జనాభా దామాషా ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ప్రజా ఉద్యమాన్ని చేపట్టేందుకు బీసీ సంఘాలు తీర్మానించాయి. ఈ నెల 10న ఛలో పార్లమెంట్‌తో ధర్నాకు పిలుపునిచ్చాయి పది శాతం అగ్ర వర్ణాల పేదలకు రిజర్వేషన్లు ఇస్తున్నప్పుడు, 70 శాతం బీసీలకు 70 శాతం రిజర్వేషన్లు ఎందుకు ఇవ్వరని ప్రశ్నించాయి. తెలంగాణ బసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో బీసీ సంఘాలు అత్యవసరంగా సమావేశమయ్యాయి. తమ న్యాయమైన డిమాండ్ ను తెరపైకి తెస్తూ భారీ ఉద్యమాన్ని నడిపేందుకు కార్యాచరణ ప్రకటించాయి.



రణదీప్‌తో దాసోజు భేటీ

విజయక్రాంతి, హైదరాబాద్: ఏఐసీసీ సమాచార విభాగం ఇంఛార్జిరణదీప్ సింగ్ సుర్జేవాలతో ఏఐసీసీ అధికార ప్రతినిధి దాసోజు శ్రవణ్ భేటీ అయ్యారు. తనకు ఏఐసీసీ అధికార ప్రతినిధిగా అవకాశం కల్పించినందుకు దాసోజు శ్రవణ్ ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీకి, సుర్జేవాలకు ధన్యవాదాలు తెలిపారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మీడియా, కమ్యూనికేషన్లు ఎలా ఉండాలనే విషయాలపై వారు చర్చించారు.



అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే గాంధీ సమీక్ష

- నిర్ణీత కాలంలో పనులు జరగాల్సిందే.. లేదంటే ఉపేక్షించేది లేదు

విజయక్రాంతి, హైదర్‌నగర్: ప్రభుత్వ అధికారులు సమన్వయంతో నిర్ణీత సమయంలో పనులు పూర్తిచేయాలని లేకుంటే ఉపేక్షించేది లేదని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ హెచ్చరించారు. బుధవారం వివేకానందనగర్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో హైదర్ నగర్ ,ఆల్విన్ కాలనీ, వివేకానంద నగర్ , కూకట్ పల్లి డివిజన్ల కార్పొరేటర్లు, మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం అధికారులతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు అభివృద్ధి పనులు, అసంపూర్తిగా మిగిలిన పనులపై అధికారులతో చర్చించారు.ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ పనులను త్వరితరగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు.

రిజర్వేషన్ల అమలుతో అందరికీ న్యాయం

- బూడిద రాంరెడ్డి

విజయక్రాంతి, ఇబ్రహీంపట్నం: కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన అగ్రవర్ణాల పేదలకు పదిశాతం రిజర్వేషన్ వల్ల చాలా మందికి న్యాయం జరుగుతుందని బీజేవైఎం రాష్ట్ర సహాయ కార్యదర్శి బూడిద రాంరెడ్డి అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోడి తీసుకున్న నిర్ణయం వల్ల 99శాతం మంది ప్రజలకు ఉపయోగ పడుతుందన్నారు. దేశంలో ఐదు ఎకరాల భూమి కంటే తక్కువ ఉన్న వారు 2018వ ఆర్థిక సంవత్సరానికి ఆర్థిక శాఖ ఇచ్చిన నివేదిక ఆధారంగా 95 శాతం మంది ఉన్నారన్నారు. ప్రతి రాజకీయ పార్టీ రిజర్వేషన్లకు మద్దతు ఇచ్చే పరిస్థితి నెలకొందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు అధిక సంఖ్యలో గెలుపొందే విధంగా కృషి చేయాలని కోరారు.



పేద కార్మికులకు దుస్తులు పంపిణీచేసిన పాల వ్యాపారి చంద్రశేఖర్ యాదవ్

విజయక్రాంతి, శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నియోజవకర్గం గుల్ మోహర్ పార్కు కాలనీ నేతాజీనగర్‌కు చెందిన పాల వ్యాపారి చంద్రశేఖర్ యాదవ్ సంక్రాంతి పర్వదినం సందర్భంగా పేదలకు నూతన వస్త్రాలను పంపిణీ చేసారు. ప్రతి ఏడాది చంద్రశేఖర్ తన సంపాదనలో కొంత సేవా కార్యక్రమాలకు ఉపయోగించడం ఆనవాయతీ. బుధవారం చంద్రశేఖర్ యాదవ్ తన స్వగృహంలో జీహెచ్‌ఎంసీ కార్మికులకు నూతన వస్త్రాలను పంపిణీచేసి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. ఇలా గత 10 సంవ్సరాలుగా పేదలకు వస్త్రాలను దానం చేస్తున్నట్లు చంద్రశేఖర్ యాదవ్ తెలిపారు.



మూసీనది ఒడ్డున రేకుల ఇళ్లు కూల్చివేత

విజయక్రాంతి, ఉప్పల్: ఉప్పల్‌లోని రామంతపూర్ డివిజన్‌లో కేటీఆర్ నగర్ మూసీ నది పరివాహక ప్రాంతంలో మూసీనది ఒడ్డున నిర్మించుకున్న రేకుల గుడిసెలను పోలీసు బందోబస్తుతో రెవిన్యూ అధికారులు కూల్చివేశారు. ఉప్పల్ తహసీల్‌దార్ రమేష్‌కుమార్ ఆదేశాల మేరకు ఆర్‌ఐలు రాధిక, రోజా, వీఆర్వోలు అలేఖ్య, విశ్వనాథం, బాలరాజు, వీఆర్ఎలు నాగలక్ష్మి, ప్రతిభ, నరేందర్, శ్రీనివాస్, రమాదేవి, సంగీత, సంజీవ్, స్వామి, దుర్గయ్య, కమలాకర్‌లు కూల్చివేత కార్యక్రమంలో పాల్గొన్నారు. కూల్చివేతలను అడ్డుకున్న సంధ్యారాణి అనే మహిళ రోదిస్తూ బండ రాయితో తనని తాను తలపై దాడి చేసుకోగా తీవ్ర రక్తస్రావం కావటంతో చికిత్సకై 108లో గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో సుమారు పది గుడిసెలు కూల్చివేయడం జరిగింది. తమకు నోటరీలున్నాయని చూపించినా రెవిన్యూ అధికాలరులు కూల్చివేశారని ఆవేదన వ్యక్తం చేసారు.

ఓటరు నమోదుకు 8 లక్షల దరఖాస్తులు

- ఫిబ్రవరి 25న తుది జాబితా: రజత్‌కుమార్

విజయక్రాంతి, హైదరాబాద్: తెలంగాణలో ఈ ఏడాది చేపట్టిన ఓటర్ల నమోదు ప్రక్రియలో కొత్తగా 8 లక్షలకు పైగా దరఖాస్తులు వచ్చాయని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి రజత్‌కుమార్ తెలిపారు. బుధవారం సచివాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రతి ఏడాది జనవరి 1వ తేదీ నుంచి కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియను పూర్తి చేసి నూతన ఓటర్ల జాబితాను కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటిస్తుందని తెలిపారు. దీంట్లో భాగంగానే ఈ ఏడాది మన రాష్ట్రంలో నూతన ఓటర్ల జాబితాను ప్రకటించామని వెల్లడించారు. ఓటర్ల తొలగింపు కోసం 10వేల దరఖాస్తులు వచ్చాయని వివరించారు. జవవరి 25వరకూ ఓటరు నమోదుకు దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. ఫిబ్రవరి 25వ తేదీన తుది ఓటరు జాబితాను ప్రచురిస్తామని వెల్లడించారు. తుది జాబితా ముద్రణ తర్వాత డబుల్ ఓట్లు కూడా తొలగించడం సాధ్యం కాదన్నారు. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఓటర్ల జాబితి విషయంలో ఎక్కువ ఆరోపణలు వచ్చాయని, అలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎన్నికలకు ముందు ఓటరు జాబితాలో పేరు సరిచూసుకోవడం పౌరుల బాధ్యత అని అన్నారు.



జాబితాలో పేరు సరిచూసుకోవడం పౌరుల బాధ్యత

హైదరాబాద్ పరిధిలో 6లక్షల ఓట్ల తొలగింపు జరిగింది. ఎన్నికలకు ముందు ఓటరు జాబితాలో పేరు సరిచూసుకోవడం కూడా పౌరుల బాధ్యత అని రజత్‌కుమార్ అన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఓట్ల తొలగింపుపై హైకోర్టులో పిటిషన్ వేసిన విషయం తెలిసిందే. అసెంబ్లీ ఎన్నికల పోలింగు నాడు 20లక్షల ఓట్లు తొలగించినట్లు ప్రతిపక్షాలు దుమ్మెత్తి పోసాయి.దీంతో ఓట్ల తొలగింపు అంశం కీలకంగా మారింది.

కొత్త ఓటర్ల నమోదుకు చర్యలు ఈ నెల 20న ప్రత్యేక శిబిరం

- 22, 23, 24 మూడురోజులు కొనసాగింపు

విజయక్రాంతి, హైదరాబాద్: సీఈఓ జారీచేసిన మార్గదర్శకాలు, సూచనల ప్రకారం చిత్తశుద్ధితో పనిచేయడానికి ఈఆర్ఓ లను జిల్లా ఎన్నికల అధికారి దాన కిషోర్ ఆదేశించారు. బుధవారం ఆయన రాజకీయ పార్టీలు, ఎ.ఆర్.ఓ.లు, ఎన్నికల విభాగాల యంత్రాంగంతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. జనవరి 20 వ తేదీని ప్రత్యేక ప్రచార రోజుగా నిర్ణయించినట్లు డీఈఓ పేర్కొన్నారు. అభ్యంతరాలను స్వీకరించడానికి ఓటర్ల జాబితాతో పోలింగ్ స్టేషన్ వద్ద బీఎల్ఓ లు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ప్రత్యేక ప్రచారం 22, 23, 24 తేదీలలో చేపట్టనున్నట్లు వెల్లడించారు. . బీఎల్ఓ ల ద్వారా ఇంటింటి సర్వేలో వీటి పరిశీలన జరుగుతుందన్నారు.



టీడీపీతో కలిసి పోటీపై పునరాలోచనలో కాంగ్రెస్

- కోల్‌కత్తా ర్యాలీ తర్వాత స్పష్టత

విజయక్రాంతి, హైదరాబాద్: రాబోయే లోక్ సభ, ఆంధ్ర ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తెలుగు దేశం తో కలిసి పోటీచేసే విషయంలో ఆలోచనలో పడిందా, మహా కూటమి నుండి ఒక్కొక్కరు పక్కకు వెళ్లి పోతున్నారా, అంటే అవుననే సమాధానం వస్తోంది రాజకీయ వర్గాలనుండి.

మంగళవారం, ఆంధ్ర ప్రదేశ్ ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు రాహుల్ గాంధీ తో ఢిల్లీ లో సమావేశమైన విషయం తెలిసిందే. రెండు తెలుగు రాష్ట్రాల్లో తాజా రాజకీయ పరిణామాలపై వారిద్దరి మధ్య చర్చకు వచ్చినట్లు సమాచారం. ముఖ్యంగా, ఇటీవల తెలంగాణ లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో ప్రజా కూటమి ఘోరంగా ఓటమి పాలైన విషయం పైనే ప్రధానంగా చర్చ జరిగినట్లు తెలుస్తోంది. తెలుగు దేశం పార్టీ తో పొత్తు పెట్టు కోవడం వల్లనే ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పూర్తిగా దెబ్బతిందని, కనీసం 40 సీట్లన్నా వస్తాయనుకుంటే, కేవలం 19 సీట్లతో సరిపెట్టొకోవాల్సి వచ్చిందని ఇప్పటికే తెలంగాణ కాంగ్రెస్ నాయకులు పార్టీ హైకమాండ్ కు నివేదిక పంపినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో, తెలంగాణ ఎన్నికల ఫలితాలపై నిన్నటి సమావేశంలో రాహుల్ గాంధీ కి చంద్రబాబు కొంత వివరణ ఇచ్చినట్లు పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది. అంతే కాకుండా, వచ్చే ఎన్నికల్లో కూడా కలిసి పోటీచేయాలని తాను భావిస్తున్నట్లు చంద్రబాబు ప్రతిపాదించారు. అయితే, దీనిపై మాత్రం రాహుల్ గాంధీ ఎలాంటి నిర్ణయం ఇంకా తీసుకోలేదని, తెలుగు దేశం పార్టీ తో కలిసి పోటీ చేసే విషయంపై అయన పునరాలోచనలో పడ్డారని పార్టీ వర్గాల సమాచారం. కానీ, చంద్రబాబు మాత్రం తాను కాంగ్రెస్ తోనే కలిసి పోటీచేయాలనే విషయాన్ని రాహుల్ కు స్పష్టం చేసారు. ఇది ఇలావుండగా, జనవరి 19 వ తేదీన కోల్కతా లో జరుగబోయే తృణమూల్ కాంగ్రెస్ ర్యాలీలో చంద్రబాబు కూడా పాల్గొంటారని, ఆ ర్యాలీ తర్వాత అక్కడ సీనియర్ నేతలంతా భేటీ అవుతారని, మహా కూటమి పై కొంత చర్చ జరిగే అవకాశముందని టీడీపీ వర్గాలంటున్నాయి. ఈ భేటీ లో కీలక నిర్ణయాలు తీసుకొనే అవకాశమున్నట్లు కూడా ఒక సీనియర్ టీడీపీ నాయకుడు విజయక్రాంతి తో చెప్పారు. చంద్రబాబు మరోసారి రాహుల్ గాంధీ తో భేటీ అయ్యే అవకాశాలున్నాయని పార్టీ నాయకులంటున్నారు.

ధనికరాష్ట్రం అంటూనే ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ ఎలా?

- నిజాముద్దీన్

విజయక్రాంతి, హైదరాబాద్: తెలంగాణ ధనికరాష్ట్రం అంటూనే ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ ఎలా పెడతారని సీఎం కేసీఆర్‌ను టీపీసీసీ అధికార ప్రతినిధి నిజాముద్దీన్ ప్రశ్నించారు. ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం, కేబినెట్ లేకుండా బడ్జెట్ ఎలా పెడతారని నిలదీశారు. టీఆర్ఎస్ హామీలు నెరవేరాలంటే రూ. 2.50 లక్షల కోట్ల బడ్జెట్ కావాలని, ఇప్పటికే రూ. 2.20 లక్షల కోట్లు అప్పుల్లో తెలంగాణ కూరుకుపోయిందని ఆయన తెలిపారు. రైతుబంధుకు రూ. 15వేల కోట్లు, రుణమాఫీకి రూ. 24వేల కోట్లు అవసరమని, పెన్షన్లకు రూ. 25వేల కోట్లు కావాలని, జీతభత్యాలకు రూ. 40వేల కోట్లు కావాలన్నారు. అప్పులు ఎలా తీరుస్తారో కేసీఆర్ శ్వేతపత్రం విడుదల చేయాలని నిజాముద్దీన్ డిమాండ్ చేశారు.



రూ.5 కోట్ల విలువైన బంగారం, వెండి స్వాధీనం

విజయక్రాంతి, హైదరాబాద్: విజయవాడ డివిజన్ రైల్వే రక్షక దళం సిబ్బంది ఇద్దరు దోపిడీ దొంగలను పట్టుకున్నారు. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే బుధవారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేసింది. పట్టుకున్న దొంగల నుంచి రూ.5 కోట్ల విలువైన బంగారు, వెండి, నగదును స్వాధీనం చేసుకున్నారు.

ఒక నగర షాపును దోచుకున్న దొంగలను గురించిన సమచారం చెన్నై జాయింట్ పోలీస్ కమిషనర్ నుండి విజయవాడ డివిజన్ సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ ఎస్.ఆర్.గాంధీకి అందింది. దీనితో దొంగల మొబైల్ ఫోన్‌ని ట్రాక్ చేసి 3 రైళ్లలో తనిఖీ చేసి గూడూరులో నేరస్తుల కదలికలు గమనించి మధురై – హజ్రత్ నిజాముద్దీన్ సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్‌లో దొంగలను పట్టుకున్నారు. దొంగల నుండి రూ.5 కోట్ల విలువగల 13.5 కిలోల బంగారం, 67 కిలోల వెండి, రూ.40,000 నగదు ఆర్పీఎఫ్ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు.

సంక్రాంతికి 54 ప్రత్యేక రైళ్లు

విజయక్రాంతి, హైదరాబాద్: సంక్రాంతి రద్దీని తగ్గించేందుకు రైల్వే వివిధ ప్రాంతాల మధ్య 54 జనసాధారణ్ సంక్రాంతి ప్రత్యేక రైళ్లను నడుపనుంది. ఈ రైళ్లను సికింద్రాబాద్ – తిరుపతి, తిరుపతి – కాకినాడ టౌన్, విజయవాడ – విజయనగరం, సికింద్రాబాద్ – విజయవాడ – హైదరాబాద్, సికింద్రాబాద్ – విజయవాడ – సికింద్రాబాద్‌ల మధ్య నడుపనుంది. ప్రత్యేక రైళ్లు జనవరి 11, 12, 13, 14, 15, 16, 17, 18, 19, 20తేదీల్లో అందుబాటులో ఉంటాయి. ఈ రైళ్లు మార్గమధ్యలో నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, కాజీపేట, వరంగల్, డోర్నకల్, ఖమ్మం, విజయవాడ తదితర స్టేషన్లలో ఆగుతాయి.

ఉప్పల్‌లో కార్మిక సమ్మె సక్సెస్

విజయక్రాంతి, ఉప్పల్: సీఐటీయూ కార్యకర్తలు ఉప్పల్ ప్రారిశ్రామిక ప్రాంతంలోని కంపెనీలను బంద్ చేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు జె.వెంకన్న, ఎఐటియుసి నాయకులు రాంనారాయణ, టిఆర్ఎస్‌కెవి నాయకులు బసిరెడ్డిలు మాట్లాడతూ కేంద్రప్రభుత్వం వెంటనే కనీస వేతనం నెలకు 18000 వేలు, ఇఎస్ఐ, పిఎఫ్, 8 గంటల పని విధానం అమలు అయ్యేటట్లు పార్లమెంటులో బిల్లు తీర్మానం చేయాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎ.శ్రీనివాస్, కృష్ణ,వెంకటేష్, శ్రీకాంత్, శేఖర్, జంగారెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



హార్మోన్‌ల అసమతుల్యత వల్ల ఒత్తిడి

మధ్యవయస్కుల్లో ఒత్తిడితో మెదడు కుచించుకుపోయి జ్ఞాపక శక్తి దెబ్బతినే ప్రమాదం ఉందని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. 40 ఏళ్లు దాటిన వారిలో ఒత్తిడి హార్మోన్ కార్టిసోల్ ప్రభావంతో మెదడు కుచించుపోతున్నట్టు గుర్తించారు. ఒత్తిడి హార్మోన్ అత్యధికంగా విడుదల కావడం మున్ముందు డిమెన్షియా ముప్పుకు దారితీస్తుందని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. ఒత్తిడి ప్రజల ఆలోచనా ధోరణిని కూడా ప్రభావితం చేస్తుందని జర్నల్ న్యూరాలజీలో ప్రచురితమైన హార్వర్డ్ మెడికల్ స్కూల్ అధ్యయనం వెల్లడించింది.

పరిశోధన కోసం 49 ఏళ్ల సగటు వయసు కలిగిన 2231 మందిని డాక్టర్ జస్టిన్ నేతృత్వంలో శాస్త్రవేత్తలు పరీక్షించారు. తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటూ డిమెన్షియా ప్రారంభ లక్షణాలైన మెదడు కుచించుకుపోవడం, జ్ఞాపకశక్తి మందగించడాన్ని ఆయా వ్యక్తుల్లో తమ పరిశోధనలో భాగంగా గుర్తించామని డాక్టర్ జస్టిన్ వెల్లడించారు.

తగినంత నిద్ర, సరైన వ్యాయామం, ఆహ్లాదంగా గడపటం వంటి చర్యలతో ఒత్తిడిని తగ్గించుకునేందుకు ప్రజలు చొరవ చూపాలని సూచించారు. అవసరమైతే ఒత్తిడిని పెంచే కార్టిసోల్ను నియంత్రించే మందులను వైద్యులను సంప్రదించి తీసుకోవాలన్నారు. కార్టిసోల్ అధికంగా విడుదలయ్యే రోగుల పట్ల వైద్యులు తగిన శ్రద్ధ చూపాలని సూచించారు. శరీరంలో హార్మోన్ల అసమతుల్యతను మెయింటైన్ చేయడానికి హెల్తీ ఫ్యాట్స్ రెగ్యులర్ డైట్‌లో తీసుకోవడం అవసరం. ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్, ఒమేగా 6 ఫ్యాటీ యాసిడ్స్ అధికంగా ఉన్న ఆహారాలను అనగా ఆలివ్ ఆయిల్, రియల్ బట్టర్, చేపలు, పీనట్ బట్టర్ వంటివి తీసుకోవడం మంచిది. క్యారెట్స్ ఉండే ఫైబర్ కంటెంట్ శరీరాన్ని డిటాక్సిఫై చేసి, అదనపు ఆస్ట్రోజన్ స్రవిస్తుంది. స్త్రీ, పురుషులిద్దరికి క్యారెట్ బాగా సహాయపడుతుంది. పీరియడ్స్ సమస్యలతో బాధపడేవారికి క్యారెట్ గ్రేట్ హార్మోన్ బ్యాలెన్స్ ఆహారం.

పౌరసత్వ సవరణ బిల్లుపై ఎందుకీ రగడ?

మనం అక్కడెక్కడో మ్యాన్మార్ లో ప్రభుత్వంపై తిరుగుబాటు చేస్తే తన్ని తరిమేసిన రోహింగ్యాలను చూసి యావద్దేశం కన్నీరు కారుస్తుంది. వారి ఇడుములను, ఇక్కట్లను చూసి తల్లడిల్లిపోతుంది. మామూలుగా మనబోటి వాళ్ళకు దొరకని అన్ని హక్కులనూ ఆర్టికల్ 370 ని పక్కనబెట్టి మరీ జమ్మూ కశ్మీర్ కల్పిస్తుంది. హైదరాబాద్ లో వారికి ఆధార్లు, ప్యాన్ కార్డులు తయారై పోతాయి.

ఖండాంతరాల అవతల మెక్సికన్ చొరబాటుదారులను రానివ్వకుండా కంచె కడతానని డోనాల్ ట్రంప్ అంటే మనం బాధపడిపోతాం. మెక్సికన్లతో సంఘీభావాన్ని ప్రకటించేస్తాం. ట్రంపును తెగతిట్టిపోస్తాం. శరణార్థిగా ఇరాక్ ను విడిచి పడవలో వెళ్లూ ప్రమాదానికి గురైన మూడు నాలుగేళ్ల అలాన్ కుర్ది అనే పసివాడి శవం యూరప్ బీచ్ లో దొరికితే ఇండియాలో మనం కన్నీరు మున్నీరైపోతాం. కుర్ది సైకత శిల్పాన్ని పూరీ బీచ్ లో తయారు చేసి మరీ సమవేదనను తెలియచేస్తాం.

కానీ అదేమిటో మన దేశంనుంచి విడిపోయిన పాకిస్తాన్, బంగ్లాదేశ్, అఫ్గనిస్తాన్ లలోని హిందూ, బౌద్ధ, సిక్కు, జైన, క్రైస్తవ మైనారిటీలు సంఖ్యాధిక్యం ఉన్న మతాంధుల కరాళ కృత్యాలకు బలైపోతుంటే మాత్రం మన మనసు కరగదు గాక కరగదు. వారు తమ మత విశ్వాసాల కారణంగా కాఫిర్లుగా ముద్రపడి అష్టకష్టాలు పడుతూంటే మనకు బాధ కలగదు గాక కలగదు. వారు శరణార్థులై మన దేశానికి వస్తే వారిపై ఆంక్షల మీద ఆంక్షలు, కట్టడుల మీద కట్టడులు. ఏళ్ల తరబడి ఇక్కడ జీవిస్తున్నా వారికి పౌర హక్కులు దొరకవు గాక దొరకవు. ఇలాంటి వారి గురించి మాట్లాడటం అదేదో విచిత్రంగా 'మత తత్వవాదం' అయిపోతుంది. వారికి పౌరసత్వాన్ని ఇచ్చే ప్రయత్నాలు 'మతదురహంకారం' గా చిత్రితమౌతాయి. ప్రస్తుతం ఇలాంటి పరిస్థితే కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన సిటిజెన్ షిప్ అమెండ్ మెంట్ బిల్లు (పౌరసత్వ సవరణ బిల్లు) కు ఎదురవుతోంది.

ఆశ్చర్యం ఏమిటంటే అధికార పక్షానికి సానుకూలంగా ఉన్న మిత్రపక్షాలైన శివసేన, జనతాదళ్ యునైటెడ్ వంటి పార్టీలు దీనిని వ్యతిరేకిస్తున్నాయి. బీహార్ లో బంగ్లాదేశీ చొరబాటుదారులను తరిమివేయకుండా కటిహార్, పూర్ణియా, కిషన్ గంజ్ లోకసభాస్థానాల్లో వారి మెజారిటీ ఉన్నా పట్టించుకోని జనతా దళ్ తన రాష్ట్రానికి పెద్దగా సంబంధం లేని అంశంపై సన్నాయి నొక్కులు నొక్కడం ఒక విడ్డూరం. శివసేన ఈ విషయంలో విరోధభావాన్ని ప్రదర్శించడం విషాదం. ఇక అస్సాంలో బిజెపి మిత్రపక్షం అస్సాం గణపరిషద్ ఎన్ డీ యే నుంచి బయటకు రావడమే కాదు, తమ ముగ్గురు మంత్రులనూ రాజీనామా చేయించింది.

విషాదం ఏమిటంటే అఫ్గనిస్తాన్, పాకిస్తాన్, బంగ్లాదేశ్ లలోని హిందువుల తప్పేమీ లేకుండానే వారు నిర్దాక్షిణ్యమైన హింసకు గురవుతూ వస్తున్నారు. ఏలికలు ఎయిర్ కండిషన్ రూముల్లో కూర్చుని దేశాన్ని ప్రజా ప్రమేయం లేకుండానే విభజించిన పాపానికి వీరు బలయ్యారు. 1947 లో అవిభక్త పాకిస్తాన్ లో హిందువుల జనాభా 24 శాతం. నేడు వారి జనాభా ఒక శాతం కూడా లేదు. అలాగే బంగ్లాదేశ్ లోనూ హిందువుల సంఖ్య ఏడు శాతం కన్నా తక్కువ. 2011 నుంచి పాకిస్తాన్ నుంచి 30000 మంది శరణార్థులు మన దేశంలోకి వచ్చారు. అదే విధంగా బంగ్లాదేశ్ లోని చిట్టగాంగ్ జిల్లాలో దేశ విభజన సమయంలో జనాభాలో 90 శాతం బౌద్ధులు. నేడు బౌద్ధులు అక్కడ మైనారిటీలు. వీరందరి బాధ్యతను భారత ప్రభుత్వం తన నెత్తిన వేసుకుని దేశ విభజన కాలం హామీలు ఇచ్చింది కాబట్టే వీరికి ఆశ్రయాన్ని కల్పించాలి. ఆ హామీల మేరకే హిందూ, సిక్కు, జైన, పార్సీ, క్రైస్తవ మైనారిటీలకు మన దేశంలో ఆశ్రయం కల్పించడం, పౌరసత్వం కల్పించడం ప్రభుత్వం నిర్వహించవలసిన మానవీయ విధి. ఈ విధిని కేంద్ర ప్రభుత్వం నిర్వర్తించేందుకే కేంద్రం ఈ బిల్లును 2016 లో ముందుకు తెచ్చింది.

ఈ బిల్లును ఆమోదించడం దేశ విభజన నాడు భారత దేశం మననుంచి వేరైన దేశాల్లోని అల్పసంఖ్యాకులకు ఇచ్చిన బాధ్యతను నెరవేర్చడమే తప్ప ఇంకొకటి కాదు. పాకిస్తాన్, బంగ్లాదేశ్, అఫ్గనిస్తాన్ లనుంచి వస్తున్న హిందూ శరణార్థులను రోహింగ్యాలతో, బంగ్లాదేశీయులతో పోల్చడం సరి కాదు. అక్రమ చొరబాటుదారును, శరణార్థిని ఒకే గాటన కట్టాలనుకోవడం పొరబాటు. వీరందరూ దేశ విభజన బాధితులు. మన నేతలు విభజనను అంగీకరించిన కారణంగా వీరి బతుకులు బుగ్గి అయ్యాయి. వీరి మనుగడ ప్రశ్నార్థకమైంది. కాబట్టి వీరికి ఆశ్రయం ఇచ్చేందుకు ఈ బిల్లును కేంద్రప్రభుత్వం ముందుకు తీసుకువచ్చింది. దీనిని గమనించకుండా నిర్హేతుకమైన ఆందోళనకు పాల్పడటం దురదృష్టకరం.

సమయస్ఫూర్తితో సమాధానం చెప్పాలి

కొన్ని పరిస్థితులలో ఏమి మాట్లాడాలో తెలియక మౌనంగా ఉంటే, దాన్ని ఎదుటివారు అలుసుగా తీసుకుని'మౌనం అంగీకార సూచనం' అని భావించే అవకాశం ఉంది. అలా కాక తన వ్యక్తిత్వాన్ని కాపాడుకుంటూ, తన అహం దెబ్బ తినకుండా, ఎదుటి వారికి మరీ మోతాదు మించకుండా, పరిస్థితి చెడిపోకుండా, గట్టి సమాధానాన్ని చెప్పటాన్ని సమయస్ఫూర్తి అంటారు.

బ్రిటీషువారు భారత దేశాన్ని పరిపాలించే రోజులలో–

1. ఒక బ్రిటీషు అధికారి గాంధీగారితో 'మీ భారతీయులంతా అనేక రంగులలో ఉంటారు. కాని మా ఆంగ్లేయులు అందరూ తెల్ల రంగులో ఉంటారు' అని వ్యంగ్యంగా అన్నాడు. దానికి గాంధీగారు 'అవును, మీరు చెప్పినది నిజమే, గాడిదలన్నీ ఒకే రంగులో ఉంటాయి. కాని గుఱ్ఱాలు మాత్రం వేరు వేరు రంగుల్లో ఉంటాయి' అని బదులిచ్చారు. ఆయన లండను వెళ్ళినపుడు విలేకరులు 'మీరు ఒకే వస్త్రం ధరిస్తారు ఎందుకు' అని ప్రశ్నించారు. దానికి ఆయన నవ్వి 'అది కూడా ధరించకపోతే బాగుండదని' బదులిచ్చారు. అది సమయస్ఫూర్తి.

2. ఒక ఆంగ్లేయుడు రవీంద్రనాథ్ ఠాగూర్‌తో 'మీరు శాకాహారం తింటూ, బలహీనంగా ఉంటారు. మేము మాంసాహారం తిని బలంగా ఉంటాము, మమ్ములను మీరు గెలవలేరు' అన్నాడు. దానికి ఠాగూర్ ఈ విధంగా సమాధానం చెప్పారు. 'ఏనుగు కూడా శాకాహారే. అంతేగాక దేహబలంకంటే మానసిక బలం గొప్పది. మేము దేహాన్ని దేవుని నిలయంగా భావిస్తాము. దేహాన్ని మృత శరీరాలను పడవేసే సిమిత్రీగా భావించము.

3. ఒకసారి విన్‌స్టన్ చర్చిల్, సర్వేపల్లి రాధాకృష్ణన్ కలిసి భోజనానికి ఉపక్రమించారు. చర్చిల్ స్పూన్, ఫోర్క్ ఉపయోగిస్తుంటే, రాధాకృష్ణన్ చేత్తో ఆహారం తింటున్నారు. అప్పుడు చర్చిల్ వ్యంగ్యంగా 'మేము ఆహారం తినే పద్ధతి మీరు పాటించే పద్ధతి కన్నా చాలా ఆరోగ్యకరమైనది' అన్నాడు. దానికి రాధాకృష్ణన్ 'నా చేతులు ఇదివరకు వేరే ఎవరూ ఉపయోగించలేదు' అని సమాధానం చెప్పారు.

కథ – ఒక రచయిత్రి, సభలో తాను రచించిన పుస్తకాలను ఉచితంగా అందరికీ పంచి, సభాధ్యక్షుడికి కూడా ఇచ్చింది. ఆయన ఇలా అన్నారు. 'అమ్మా మీరు చేస్తున్న పని మంచిదే, కాని ఉచితంగా ఇచ్చిన పుస్తకాలు ఎవరూ చదవరు' అన్నాడు. వెంటనే ఆమె 'అయితే ఇప్పుడు నేను మీకిచ్చిన పుస్తకానికి రూ॥ 200 ఇవ్వండి' అన్నది. అధ్యక్షుడు ఖంగు తిన్నాడు. 'నేనన్నది నాకే తిప్పి కొట్టిందే, ఆ అమ్మాయి అఖండురాలు' అని అనుకొని అంతలో తేరుకొని 'అమ్మా, నేనన్నది నీకు సరిగ్గా అర్థం కాలేదు, పుస్తకాలు ఉచితంగా కాక పుస్తకంతో పాటు దక్షిణ కూడా ఇస్తే జనం చదువుతారు అని నా అభిప్రాయం' అన్నాడు. సభ చప్పట్లతో మారు మోగింది. అది సమయస్ఫూర్తి అంటే.



నీతులు ఒకరికి చెప్పే ముందు తాను ఆచరించాలి

ఒక తండ్రి తమ పిల్లలకు 'మీరు ప్రతి రోజు అమ్మ నాన్నలకు నమస్కరించాలి' అని చెబితే ఆ పిల్లలు ఈ విధంగా సమాధానం చెప్పారు – 'నాన్న గారూ – మీరు తాతయ్యకు, నాయనమ్మకు నమస్కరించగా మేము ఎప్పుడూ చూడలేదు, మరి మాకెందుకు చెబుతున్నారు'. ఆ మాటలు విని, తండ్రి అవాక్కయినాడు. పిల్లలు మనం చెప్పిన దాని కన్నా మనం చేసినది చూసి ఎక్కువ నేర్చుకుంటారు. కనుక ఇంట్లో పెద్దలు, మంచి అలవాట్లు పాటిస్తే, పిల్లలు అవి నేర్చుకుంటారు.

సహనం – ముందుకు నడిపించే ఇంధనం

సహనం మనిషిని ముందుకు నడిపించే ఇంధనం. అసహనం అడ్డగించే అవరోధం. అలలు కాళ్ళ దగ్గరకు వచ్చాయి కదా అని, సముద్రాన్ని చులకనగా చూడటం ఎంత అవివేకమో, సహనం చూపిస్తున్నారు కదా అని ఉత్తములను చులకనగా చూడటము అంతే అవివేకం. సహనం, వినయ విధేయతలు సంస్కారానికి చిహ్నం. వినయం విధేయతను కలిగిస్తుంది. సహనం కోపాన్ని జయిస్తుంది. సహనం, వినయం అంత తేలికగా పట్టుబడవు. అవి పాటించిన వారి విలువ కొన్ని రెట్లు పెరుగుతుంది. ఎంతో సాధనతోనే అవి సాధ్యం.

ధర్మరాజు గొప్ప సహన మూర్తి. జూదం ఆడటం తప్పని తెలిసినా, దుర్యోధనుడు జూదానికి రమ్మని పిలిచినపుడు వెళ్ళకపోవటం సంస్కారం కాదని వెళ్ళి శకునితో ఆడి, ఓడాడు. అప్పుడు దుర్మార్గుడైన దుర్యోధనుడు, ద్రౌపతికి వస్త్రాపహరణ ప్రయత్నం జరిపించినపుడు, వీరులైన తమ్ములతో అది ఆపించే శక్తి ఉన్నా, ధర్మానికి కట్టుబడి ధర్మరాజు మిన్నకున్నాడు. అంతటి సహనం పాటించటం సామాన్యులకు సాధ్యం కాదు. ద్రౌపతి ప్రార్థనపై, శ్రీకృష్ణుడు వలువలిచ్చి ఆమె మానాన్ని కాపాడాడు.

యదార్థ గాథ – తాత్వికవేత్త సోక్రటీసు గొప్ప సహన మూర్తి, ఆయన భార్య గయ్యాళి. ఒకరోజు సోక్రటీసు, శిష్యులకు పాఠం చెబుతుంటే, లోపల భార్య తిట్ల దండకం అందుకున్నది. అది విన్నాకూడా, సోక్రటీసు మిన్నకున్నాడు. కొంతసేపటికి ఆమె కోపం పట్టలేక, బిందెడు నీళ్ళు తెచ్చి సోక్రటీసు నెత్తి మీద కుమ్మరించింది. అప్పుడు కూడా సోక్రటీసు నవ్వుతూ 'ఇందాకటినుంచీ ఉరుములు, మెరుపులు వస్తున్నాయి, వర్షం రాలేదేం అనుకున్నా, ఇప్పుడు వచ్చింది' అన్నాడు. సహనమూర్తులకు కోపం రాదు. అది వారి గొప్పతనం.

అరిషడ్వర్గాలైన కామం, క్రోధం, లోభం, మోహం, మదం, మాత్సర్యం – వీటిని జయించాలంటే శాంతి, సహనం, దయ, పరోపకారం, సేవ, సహకారం, సత్యం, అహింస, ప్రేమ, నీతి, నిజాయితీ మొ॥ సద్గుణములను అలవర్చుకొనవలెను. మంచి పుస్తక పఠనం, మంచి స్నేహితులను కలిగి ఉండటం – మంచి అలవాట్ల కిందికి వస్తాయి.

యదార్థ గాథ – 2. ప్రముఖ టెన్నిస్ ఆటగాడు ఆర్థర్ ఆషీకి హెచ్.ఐ.వి సోకినపుడు ఆయన అభిమాని 'మీరు పరమాత్మను నమ్ముతారు గదా, అయినను మీకు ఈ జబ్బు ఎందుకు ఇచ్చారు' అని అడగండి అన్నప్పుడు, ఆషీ 'నాకు మూడు సార్లు గ్రాండ్‌స్లామ్ బిరుదు వచ్చినప్పుడు నేను పరమాత్మను నాకే ఈ బిరుదు ఎందుకు ఇచ్చావని అడగలేదుగదా, మరి ఇప్పుడు ఎలా అడగను' అని సమాధానం చెప్పాడు.కనక కష్టమైనా, సుఖమైనా పరమాత్మ ప్రసాదంగా భావించాలి.

పట్టిన పట్టు విడువరాదు

కార్యం సాధించ దలుచుకున్నపుడు దారిలో ఎన్నో అడ్డంకులు వస్తాయి. వాటితో నిరాశ చెందక, ప్రయత్నాన్ని చివరివరకూ కొనసాగిస్తే విజయం లభించగలదు. ముందుగానే భయపడి పనులు ప్రారంభించని వాడు అధముడు. పనులు ప్రారంభించి అడ్డంకులు వస్తే ఆపేసేవాడు మధ్యముడు. ప్రారంభించిన పనికి, అడ్డంకులు వచ్చినా వాటిని అధిగమించి పని పూర్తి చేసేవాడు ఉత్తముడు.

పురాణ గాథ – భగీరథుని వృత్తాంతం – సగరుడు యజ్ఞం జరిపి విడిచిన అశ్వాన్ని, ఇంద్రుడు అపహరించి నాగలోకంలో తపస్సు చేసుకుంటున్న కపిలమహర్షి ఆశ్రమంలో కట్టేశాడు. సగరుని పుత్రులు 60 వేలమంది అశ్వాన్ని అన్ని చోట్ల వెతికి, పాతాళలోకంలో కపిల మహర్షి ఆశ్రమంలో అశ్వాన్ని అన్ని చోట్ల వెతికి, పాతాళలోకంలో కపిల మహర్షి ఆశ్రమంలో అశ్వాన్ని గాంచి, ఆయనను దూషించగా, ఆయన కళ్ళు తెరచినపుడు, ఆయన కోపానికి 60 వేలమంది దహించబడ్డారు. తదుపరి మూడోతరం వాడయిన భగీరథుడు తన పూర్వీకులకు సద్గతిని కలిగించుటకై, తీవ్రమైన తపస్సు చేసి గంగాదేవిని ప్రత్యక్షం చేసుకుంటాడు. కాని గంగ, తన ధాటిని భూమి తట్టుకోలేదని, శివుడిని ప్రసన్నం చేసుకోమంటుంది. భగీరథుడు శివుని గురించి తపస్సుచేసి ఆయనను ప్రసన్నం చేసుకుంటాడు. విష్ణుపదియైన గంగ ప్రచండవేగంతో దిగివచ్చి, శివుని జటాజూటంలో చిక్కుకొనగా, భగీరథుని ప్రార్థన మేరకు శివుడు కొద్ది కొద్దిగా విడిచిపెట్టాడు. అదియే నదీ ప్రవాహమై, భగీరథుని వెంట పరుగులెత్తుతూ, భాగీరథి అయింది. భూమిపై జహ్నుడు అను ముని ఆశ్రమమును గంగ కొట్టివేయగా ఆ ముని గంగను తన నోట బంధించెను. అప్పుడు భగీరథుడు ఆ మునిని ప్రార్థించగా, ఆయన ప్రసన్నుడయి, తన చెవిద్వారా గంగను వదిలెను. అందుకే గంగకు 'జాహ్నవి' అని పేరు వచ్చినది. అప్పుడు గంగ, సగరపుత్రుల భస్మరాసులపై ప్రవహించి వారిని పునీతులను చేసెను.

అందుకే ఇప్పటికీ గట్టి పట్టుదలతో ఎన్ని అడ్డంకులు వచ్చినా, వాటిని అధిగమించి, మొదలుపెట్టిన పనిని పూర్తిచేయటాన్ని భగీరథ ప్రయత్నం అంటారు.

– వ్యాకరణం వేణుధర శాస్త్రి

అనేక మంది యువకులపై దొంగ కేసులు

వాస్తవాలు వేరు. చర్చలలో పాల్గొనాలా, వద్దా అనే అంశంపై నిర్ణయం గైకొనేందుకు ఒక రాత్రి మేమంతా (కార్యవర్గ సభ్యులు–ప్రత్యేక ఆహ్వానితులు) ఉస్మాన్‌గంజ్‌లో యం. మానిక్‌రావు (తాండూరు) మిద్దెపై సమావేశం జరిపాం. ఆహ్వానాలను అంగీకరించాలని సంతపురి రఘువీర రావు ప్రభృతులు సూచించగా ఈ రచయితతో సహా అధిక సంఖ్యాకులు ముఖ్యంగా సీనియర్ కాంగ్రెస్ నాయకులు వాటిని తిరస్కరించాలని పట్టుపట్టారు. ఆ రాత్రి రెండు మూడు పర్యాయాలు యస్. వెంకట్రామా రెడ్డి టెలిఫోన్‌లో డా॥ చెన్నారెడ్డితో మాట్లాడారు. ఉద్యమంలో భాగస్వామి అవగలనని ఆయనతో మాట తీసుకున్నారు. అందువలన డా॥ చెన్నారెడ్డి మరికొందరు, కొండా వెంకటరంగారెడ్డి ఆశీర్వచనంతో ఉద్యమంలో పాల్గొంటే దాని 'బేస్' విస్తరించి రూపురేఖలు మారి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా అవతరించగలదని భ్రమపడడం జరిగింది. ఆ మర్నాడే రాష్ట్రపతి డాక్టర్ జాకీర్ హుస్సేన్ మరణించడంతో సంతాప సమయం పూర్తి అయ్యేవరకు తమ ఉద్యమాన్ని తాత్కాలికంగా నిలుపుదల చేయాలని ప్రజాసమితి నిర్ణయించినది. ఈ నిర్ణయాన్ని 'సద్వినియోగం' చేసుకొనవలెనని పాలకులు భావించారు. యావత్తు భారత జాతి సంతాపంలో ఉన్న సంగతి కూడా విస్మరించి, ఉద్యమ కర్తలను నామరూపాలు లేకుండా చేయటానికి అదే అనువైన తరుణమని పాలకులు విశ్వసించారు. రోజు రోజుకు ప్రభుత్వం చెబుతున్న కల్లబొల్లి కబుర్లు, గైకొంటున్న అవాస్తవిక చర్యలు, ముఖ్యమంత్రి చేస్తున్న బాధ్యతారహితమైన ప్రకటనలు, ఉద్యమంలో భాగస్వాములు కావడానికి పలువురిని రెచ్చగొట్టాయి. ఈ రచయితకు వెంకటరామారెడ్డి సన్నిహితులు కొందరికే ఈ విషయం తెలుసుకనుక అది రహస్యంగానే ఉండిపోయింది. తరువాత వారం రోజులలో డా॥ చెన్నారెడ్డి ఉద్యమానికి సమర్థన తెలిపారు. అయితే, శ్రీమతి గాంధీ ఆనాటి పరిస్థితులలో తన బలం ఏమిటో భవిష్యత్తు ఏమిటో తెలియని స్థితిలో ఉండి తెలంగాణ ప్రజలకు ఆంధ్రప్రదేశ్‌లో స్వయంప్రతిపత్తికల ప్రాంతమైనా ఇవ్వడం ద్వారా న్యాయం చేయాలని అనుకుని ఉంటారు.

ఆ నేపథ్యంలోనే సుహృద్భావ వాతావరణం నెలకొనడానికిగాను మే మొదటి తేదీన ప్రజాసమితి నిర్వహింప తలపెట్టిన ఊరేగింపునకు అనుమతి ఇవ్వాలని శ్రీ వెంకటేశ్వర రావు ప్రోద్బలంతో, శ్రీ వి.బి.రాజు పట్టుపట్టగా ముఖ్యమంత్రి ఆ ఆలోచనను త్రోసిపుచ్చారు. ప్రశాంతంగా పూర్తి అయ్యే కార్యక్రమాలకు అవరోధాలు అడ్డంకులు కల్పించి, బలప్రయోగంతో హింసను ప్రోత్సహించి తమ ఆధిక్యతను సంతోషించడం ఈ ఉద్యమంలో ప్రభుత్వ విధానం కనుక దానికి అనుగుణంగా, మే మొదటి తేదీన గవర్నర్ వద్దకు ప్రజలు ఊరేగింపుగా వెళ్ళడానికి చివరి క్షణాలలో పోలీసులు అనుమతి నిరాకరించారు. అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకున్నందున, నిషేధపు ఉత్తర్వులు ధిక్కరించి అయినా సరే గవర్నర్ వద్దకు ప్రజలు ఊరేగింపుగా వెళ్ళడానికి సంకల్పించగా, చివరి క్షణాలలో పోలీసులు అనుమతి నిరాకరించారు. అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకున్నందున, నిషేధపు ఉత్తర్వులు ధిక్కరించి అయినా సరే గవర్నర్‌ను సందర్శించి, తమ విజ్ఞాపన పత్రాన్ని సమర్పించాలని సమితి ఆ మధ్యాహ్నం అత్యవసర సమావేశంలో నిర్ణయించడంతో, చార్మినార్‌కు బదులు పబ్లిక్ గార్డెన్స్ నుండి ఊరేగింపు బయల్దేరటానికి పోలీసులు హడావిడిగా అనుమతి ఇచ్చారు.

తెలంగాణా పితామహులు శ్రీ కొండా వెంకట రంగారెడ్డి చార్మినార్ వద్ద జరుపుతున్న సభలో ప్రసంగించవలసియున్నందున ప్రజాసమితి విద్యార్థి కార్యచరణ సంఘం తుది క్షణాలలో తన కార్యక్రమంలో మార్పు చేయజాలక పోయాయి. ఈ విషయం పోలీసులకు తెలుసు. సాయంత్రం మూడు గంటలకల్లా లక్షలాది ప్రజలు చార్మినార్ వద్ద గుమికూడారు. చుట్టూ మైలుదూరం నుండి అన్ని మార్గాలకు అడ్డు నిల్చున్న పోలీసుల తుపాకి గుండ్లుకానీ, లాఠీలు కానీ చార్మినార్‌కు చేరకుండా ప్రజలను నిరోధించజాలకపోయాయి. కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమైంది. రెచ్చగొట్టి చెదరకొట్టాలని చూచిన పోలీసులకు అవకాశం దొరకలేదు. దారి పొడవునా ఎన్నిసార్లు లాఠీ చార్జి జరిపినా ప్రజలు మొక్కవోని పట్టుదలతో లక్షల సంఖ్యలో రాజభవన్ చేరుకున్నారు. మతి భ్రమించిన పోలీసులు రాజభవన్ ఎదుట త్రొక్కిసలాడుతున్న ప్రజా సమూహంపైన, గవర్నర్‌ను సందర్శించేందుకు భవనం లోపల నిరీక్షిస్తున్న నాయకులపైనా అకారణంగా లాఠీ ప్రయోగం జరుపడంతో రాజభవన్‌కు ఎదురుగా ఉన్న రైలుకట్ట ఆవలికి పరుగెత్తి అక్కడి నుండి ఆగ్రహావేశపరులైన కొందరు వ్యక్తులు రాళ్ళు రువ్వడం ప్రారంభించారు.

వారికి నచ్చజెప్పి వెళ్ళగొట్టేందుకు, రాళ్ళ దెబ్బలను సైతం లెక్కచేయక, ప్రజాసమితి, విద్యార్థి సంఘం నాయకులు ఒకవైపు ప్రమస్తుండగానే మరొకవైపు నుండి పోలీసుల తుపాకులు ప్రేలాయి. సికింద్రాబాద్ కళాశాల విద్యార్థి సంఘం అధ్యక్షుడు శ్రీ ఉపేందర్‌రావుతో సహా ముగ్గురు వ్యక్తులు నేలకొరిగి చివరిశ్వాస పీల్చారు. ఈ సంఘటనపై న్యాయ విచారణ జరిపించాలని పదహారు మంది శాసనసభ్యులు చేసిన విజ్ఞప్తిని ప్రభుత్వం త్రోసిపుచ్చింది. తెలంగాణ ఉద్యమంలో పోలీసు కాల్పులకు సంబంధించిన ఏ సంఘటనపైన కూడ న్యాయ విచారణకు ప్రభుత్వం అంగీకరించలేదు.

ప్రభుత్వ అనుభవమే దానికి కారణం. జనవరి మాసంలో శంషాబాద్‌లో కాల్పులు జరపడం అనవసరమనీ అది పోలీసుల పొరపాటని తన నివేదికలో పేర్కొన్నందుకు, ఆ సంఘటనపై విచారణ జరిపిన నాటి హైదరాబాద్ సబ్ డివిజన్‌లో మెజిస్ట్రేట్ శ్రీ రంగారెడ్డిని ప్రభుత్వం బదిలీచేసింది. అలాగే సికింద్రాబాద్ బూరుగు మహదేవ్‌హాల్‌లో ఫిబ్రవరి మాసంలో కమ్యూనిస్టుల సభ సందర్భంలో నిరసన తెలిపిన వారిపై పోలీసులు కాల్పులు జరపడం అమానుషమనే అభిప్రాయం వెలిబుచ్చినందుకు నాటి హైదరాబాదు కలెక్టర్ శ్రీ శ్రవణకుమార్‌ను కూడా ప్రభుత్వం బదిలీ చేసింది.

– ఆదిరాజు వెంకటేశ్వర రావు

దిగజారిన మానవత్వం....

మానవత్వం ఎంతవరకు దిగజారుతుందో, ఇంకా ఎలాంటి విషయాలు వినవలసివస్తుందో భయపడవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. ఆ ప్రభావాలు అభమూ, శుభమూ తెలియని పసిపిల్లలపై పడి వారి జీవితాలనే అంతం చేసే పరిస్థితి ఏర్పడుతుంది. ఎంతో టెక్నాలజీ అభివృద్ధి చెందుతున్న కాలంలో కూడా బ్రాడ్ మైండ్ లేకుండా ఉండి, ఇలాంటి ఆలోచనలు ఎందుకు కలుగుతున్నాయో అర్థం కావటం లేదు. ఈ మధ్య జరిగిన సంఘటనలలో క్రింద జరిగినది ఒక బాధాకరమైన విషయం.

మీకు తెలుసా

జనవరి 1న శబరిమల అయ్యప్పను దర్శించుకుని వచ్చిన ఇద్దరు మహిళలు బిందు, కనకదుర్గ. బిందు దళిత్ యాక్టివిస్ట్. నిజానికి ఆమె అక్టోబర్ నెలలోనే శబరిమల వెళ్లేందుకు ప్రయత్నించారు. కాని నిరసనకారులు అడ్డుకోవడంతో వెనక్కి తిరిగారు. ఆ నిరసన ఆమెకు దైవర్శనం కానివ్వకుండా అడ్డుకోవడం వరకే ఆగలేదు. బిందు ఇంటిదాకా, ఇంకా చెప్పాలంటే కుటుంబ సభ్యులను ఇబ్బంది పెట్టేవరకూ వెంటాడింది. తొలిసారి దర్శనానికి వెళ్లి విఫలమై వచ్చినప్పటి నుంచే బిందు సంప్రదాయవాదుల వేధింపులను ఎదుర్కొంటూ ఉన్నారు. బిందు కుటుంబం కోళికోడ్‌లో ఓ అద్దె ఇంట్లో నివాసముంటోంది. ఆ ఇంటి యజమాని ముందస్తు సమాచారం, తగిన సమయం ఇవ్వకుండా అప్పటికప్పుడు ఇల్లు ఖాళీ చేయించారు. చేసేదిలేక ఫ్రెండ్ ఇంట్లో తలదాచుకుంటుంటే అక్కడా వేధింపులు తప్పలేదు. అక్కడినుంచీ ఆమె వెళ్లిపోయేలా చేశారు. బిందుకు పదకొండేళ్ల కూతురు ఉంది. ఆ అమ్మాయి ప్రస్తుతం అగాలీ ఒకేషనల్ హయ్యర్ సెకండరీ స్కూల్లో చదువుతోంది. వచ్చే యేడాది కోసం కూతురిని విద్యావనమ్ హయ్యర్ సెకండరీ స్కూల్లో చేర్పించాలనుకున్నారు బిందు. దాని తాలూకు ఇంటర్వ్యూ, పేరెంట్స్ మీటింగ్‌ను పూర్తి చేశారు. అమ్మాయికి అడ్మిషన్ ఇస్తున్నాం అని కూడా స్కూల్ యాజమాన్యం కూడా చెప్పింది. మొన్న సోమవారం.. అంటే జనవరి ఎనిమిదో తారీఖున అడ్మిషన్‌కు సంబంధించిన ఫార్మాలిటీస్ పూర్తి చేసుకోవాల్సి ఉంది. బిందు కూతురితో స్కూల్లోకి అడుగుపెట్టింది.

ప్రిన్సిపల్ వింతగా ప్రవర్తించారు. "నేను మీలాగా యాక్టివిస్ట్‌ని కాను. కాని ఎడ్యుకేషనల్ యాక్టివిస్ట్‌ని" అంటూ సందర్భంలేకుండా మాట్లాడారు. నేను వెళ్లింది మా అమ్మాయి అడ్మిషన్ ఫార్మాలిటీస్ కంప్లీట్ చేయడం కోసం. ఆ ఊసెత్తకుండా ప్రిన్సిపల్ ఏవేవో మాట్లాడుతుంటే ఆశ్చర్యం వేసింది. చివరకు "మీ అమ్మాయికి అడ్మిషన్ ఇచ్చి ఈ స్కూల్ వాతావరణాన్ని పాడు చేయదలచుకోలేదు మేము" అంటూ అసలు సంగతి చెప్పారు. మా అమ్మాయి క్లాస్‌లోని కొంతమంది పిల్లల తల్లిదండ్రులు మా అమ్మాయితో మాట్లాడొద్దని, డిస్టెన్స్ మెయింటైన్ చేయమని వాళ్ల పిల్లలకు చెప్తున్నారట. ఈ అవమానంతో మా అమ్మాయి ఇప్పుడా స్కూల్‌కు వెళ్లడానికే ఇష్టపడట్లేదు" అని చెప్పారు బిందు. సభ్య సమాజం తలదించుకొనే పరిస్థితి ఇది.

జి. హరీశ్, దిల్‌సుఖ్‌నగర్

అడవుల వినాశనం.. మానవాళికి అపార నష్టం

అడవుల ధ్వంసం,సామాజిక వనాల పెంపకంలో అశ్రద్ధ ఫలితంగా అపారమైన నష్టాలను చవిచూడాల్సి వస్తోంది. అడవుల వినాశనం మూలంగా పర్యావరణం దెబ్బతిని అకాల వర్షాలు,వరదలు,విపత్తులు సంభవిస్తున్నాయి. అడవుల విస్తీర్ణం పెంపు లక్ష్యంగా 1950 నుంచి వనమహోత్సవ కార్యక్రమం జరుగుతోంది. అప్పటి కేంద్ర వ్యవసాయ,ఆహార శాఖామంత్రి డాక్టర్ కె.ఎన్ మున్షీ ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ కార్యక్రమాన్ని ఏటా అటవీ యంత్రాంగం నిర్వహిస్తోంది. ప్రభుత్వాలు మొక్కలు నాటడంపై చూపుతున్న

ఆసక్తి వాటిని పెంచడంలో, పరిరక్షించడంలో కనబరచడం లేదు. ప్రభుత్వాల లోపాలు, వ్యవస్థీకృత వైఫల్యాల మూలంగా పచ్చని అడవులకు కడుపుకోత తప్పడం లేదు. పర్యావరణ మంత్రిశాఖ పరిధిలోని జాతీయ అటవీ సర్వే సంస్థ 1987 నుంచి రెండేళ్ళకొకసారి ఉపగ్రహ ఛాయాచిత్రాల ద్వారా పరిస్థితిని ప్రజల ముందు ఉంచుతోంది. ఇటీవల విడుదల చేసిన అటవీ నివేదిక2017 ప్రకారం దేశవ్యాప్తంగా 21శాతం భూభాగంలో 7 లక్షలకు పైగా చదరపు కి.మీ. విస్తీర్ణంలో అడవులు ఉన్నాయి. ఈ సంస్థ లెక్కలపైన పర్యావరణ హితుల్లో సందేహాలున్నాయి. భూమిపైన పచ్చగా కనిపించేదంతా ఉపగ్రహ ఛాయాచిత్రాలు అడవిగా పరిగణించడం వల్ల వాస్తవ పరిస్థితి అర్థం కావడం లేదన్న అభిప్రాయం ఉంది. భూ వినియోగం,యాజమాన్య హక్కుభూమి ఎవరికి చెందినది అనే



విషయాలేమీ పట్టించుకోకుండా హెక్టారు భూమిలో పదిశాతం మించి పచ్చదనం,దట్టత ఉన్నట్టయితే దానిని అడవిగా జాతీయ అటవీ సర్వే సంస్థ పరిగణిస్తోంది. అటవీ చట్టం ప్రకారం అటవీ శాఖ ప్రకటించిన రిజర్వు, రక్షిత అడవులను మాత్రమే అడవులుగా పరిగణిస్తున్నారు. ఈ లెక్కన సర్వే సంస్థ చూపించే 21శాతం ప్రాంతాన్ని పూర్తిగా అడవిగా పరిగణించలేం. వాన నీటిని ఒడిసి పట్టడానికి ప్రకృతి ప్రసాదించిన గొప్ప సాధనాలు అడవులు. వీటి ప్రభావం భూమి పైభాగం కంటే వృక్షాలు,వేళ్ళు,ఒండ్రు మట్టితో కలగలిసిన అంతర్భాగంలోనే అధికంగా ఉంటుంది. అలాంటి అడవులు మాత్రమే వర్షపు నీటిని నేలపై మట్టిపొరల ద్వారా సంగ్రహించి భూగర్భ జలాల అభివృద్ధికి దోహదపడతాయి. ఏళ్ళ తరబడి కొనసాగిన నిర్లక్ష్యం మూలంగా దేశంలోని అటవీ రక్షణ వ్యవస్థలు బండబారిపోయాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం కొరవడటం మరో ప్రధాన లోపం. వనాల పెంపకానికి కేంద్రం సహా పలు రాష్ట్రాలు ప్రత్యేక కార్యచరణ అమలు చేస్తున్నాయి. హరిత హారం పేరుతో తెలంగాణ ప్రభుత్వం హరిత సైన్యం ఏర్పాటు చేసింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వనం–మనం కార్యక్రమం పేరుతో మొక్కల పెంపకం, సంరక్షణ కార్యక్రమాలను అమలు చేస్తోంది. అయితే ప్రస్తుతం ఉన్న అడవులను పరిరక్షించుకోవడంలో పెద్దగా శ్రద్ధ చూపడం లేదన్న మాట వాస్తవం. ఆంధ్రాలో తీరం వెంబడి ఉన్న అటవీ నేలల్లో వనాలు కనుమరుగైపోయాయి. అటవీ శాఖలో ఏళ్ళ తరబడి ఉద్యోగాలను భర్తీ చేయడం లేదు. కోట్లాది రూపాయలను ఖర్చు పెట్టి అట్టహాసంగా చేపట్టే మొక్కల పెంపకం మొక్కుబడి తంతుగా మిగిలిపోతోంది. ప్రతి మొక్కకి జియో ట్యాగింగ్ చేస్తామన్న పాలకుల హామీలు కార్యరూపం దాల్చాల్సి ఉంది. సమగ్రమైన అటవీ విధానంతో పాటు దాన్ని అమలు చేసేందుకు చిత్తశుద్ధి, తగిన మేరకు నిధుల కేటాయింపు అవసరం. అటవీ చట్టాలను పకడ్బందీగా అమలు చేయడంతో పాటు అడవుల పెంపకంలో అనాదిగా కీలకపాత్ర పోషిస్తున్న స్థానిక ప్రజల భాగస్వామ్యం పెంచితే సత్ఫలితాలు సమకూరుతాయి. ఆ దిశగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు కదలాల్సిన సమయం ఆసన్నమైంది.

–శ్రీనివాస్ చిరిపోతుల
96034 71199

పారామెడికల్, నర్సింగ్ పోస్టుల భర్తీకి ఈఎస్ఐసీ నోటిఫికేషన్ విడుదల

పారామెడికల్, నర్సింగ్ పోస్టుల కోసం ఈఎస్ఐసీ నోటిఫికేషన్ విడుదల చేసింది. 137 స్టాఫ్ నర్సులు, 25 ఫార్మాసిస్టులు, 7 ఈజీజీ టెక్నీషియన్, 4 బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్, 3 జూనియర్ మెడికల్ రికార్డ్, 2 ఫిజియోథెరపిస్ట్, 2 ఆప్టొమెట్రిస్ట్, 2 మెడికల్ సోషల్ వర్కర్ పోస్టులతో పాటు ఆక్యుపేషనల్ థెరపిస్ట్ ఒకటి, డెంటల్ హైజెనిస్ట్ పోస్టులు ఇందులో ఉన్నాయి. స్టాఫ్ నర్స్ పోస్టుల్లో 72 అన్‌రిజర్వ్‌డ్ కాగా, ఎస్సీలకు 21, ఎస్టీలకు 11, ఓబీసీలకు 33 పోస్టులున్నాయి. ఆసక్తి కలిగిన అభ్యర్థులు www.esic.nic.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకునేందుకు తుది గడువు జనవరి 21. ఈఎస్ఐసీ పరిధిలోని ఇన్‌స్టిట్యూషన్స్, హాస్పిటల్స్‌లో ఖాళీలను భర్తీ చేసేందుకు ఈ నోటిఫికేషన్‌ను విడుదల చేశారు.

వైవిధ్యమే సివిల్స్ ప్రత్యేకత



సివిల్ సర్వీసులో చేరడమే లక్ష్యంగా శిక్షణా సంస్థల్లో చేరిన వారితో పాటు సొంతంగా సిద్ధపడుతున్న వారు సైతం ఈ పరీక్ష నిర్దిష్ట లక్షణాలూ, ప్రత్యేకతలపై అవగాహన పెంచుకోవటం ఎంతైనా అవసరం. ఇది మిగతా పరీక్షల కంటే ఎందుకు భిన్నమైనదో గ్రహిస్తే తప్ప దానిపై పట్టు సాధించటం సాధ్యపడదు. దానికి తగిన ప్రణాళికను రూపొందించుకోవాలి. సివిల్స్ పరీక్షలు ప్రిలిమినరీ, ఫైనల్‌తో పాటు ఇంటర్వ్యూతో కలిపి మూడు దశల్లో వడపోత జరుగుతుంది. ఈ పరీక్ష రాసి ఒకటి రెండు సార్లు నెగ్గలేని వారిలో తమ ప్రతిభా సామర్థ్యాల గురించి అనుమానాలు మొదలవుతాయి. ఎందుకిలా వైఫల్యం ఎదురైందనే ప్రశ్నకు జవాబు ఈ పరీక్ష స్వభావంలోనే ఉంది. దాన్ని ఆకళింపు చేసుకోవటం చాలా ముఖ్యమైన అంశం.

ఎప్పటికప్పుడు కొత్త సంస్కరణలు

రాజకీయ విధాన నిర్ణయాలను సక్రమంగా అమలుచేస్తూ దేశ భవితవ్యాన్ని నిర్దేశించగలిగే హోదాల్లో 30 లేదా 35 సంవత్సరాలపాటు సేవలు అందించేవారు సివిల్ సర్వెంట్లు. వీరు రాజకీయ నాయకుల్లా ప్రతి ఎన్నికకూ మారిపోవటం కాకుండా ఉద్యోగ విరమణ వరకూ విధుల్లో కొనసాగుతారు. అంత సుదీర్ఘకాలం వారి విధుల ప్రభావం అసంఖ్యాక ప్రజలపై ఉంటుంది. అందుకే తగిన వ్యక్తులను లోపరహితంగా ఎంపిక చేయడానికి సివిల్ సర్వీసెస్ పరీక్ష రూపొందించబడింది. దీన్ని ఎప్పటికప్పుడు మెరుగుపరచటానికి పలు కమిటీలను నియమించారు. వాటి సిఫార్సులకు అనుగుణంగా సంస్కరణలు అమలవుతూ ఈ పరీక్ష ఎప్పటికప్పుడు ఉత్తమంగా రూపుదిద్దుకుంటోంది.

అదనపు నైపుణ్యాలు అవసరం

సాధారణంగా ఏ ఉద్యోగానికైనా బలమైన వ్యక్తిత్వం, నిజాయితీ, అంకితభావం, కష్టపడి పనిచేయటం తప్పనిసరిగా అవసరమవుతాయి. వీటితోపాటు సివిల్ సర్వెంట్లకు నిర్దిష్టంగా కొన్ని లక్షణాలూ, నైపుణ్యాలూ అదనంగా ఉండాలి. భవిష్యత్తు గురించి ఆలోచించే దార్శనికత, ఆధునిక సాంకేతికతపై పట్టు ఉండాలి. సహజ న్యాయం, మానవ హక్కులను విశ్వసించటంతో పాటు పేదలపై, బడుగుల సమస్యలపై సానుభూతి ఉండాలి. సమస్యల పరిష్కార నైపుణ్యం, తార్కికంగా పరిస్థితిని విశ్లేషించగలిగే నేర్పు, బృందాన్ని నడిపించగలిగే సామర్థ్యం, భిన్న వర్గాలతో భావప్రసారం చేయగలిగే చొరవ ఉండాలి.

సివిల్స్ స్వరూపం

పై అవసరాలను దృష్టిలో పెట్టుకొని రూపకల్పన చేసిందే సివిల్ సర్వీసెస్ పరీక్ష. ఇది మూడంచెల్లో ప్రిలిమినరీ, మెయిన్, మౌఖిక పరీక్షలతో ఉంటుంది. మొదటిది ఆబ్జెక్టివ్ పద్ధతిలో, రెండోది వ్యాసరూప పద్ధతిలో ఉంటాయి. మౌఖిక పరీక్షలో అభ్యర్థి వ్యక్తిత్వాన్ని భిన్నకోణాల్లో పరిశీలించటం జరుగుతుంది. మొదటి మెట్టుగా చెప్పుకునే ప్రిలిమినరీని ఆబ్జెక్టివ్ పరీక్షే కదా అని తక్కువ అంచనా వేశారా అంతే సంగతి. ఎందుకంటే మూడంచెల్లో క్లిష్టమైన పరీక్ష ఇదే అనేది నిపుణుల భావన. దాదాపు 4.5



లక్షల మంది అభ్యర్థుల్లో నుంచి 12వేల మందిని ఎంపిక చేయడం కోసం పరీక్షను ఎప్పటికప్పుడు క్లిష్టతరంగా రూపకల్పన చేస్తున్నారు. 2015 నుంచీ రెండో పేపర్‌ను అర్హత పరీక్షగా మార్చారు. దీంతో దాదాపు 90 శాతం మంది అర్హత పొందుతున్నారు. ఫలితంగా మొదటి పేపర్ కీలకంగా మారింది. దీనిలో దాదాపు ఒకేరకంగా ఉండే జవాబులు, కాంబినేషన్ జవాబులు (1, 2; 1, 2, 3; 1, 2, 3, 4) ఇస్తూ ఎలిమినేషన్ పద్ధతిలో జవాబులు గుర్తించటానికి వీల్లేకుండా చేస్తున్నారు. ఏమరుపాటున ఉంటే అభ్యర్థులు పొరపాట్లు చేయటానికి ఎక్కువ అవకాశముండేలా ప్రశ్నలలు రూపొందిస్తున్నారు.

మిగతా పోటీ పరీక్షలకు భిన్నం

ఇతర పోటీ పరీక్షలకూ, సివిల్స్‌కు తేడాను అభ్యర్థులు గమనించటం ముఖ్యం. విస్తృతమైన అంశాలను సివిల్స్‌లో చదవాల్సి ఉండగా , మిగతా పోటీ పరీక్షల్లో అంశాలను అంతగా విస్తృతంగా చదివే అవసరం ఉండదు. సివిల్స్‌లో ఒక అంశాన్ని సంపూర్ణంగా అధ్యయనం చేయాల్సి వుంటుంది. దానిపై స్పష్టత తెచ్చుకోవాలి. విశ్లేషించగలగే స్థితిలో ఉండాలి. కానీ మిగతా పరీక్షలకు క్లుప్తంగా చదివి, వాస్తవికాంశాలూ, గణాంకాలూ గుర్తుపెట్టుకుంటే సరిపోతుంది. ఇతర పరీక్షలకు జనరల్ నాలెడ్జ్ తరహాలో చదివితే సరిపోతుంది. కానీ సివిల్స్‌కు అది సరిపోదు. దేశ ప్రజలపై ప్రభావం చూపే వివిధ అంశాలను వివరంగా చదవాలి. ప్రభుత్వ పథకాలూ, అంతర్జాతీయ అంశాలపై అవగాహన పెంచుకోవాలి.

రెండోసారి శిక్షణ ఫలితం

సివిల్స్ పరీక్షలో ప్రతిభ చూపించాలంటే దీర్ఘకాలికమైన కృషి అవసరమని తెలిసిందే. కానీ ఏ తీరులో ఆ తయారీ ఉండాలనే దానిపై విద్యార్థుల్లో చాలా సందేహాలు వ్యక్తమవుతుంటాయి. ముఖ్యమైన కొన్ని విషయాలు:

నాలుగేళ్లుగా సివిల్స్‌లో మార్పులు: గత నాలుగేళ్ళుగా సివిల్స్ పరీక్షా విధానం మారుతూ వస్తోంది. అంతే కాదు, ఏటా ఏదో ఒక మార్పు జరుగుతూనే వుంది. ఏ ఆధారంతో దీర్ఘకాలం సిద్ధమవ్వాలనేది ఓ సందేహం. కాగా 2011 సంవత్సరం నుంచి చాలా మార్పులు జరిగాయి. అయితే అలాంటి నిరంతర మార్పులే మళ్ళీ జరిగే అవకాశం లేదు. పరీక్ష మౌలిక స్వరూపం (హిస్టరీ, పాలిటీ, జాగ్రఫీ వంటి విషయాలు) మాత్రం మారదు. అవి అవసరాలకు తగ్గట్టుగా మారుతాయంతే. అందుకని ఈ సబ్జెక్టులతో తయారీని నిరభ్యంతరంగా మొదలుపెట్టవచ్చు.

ఇంజనీరింగ్ విద్యార్థులు: కళాశాలలో ఇంజినీరింగ్ చదువుతున్నవారు సివిల్స్‌కు ఎలా తయారు కావాలంటే... హ్యూమానిటీస్ (హిస్టరీ, జాగ్రఫీ లాంటివి) సబ్జెక్టుల అధ్యయనం ప్రారంభించటంతో పాటు ఫైనలియర్లో మరింత శ్రద్ధ చూపించాలి.

రెండోసారి కోచింగ్ అవసరం: సివిల్స్‌కు శిక్షణ తీసుకున్నా పరీక్షలో నెగ్గనివారు రెండోసారి కోచింగ్ తీసుకోవాలా వద్దా అనే సందేహంలో ఉంటారు. శిక్షణ (కోచింగ్) పాత్ర పరిమితంగానే ఉంటుంది. ఇంజినీరింగ్, కామర్స్ విద్యార్థులు పదో తరగతిలో తాము వదిలేసిన సబ్జెక్టులను పరిచయం చేసే పనీ, వారి నైపుణ్యాలను సానపెట్టే పనీ కోచింగ్ చేస్తుంది. ఇక హ్యూమానిటీస్ విద్యార్థులు తమ సబ్జెక్టులపై మరింత శ్రద్ధ పెట్టేలా సహకరిస్తుంది. ఇంతకుమించి కోచింగ్ నుంచి మరింకేమీ ఆశించకూడదు. కోచింగ్‌ను రెండోసారి తీసుకోవటం వల్ల సమయంతోపాటు డబ్బు కూడా వృథా అవుతుందని నిపుణుల అభిప్రాయం.

నిర్థిష్ట వ్యవధి: ఈ పరీక్షకు ఎక్కువ సమయం వెచ్చించాలని తెలిసిందే. కానీ నిర్దిష్టంగా ఇంత సమయం అవసరమని నిర్దేశించుకోవచ్చా అనేది మరో సందేహం. కనీసం రెండు ప్రయత్నాలకు తగ్గట్టుగా పూర్తి సమయం కేటాయించుకోవాలి. ఆ తర్వాత మరో ప్రత్యామ్నాయం (ఉద్యోగం, ఉన్నతవిద్య మొదలైనవి) చూసుకుని, పరీక్షకు సిద్ధమవుతూవుండాలి.

సివిల్స్‌లో రానున్న మార్పులు: రానున్న రోజుల్లో ప్రిలిమినరీని ఆన్‌లైన్ నైన్ విధానంలో నిర్వహించే అవకాశం ఉంది. దానివల్ల ప్రిలిమ్స్, మెయిన్ల మధ్య ఉండే కాలవ్యవధిని తగ్గించవచ్చు. ఈ రకంగా మొత్తం పరీక్ష నిర్వహణలో ఉండే దీర్ఘ విరామం గణనీయంగా తగ్గుతుంది. ఎస్సే పేపర్లో రెండు విభాగాలు పెట్టి ఒక దానిలో చర్చనీయాంశాలు, రెండోదానిలో కేస్ స్టడీ ఆధారిత ప్రశ్నలు అడగవచ్చు. మెయిన్ పరీక్షలో ఐఏఎస్‌కు, ఐపీఎస్ కు నిర్దిష్ట ప్రశ్నపత్రాలు అంటే ఐఏఎస్ కోసం గవర్నెన్స్, పబ్లిక్ పాలసీ; ఐపీఎస్ కు జనరల్ ప్రిన్సిపుల్స్ ఆఫ్ లా ఇవ్వవచ్చు.

అభద్రతకు పరిష్కారం: సివిల్స్ లో అనుకూల ఫలితం వస్తుందని నిశ్చయంగా చెప్పలేం కదా? మరి ఆ కృషి వ్యర్థం కాకుండా ఏమైనా చేయొచ్చా? అంటే సివిల్స్ తో పాటు రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలూ, ఆర్బీఐ పరీక్షలూ రాస్తుండాలి. ఈ రకంగా ఉపాధిపరంగా ఉండే అభద్రతాభావం తగ్గించుకోవచ్చు.

– బర్ల శ్రీనివాస్



పదవ తరగతి విద్యార్థుల కోసం..

పదవ తరగతి చదివే విద్యార్థుల్లో పరీక్షల భయం పోవాలి. ఇందుకోసం పరీక్షలకు ముందుగానే సిద్ధపడాలి. రాష్ట్ర ప్రభుత్వం ముద్రించిన నూతన విద్యా విధానం సీసీఈ మెథడ్‌ను అనుసరించి సబ్జెక్ట్ టీచర్‌చే తయారు చేసిన అంచనా ప్రశ్నావళిని అందిస్తున్నాం. చాప్టర్‌వైస్‌గా విద్యార్థులకు ఉపయోగపడే విధంగా ఇది తయారు చేయబడింది. బయాలజీ సబ్జెక్టులో ఫస్ట్ చాప్టర్ నుండి ప్రశ్నలు..

ఒక మార్కు ప్రశ్నలు

1.స్వయం పోషకాలు అంటే ఏమిటి ?
2.పరపోషకాలు అంటే ఏమిటి?
3.కాంతి చర్య అనగా ఏమి?
4.నిష్కాంత చర్య అనగా ఏమి?

రెండు మార్కుల ప్రశ్నలు

1.క్వాషియార్కర్ వ్యాధి ఎలా వస్తుంది?
2.మెరాస్మిస్ వ్యాధి లక్షణాలు ఏవి?
3.స్థూలకాయత్వం (ఒబేసిటీ) అంటే ఏమిటి ? నష్టాలు ఏమి?
4.ఆకు అడ్డుకోత పటం గీయండి.
5.హరితరేణువు అడ్డుకోత పటం గీస భాగాలు గుర్తించండి
6.కిరణజన్య సంయోగ క్రియ అనగా ఏమి?
7.కిరణజన్య సంయోగక్రియ సమీకరణం వ్రాయండి?

నాలుగు మార్కుల ప్రశ్నలు

1.జోసఫ్ ప్రీస్టే ప్రయోగంను పటంతో వివరించండి. లేదా ఇదే ప్రశ్నను కిరణజన్య సంయోగ క్రియలో గాలి ఎటువంటి పాత్ర పోషిస్తుందో తెలపండి.
2.కిరణజన్య సంయోగ క్రియలో co2 ఆవశ్యకతను పటం పూర్వకంగా నిరూపించండి.
3.కిరణజన్య సంయోగ క్రియ ద్వారా కాంతి శక్తి రసాయనిక శక్తిగా మార్చబడుతుందని మీరు భావిస్తున్నారా? అయితే నిరూపించండి.
4.కిరణజన్య సంయోగ క్రియలో ఆక్సిజన్ విడుదల అవుతుందని నిరూపించండి.

ఆబ్జెక్టివ్ టైప్

1. .... ఒక పరాన్న జీవి.
2. కిరణజన్య సంయోగ క్రియ జరిగే ప్రదేశంగా పేర్కొనదగినది......................
3. జఠరరసంతో.........................ఆమ్లం ఉంటుంది.
4. క్రింది వానిలో ఎంజైమ్ లేని జీర్ణరసం
ఎ. బైల్ బి. జఠరరసం సి.పైత్యరసం డి.లాలాజలం
5. కిరణజన్య సంయోగ క్రియ జరిగేటప్పుడు మొక్కలో ఏ భాగం గాలిలో నుండి CO2ను గ్రహిస్తుంది.
ఎ. మూలకేశాలు బి. పత్రరంధ్రం సి. ఆకు ఈనె డి. రక్షక పత్రాలు.



– ఎం.దామోదర్
బయాలజీ టీచర్

DIABETES MELLITUS - PHARMACOLOGY & NURSING MANAGEMENT

జీవితంలో త్వరగా స్థిరపడాలనుకునేవారు, సమాజానికి తమ వంతుగా సేవ చేయాలనుకునే వారు ఎక్కువగా ఎంచుకునే వృత్తి నర్సింగ్. ప్రజారోగ్య రంగంలో వీరి సేవలు కీలకం. క్రమం తప్పకుండా రైల్వే, ఈఎస్ఐసీ లాంటి కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉద్యోగాలతో పాటు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఆసుపత్రులు, స్కూల్స్, కాలేజీల్లో పోస్టులు భర్తీ చేస్తుంటారు. ఇటీవల ప్రభుత్వం ప్రారంభించిన గురుకులాల్లో కూడా నర్సింగ్ పోస్టులను భర్తీ చేస్తున్నారు. తాజాగా ఈఎస్ఐసీ కూడా నర్సింగ్ పోస్టుల భర్తీ కోసం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ పరీక్షలను ఆంగ్ల మాధ్యమంలో నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో అభ్యర్థుల సౌకర్యం కోసం పరీక్షలకు ఏ విధంగా సిద్ధపడాలి. ఎలాంటి ప్రశ్నలు వచ్చే అవకాశముంది. ఏ విషయాలపై ఎక్కువగా దృష్టి సారించాలి తదితర విషయాలను ఆంగ్ల భాషలో వారి కోసం విజయక్రాంతి అందిస్తోంది.

As the nurse, we must know how to properly care for them, especially newly diagnosed diabetics. The nurse's role include educating, assessing, planning, administering medications, and evaluating treatment.

These will cover:

- Diet
- Exercise
- Oral Diabetic Medications
- Insulin
- Mnemonics

Diabetes Nursing Management

Nurse's role: educating, monitoring, and administering (medications)

Teach patient to follow the Triangle of Diabetes Management

Diet, medications, and exercise all work together while monitoring blood glucose

Example: Patient wants to make sure their diet is balanced with their medication (insulin/oral meds) and they use exercise to manage glucose levels (doing all this while monitoring blood glucose).

Diabetic Diets

DIET: Diets are individualized due to physical activity and medication therapy

Limitation of the following:

- Carbs (4560%) grains, vegetables with starches potatoes, corn, sweets... cookies, soda, dried beans, milk)
- Fats (<20 %)....limit unhealthy fats saturated, trans fats, cholesterol: lard, gravies, whole milk, bologna, hot dogs, sausage, processed foods hydrogenated oils...concentrate on mono & polyunsaturated avocadoes, olives, peanuts, nuts
- Proteins (1520%) meats don't increase the glycemic index: meats chicken, turkey, fish, plant based beans, peas, low fat cheese, eggs whites.

Exercising Management

Exercise: Aerobic the best (helps the body use insulin) ex: cardio running, walking, swimming etc.

Teach patient signs of hypoglycemia & hyperglycemia

Signs of Hypoglycemia:

- "I'm sweaty, cold, and clammy.... give me some candy"
- "Sweating, clammy, confusion, light headedness, double vision, tremors"

Signs of Hyperglycemia: Three P's

- Polyphagia
- I'm hot and dry... I must be on a sugar high!
- Polydipsia
- Polyuria
- Always check blood sugar prior to exercising: if lower than 100 eat a small carb snack and carry SIMPLE carbs with you while exercising in case of hypoglycemic attack
- Example of simple carbs: hard candy, honey, crackers/graham crackers, fruit juice

If patient plans on exercising for an extended period of time, check glucose prior, during, and after.

If blood glucose is higher than 250 with ketones present in urine prior to exercise avoid exercise until glucose and ketones stabilize.

Diabetic Medications

Oral medications (for patients with Type 2 diabetes when exercise and diet doesn't work to control blood glucose):

- **Sulfonylureas:** ides zides, mides, rides" (most common) stimulate beta cells in pancreas to make insulin (Glyburide, Glipizide, Diabinese, Amaryl) AVOID ETOH....extreme hypoglycemia
- **Meglitinides:** "glinide" Ex: repaglinide "Prandin" stimulate beta cells in pancreas to make insulin...instruct pts to take first bite with meal
- **Biguanides:** Metformin (Glucophage)... .causes the liver to decrease its stores of glucose. Watch out if patient is scheduled for surgery/procedure (heart cath)...stop for 48 hours and watch renal function...diarrhea
- **Alphaglucoside inhibitors:** Precose, Glyset lower blood sugar by slowly down the breakdown of starchy foods in the GI system which helps slowly rise the blood sugar... instruct pts to take first bite with meal
- **Thiazolidinedione:** "glitazone" reduce glucose production in the liver: Actos/Avandia watch liver function and heart function increase risk of MIs

Medications that cause hypoglycemia

- Remember from the hypertension lecture that Beta Blockers (mask symptoms of hypoglycemia)
- Other medication that cause it: ETOH, ASA, Sulfonylureas (medications used to treat type 2: Glyburide, Glipizide, Diabinese), and MAO inhibitors (meds for depression) , Bactrim (common antibiotic)

Medications that cause hypergycemia

Thiazide diuretics (HCTZ), Glucocorticoids (Prednisone, Hydrocortisone), estrogen therapy

Insulin



It is used for Type 1 regularly, and sometimes for Type 2 diabetics if the patient is experiencing stress on the body like surgery or illness.

Know the categories of insulin. Example: whether they are rapid, short, intermediate, long acting and the onset, peak, and duration.

Note: Peak is the most susceptible time for hypoglycemia

Insulin Mnemonics

Note that if you use the word insulin you can divide the word and separate it into specific categories of insulin types. Watch the lecture above for a full in depth explanation about this mnemonic.

RapidActing Insulin:

"15 minutes feels like an hour during 3 rapid responses."

- Onset: 15 minutes
- Peak: 1 hour
- Duration: 3

ShortActing Insulin:

"Shortstaffed nurses went from 30 patient to (2) 8 patients."

- Onset: 30 minutes
- Peak: 2 hours
- Duration: 8 hours

IntermediateActing Insulin:

"Nurses Play Hero to (2) eight 16 year olds."

- Onset: 2 hours
- Peak: 8 hours
- Duration: 16 hours

LongActing Insulin:

"The two long nursing shifts never peaked but lasted 24 hours."

- Onset: 2 hours
- Peak: NONE
- Duration: 24 hours

(ఇంకా వుంది)



– ప్రదీప్త మామిడి
నర్స్–ఎడ్యుకేటర్, అపోలోమెడ్‌స్కిల్స్

ఇల్లే హరివిల్లు



ఆకాశంలో విరిసే ఇంద్రధనస్సు మీ ఇంట్లోనే ఉంటే.. అంతకు మించిన ఆనందం, ఆహ్లాదం ఇంకేముంటుంది. సప్తవర్ణ కాంతులీనుతూ గృహం ఔరా అని విస్తుపోయేలా ఉంటే ఎలా ఉంటుంది.ఇప్పుడు ఇంటిని ఎల్ఈడీ లైట్ల కాంతులు విరజిమ్మేలా నిర్మించుకోడం ఓ ఫ్యాషన్. అవును.. ఇల్లంతా పరచుకున్న వెలుతురులో...ఫర్నిచర్ లుక్ కాస్తా డిఫరెంట్‌గా ఎలా ఉంటుందో ఊహించండి. చీకట్లో ఆ సామాగ్రి వెలుగులు అద్భుతం అనిపిస్తాయి. రాత్రయిందంటే చాలు మీఇంటిని ఇంద్రధనస్సు పరచకున్నట్లు రంగులమయం చేసుకోవచ్చు. ఎల్ఈడీ లైట్లతో మిరుమిట్లు గొలిపే ఫర్నిచర్ ఇప్పుడు మార్కెట్లో వెలిగిపోతుంది.ఎల్ఈడీ సొగసులు అద్దుకున్న హంసతూలికా తల్పం మీ పడక గదిలో కనువిందు చేస్తుంది. లివింగ్ హాల్లో ఉన్న సోఫాసెట్ సంధ్యాకాంతులు పంచుతుంది. అంతేనా మెరిసే టైల్స్ నింగిలో మెరిసే తారకలను భూమికి దించుతాయి.





విద్యుత్ తల్పం

ఒకప్పుడు పండుగలు పబ్బాలకే ఇంటికి రంగు రంగుల బల్బులు అలంకరించుకునే వారు. అలా చిన్న చిన్న రంగులకే పరిమితమైన ఈ రంగుల కాంతులను ఇప్పుడు సోఫాలు, కుర్చీలు, డైనింగ్ టేబుల్స్, మంచం, మెట్లు, ప్లేట్లూ, గ్లాసులు, గిన్నెలు ఇలా అన్నింటిలో చొప్పిం చేస్తున్నారు డిజైనర్లు. ఫర్నిచర్ చాలా వరకు పారదర్శకంగా ఉంటే గట్టి ప్లాస్టిక్‌తో చేసినవే కాబట్టి వాటి లోపల రీచార్జబుల్ బ్యాటరీలతో వెలిగే ఎల్ఈడీ లైట్లను అమరుస్తారు. రకరాల డిజైన్లు ప్రకాశవంతమైన రంగులతో పగటిపూట ఒకరకంగా రాత్రి పూట మరో రంకగా వెలుగులు విరజిమ్మటమే ఈ లైట్ల ప్రత్యేకత. ఇలాంటి ఎల్ ఈడీ లైట్లు ఉంటే ప్రతి రోజు పండగే. ఇంట్లో జరిగే శుభకార్యాలకు ప్రత్యేకమైన ఏర్పాట్లు అవసరం ఉండదు.



మూడ్‌కు తగ్గ కలర్స్

కలర్స్ మన మూడ్‌ని మారుస్తాయనడంలో ఏ మాత్రం సందేహం లేదంటున్నారు నిపుణులు. తెలుపు రంగు మెదడును ఉత్తేజపరుస్తుంది. నీలం ప్రశాంతతను ఇస్తుంది. ఇలా ఒక్కో రంగుది ఒక్కో ప్రత్యేకత. ఫర్నిచర్‌లో వినియోగించే రంగులు కేవలం అందం కోమే కాదు మన మూడ్‌కు తగ్గట్టు రిమోట్ సహాయంతో కలర్స్‌ని మార్చుకునే సౌలభ్యం కూడా కల్పించాయి వాటి కంపెనీలు. ఇక గచ్చుకు ఎల్ఈడీలను అమర్చేటప్పుడు కస్టమర్లకు తగ్గట్టు అమరుస్తారు. అంతే కాకుండా నచ్చిన కలర్‌ను ఎంచుకుని ఆనందం పొందవచ్చు. మెట్ల విషయానికి వస్తే గట్టి గాజుతో చేసిన టైల్స వాటికి అడుగున ఎల్ఈడీ లైట్లను అమరుస్తారు. ఇంకో ప్రత్యేకతేమిటంటే.. మనం వేసే అడుగులను బట్టి లైట్స్ కూడా అంతే లయబద్ధంగా రంగులు పంచుతాయి. అడుగు తీయగానే వెలుగులు ఆగిపోతాయి.



సోలార్ వెలుగులు

ఇంటి ఆవరణలో సోలార్ ఎల్ ఈడీ లైట్లను ఏర్పాటు చేసుకుంటే కరెంట్‌ఆదా అవడమే కాకుండా ఇంటిని రంగులతో నింపేయొచ్చు. వీటిలో సెన్సర్ల సాయంతో పనిచేసేవి కూడా ఉన్నాయి. చీకట్లో మనం ఆ చుట్టుపక్కలకు రాగానే వాటంతట అవే వెలిగి దారి చూపిస్తాయి. ఆరు బయట పెట్టే పూల కుండీలు, టైల్స్‌లో అ మర్చిన లైట్లు పగలు సూర్య కాంతిని గ్రహించి రాత్రి పూట వెలుగులు పంచుతాయి. ఇలా బాత్‌టబ్‌లు, ప్యాన్లు..ఇలా ఒక్కటేమిటి ఇంట్లోని ప్రతి వస్తువులకు ఎల్ఈడీ లైట్లను అమరుస్తున్నారు డిజైనర్లు. రిక్వైర్‌మంట్‌ను బట్టి చార్జెస్ ఉంటాయి ఈ వెలుగులు మీకు కావాలంటే ఒట నగరాల్లోని షోరూమ్స్‌ని లేదా ఇంటీరియర్ డిజైనర్స్‌నో సంప్రదిస్తే మీ గృహసీమని రంగులమయం చేసుకోవచ్చు. చీకటికి వన్నెద్దుతున్న ఈ కొత్త ట్రెండ్ భలేగా ఉంది కదూ.








ఫర్నిచర్‌లో ఎల్ఈడీ లైట్లను అమర్చుకోవడానికి చాలా మంది ఆసక్తి చూపిస్తున్నారు. ప్రస్తుతం ఇది ఒక ట్రెండ్‌గా మారింది. వీటిని అమర్చుకోవడానికి చదరపు అడుగుకు కనీసం 1800 రూపాయల ఖర్చవుతుంది. విద్యుత్ గురించి భయపడాల్సిన పని లేదు. కరెంట్‌ను ఆదా చేసే చాలా రకాలు మార్చెట్లో ఉన్నాయి. ఒక్కసారి ఖర్చు చేస్తే చాలు జీవితాంతం మన్నికగా ఉంటాయి.

– మాధురీ
ఇంటీరియర్ డిజైనర్

విజయారెడ్డి


లిప్ ఆర్ట్







ఎప్పుడు ఎలాంటి ఫ్యాషన్ వస్తుందో ఎవ్వరూ కూడా అంచనా వేయలేరు. ఒక్కో సారి ష్యాషన్ వెర్రి పుంతలు తొక్కుతోంది అనడానకి ఇదొ క ఉదహారణ.ఇప్పటిదాకా నెయిల్ ఆర్ట్ ఫ్యాషన్ ట్రెండ్ రాజ్యమేలింది. ఇప్పుడిక 'లిప్ ఆర్ట్'దే హవా. పెదవులను బేస్ చేసుకుని వాటి చుట్టూ తమాషా బొమ్మలు గీయటం లేటెస్ట్ ఫ్యాషన్. ఫుడ్ అండ్ బ్యూటీని ఇష్టపడే కొందరు ఇన్స్టాగ్రామర్స్ తమ ఇష్టాన్ని లిప్ ఆర్ట్‌కు అన్వయించేస్తున్నారు. ఇంకొందరు పెదవులనే కార్టూన్ క్యారెక్టర్లుగా మలిచేస్తున్నారు. ఈ వెరైటీ బ్యూటీ ట్రెండ్ ఎంత కాలం కంటిన్యూ అవుతుందో గాని, అమ్మాయిల అందమైన పెదవుల్ని అలాంటి చిత్రవిచిత్రమైన ఆకారాలతో చూసి ఇదేం వెర్రిరా బాబూ! అంటూ అబ్బాయిలు తలలు పట్టుకుంటున్నారు.







యాప్‌తో కురులకు మెరుగులు



జుట్టున్నమ్మ ఎన్ని కొప్పులైన వేయవచ్చు. ఈ సామెతని తరుచుగా వింటుంటాం. ఇప్పడు ఈ సామెత ఎందుకు అనుకంటున్నారా. కొత్త కొత్త హెయిర్ స్టైల్స్ వేసుకోవాలనే కోరిక ప్రతి ఒక్కరికి ఉంటుంది. ఇప్పడు అలాంటి వారి కోసం ఏకంగా యాప్ వచ్చేసిందండి. జస్ట ఆ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుంటే మీకు నచ్చినన్ని రకాలుగా ట్రై చేయవచ్చు. హెయిర్ స్టైల్‌తో న్యూ లుక్‌గా కనిపించాలనుకునే వారికోసమై హెయిర్ స్టైల్ స్టెప్-బై-స్టెప్ అనే యాప్ వచ్చింది. దీనిలో రకరకాల జడలకు సంబంధించిన వీడియోలు కనిపిస్తాయి. ఎలా వేయాలో కూడా వివరణతో సహా ఉంటాయి. ఇవి పిల్లలకే కాదు,పెద్దలకీ బాగుంటాయి. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లోనూ వాడుకునే అవకాశం ఉంది. ఇక ఆలస్యమెందుకు ప్రయత్నించి చూడండి.














మీ ఆహారంలో వీటినీ తీసుకోండి..

- వోట్స్‌లో ప్రోటీన్, ఇనుము, మెగ్నీషియం, పొటాషియం, సెలీనియం, ఫోలేట్ ఒమేగా3, ఆమ్లాలు వంటి పోషకాలు ఉన్నాయి.
- ఓట్స్‌లో సమృద్ధిగా ఉండే యాంటిఆక్సిడెంట్స్ ఫ్రీ రాడికల్స్ మీద పోరాటం చేస్తాయి. వోట్స్‌లో ఉండే లిగ్నన్ పదార్థం గుండె జబ్బులను నివారిస్తుంది.
- ఓట్స్ అల్పాహారం కాబట్టి అదనపు కొవ్వు పదార్థాలను కోల్పోవటానికి, ఆరోగ్యకర శరీర బరువును నిర్వహించడానికి దోహదపడుతుంది. దీనిలో ప్రోటీన్, ఫైబర్ ఉండడం వల్ల కడుపు నిండినట్లుగా అనిపిస్తుంది.
- ఇది సెరోటోనిన్ ఉత్పత్తిని పెంచి మెదడు, మానసిక స్థితి, నిద్ర, ఆకలిని నియంత్రించే ఒక న్యూరోట్రాన్స్‌మీటర్‌న్ని ప్రేరేపిస్తుంది.
- చర్మం మృదువుగా, తేమగా ఉండటానికి ఓట్‌మీల్ దోహదపడుతుంది.



పెరటి చెట్టు అరటి

అరటి పువ్వు ముడుచుకునే ఉంటుంది. విప్పితే మాత్రం దొంతరుగా పూలు చిత్రంగా ఉంటాయి. చాలామందికి ఈ పువ్వుతో మంచి వంటకం చేసుకోవచ్చని తెలియదు. అరటిపువ్వు కూర కూడా చాలా రుచిగా ఉంటుంది. వండే పద్ధతి తెలిసి వంటబట్టాలేకానీ అరటి పువ్వుతో కమ్మని వంటలు చేయటం పెద్ద కష్టమేమీ కాదు. ఈ రుచికరమైన అరటి పువ్వు రెసిపీలు ట్రై చేసి చూద్దాం.

అరటిపువ్వు పచ్చడి



కావలసిన పదార్థాలు

(కాడలు తీసి, శుభ్రం చేసిన) అరటిపువ్వు ఒక కప్పు, ఆవాలు, మినపప్పు రెండు టీ స్పూన్లు, పసుపు అర టీ స్పూను, నువ్వులు ఒక టీ స్పూను, పుట్నాల పప్పు ఒక టేబుల్ స్పూను, ఇంగువ పావు టీ స్పూను, ఎండుమిర్చి 2, పచ్చిమిర్చి 2,అల్లం చిన్నముక్క, చింతపండు 2 రెబ్బలు, పచ్చి కొబ్బరి ముక్క , కొత్తిమీర తరుగు అరకప్పు, నూనె 2 టేబుల్ స్పూన్లు.

తయారుచేసే విధానం

కడాయిలో నూనె వేడి చేసి ఆవాలు, మినప్పప్పు వేయించాలి. తర్వాత వరసగా నువ్వులు, పుట్నాలు, పచ్చిమిర్చి, ఎండుమిర్చి, చింతపండు రెబ్బలు, అల్లం, పసుపు, కొబ్బరి ముక్కలు, కొత్తిమీర ఒకటి తర్వాత ఒకటి వేస్తూ కొద్దిసేపు వేయించాలి. చివరగా ఇంగువ కలిపి దించేయాలి. పదార్థాలన్నీ చల్లారిన తర్వాత మిక్సీలో వేసి తగినంత ఉప్పుతో పాటు బరకగా రుబ్బాలి. ఈ పచ్చడి వేడి వేడి అన్నంలో కలిపి తింటే ఎంతో రుచిగా ఉంటుంది.

అరటిపువ్వు వేపుడు



కావలసిన పదార్థాలు

అరటి పువ్వు ఒక గెల, నిమ్మరసం ఒక టేబుల్ స్పూను, ఆలివ్ నూనె ఒక టీ స్పూను, కొబ్బరి నూనె ఒక టేబుల్ స్పూను, ఆవాలు పావు టీ స్పూను, శనగపప్పు, మినప్పప్పు ఒక టీ స్పూను చొప్పున, పసుపు అర టీ స్పూను, మిరియాల పొడి చిటికెడు, జీరాపొడి పావు టీ స్పూను, కరివేపాకు 4 రెబ్బలు, ఉల్లి తరుగు అరకప్పు, వెల్లుల్లి తరుగు అర టీ స్పూను, ఉప్పు రుచికి సరిపడా.

తయారుచేసే విధానం

ముందుగా అరచేతులకు ఆలివ్ నూనె రాసుకుని అరటిపువ్వు కాడలు తీసివేయాలి. తర్వాత నిమ్మరసం కలిపిన నీటిలో బాగా కడిగి తురుముకోవాలి. ఇప్పుడు కడాయిలో నూనె వేసి ఆవాలు, కరివేపాకు, పప్పులు, ఉల్లి, వెల్లుల్లి తరుగు ఒకటి తర్వాత ఒకటి వేయించి అరటిపువ్వు తరుగు కలపాలి. అన్నీ ఒకసారి కలిపి పసుపు, జీరాపొడి, మిరియాల పొడి, ఉప్పు వేసి 5 నిమిషాలు వేయించాలి. పువ్వు మగ్గిన తర్వాత కొత్తిమీర చల్లి దించేయాలి. ఈ వేపుడు సాంబారు అన్నంతో సైడ్ డిష్‌గా బాగుంటుంది.

అరటిపువ్వు వడలు




కావలసిన పదార్థాలు

అరటిపువ్వు తురుము ఒక కప్పు, కందిపప్పు, శనగపప్పు అరకప్పు చొప్పున, ఎండుమిర్చి 5, పచ్చిమిర్చి 2, అల్లం అంగుళం ముక్క, వెల్లుల్లి 5 రేకలు, ఇంగువ అర టీ స్పూను, పసుపు పావు టీ స్పూను, సోంపు ఒకటిన్నర టీ స్పూను, బియ్యప్పిండి పావు కప్పు, ఉల్లి తరుగు ఒక కప్పు, కరివేపాకు, కొత్తిమీర తరుగు గుప్పెడు చొప్పున, ఉప్పు రుచికి సరిపడా, నూనె వేయించడానికి తగినంత.

తయారుచేసే విధానం

పప్పులు విడివిడిగా 3 గంటలు నాన బెట్టుకోవాలి. ముందుగా ఎండుమిర్చి, సోంపు, వెల్లుల్లి, అల్లం మిక్సీలో వేసి, ఒకసారి తిప్పి అందులోనే నానిన పప్పులు కూడా వేసిబరకగా రుబ్బాలి. ఒక పాత్రలో అరటిపువ్వు తురుము (కాడలు తీసి, మజ్జిగలో కడిగి తరిగిన) , కరివేపాకు, కొత్తిమీర తరుగు, పసుపు, పచ్చిమిర్చి తరుగు, ఇంగువ, ఉప్పు, ఉల్లి తరుగు, బియ్యప్పిండి కలిపి అందులోనే పప్పుల మిశ్రమం కూడా వేసి అన్నీ మరోసారి బాగా కలిపి నిమ్మకాయ సైజులో ఉండలు చేసుకోవాలి. తర్వాత ఉండల్ని అరచేతితో వడలుగా ఒత్తి నూనెలో రెండువైపులా దోరగా వేయించాలి. ఇవి సాయంత్రం పూట కాఫీతో మంచి కాంబినేషన్.

స్పైన్ ఎండోస్కోపిక్ చికిత్స



శస్త్రచికిత్సలు నొప్పి తెలియకుండా మరింత సులభంగా, ప్రయోజనకరంగా నిర్వహించేందుకు వైద్య పరిశోధనలు నూతన ఆవిష్కరణలు చేస్తున్నారు. శరీరంలోని అవయ వాలలో తలెత్తే రోగాలకు ఔషధాలతో చికిత్స చేసినప్పటికీ నయం కాని దశలో శస్త్రచికిత్స ద్వారా నయం చేస్తారు.

దేహంలోని వివిధ భాగాలకు ఎండోస్కోప్ ద్వారా శస్త్రచికిత్స చేయడం కొన్ని దశాబ్దాలుగా ఉన్నదే. అయితే ఇటీవల కాలంలో శరీరంలోని అత్యంత కీలకమైన వెన్నుముక శస్త్రచికిత్స లో కూడా ఎండోస్కోప్‌ను ఉపయోగిస్తున్నారు. ఎండోస్కోపిక్ సర్జరీ టెక్నిక్‌ను ఉపయోగించడం ద్వారా రోగికి అదనపు ప్రయోజనాలు చేకూరనున్నాయి. దీనిపై ప్రజలు అవగాహన పెంచుకోవడం ద్వారా ఇలాంటి పరిస్థితి తలెత్తితే ధైర్యంగా శస్త్రచికిత్సకు ముందుకెళ్లే అవకాశముంది. వెన్నుముక శస్త్రచికిత్సలో ఎండోస్కోప్ పాత్రపై ప్రజలు తెలుసుకోవాల్సిన విషయాలెన్నో ఉన్నాయి.

ఎండోస్కోప్ అంటే..

1990వ దశకం నుండి ఎండోస్కోపిక్ సర్జరీ టెక్నిక్స్‌ను శరీరంలోని వివిధ భాగాలకు శస్త్రచికిత్స చేసేందుకు ఉపయోగి స్తున్నారు. దీనిని ప్రస్తుతం వెన్నుముక శస్త్రచికిత్సలో కూడా అందుబాటులోకి తెచ్చారు. ఈ పద్ధతిలో ట్యూబ్ ద్వారా శస్త్రచికిత్స చేసే భాగాన్ని వీక్షించేందుకు చిన్న కెమెరా, సర్జికల్ లైట్‌ను ఉపయోగిస్తారు. సర్జికల్ పరికరాలను వెన్నుముక కెనాల్‌లో మెత్తని కణజాలం, ఎముకలను జరుపుకుంటూ శస్త్రచికిత్స చేస్తారు. చిన్నపాటి కోత (గాటు)తోనే మొత్తం శస్త్రచికిత్స పూర్తవుతుంది.

ప్రయోజనం..

సాధారణంగా శస్త్రచికిత్సల్లో కండరాలు, కణజాలం, ఎముకలు ఎక్కువగా దెబ్బతింటాయన్న సంగతి తెలిసిందే. అయితే అందుకు భిన్నంగా ఎండోస్కోప్ విధానంలో చేసే శస్త్రచికిత్సలో కండరాలు, కణజాలం, ఎముకలకు దెబ్బతినే స్థితి కనిష్టంగా ఉంటుంది. దీనితో శస్త్రచికిత్స నిపుణులు సులభంగా వెన్నుపూసకు చికిత్సను ఖచ్చితంగా చేయగలుగుతారు. ఎండోస్కోపిక్ స్పైన్ ప్రొసీజర్లలో సాధారంగా రోగులను అవుట్ పేషెంట్లుగా చికిత్స చేసి పంపిస్తారు. కొన్ని ప్రత్యేక కేసుల్లో మాత్రం ఒక రోజు కన్నా తక్కువ అంటే 23 గంటలు ఇన్‌పేషెంట్‌గా చికిత్స అందిస్తారు. ఈ విధానంలో శస్త్రచికిత్స చేసే భాగంలో మాత్రమే మత్తు (లోకల్ అనెస్థీషియా) ఇస్తారు. నొప్పి తక్కువగా ఉంటుంది. త్వరగా లేచి నడవగలుగుతారు. దుష్ప్రభావాలు (ఇన్‌ఫెక్షన్స్) రేట్ కూడా చాలా తక్కువ.

ఇలాంటి ప్రొసీజర్లలో కలిగే అదనపు ప్రయోజనాలు..

పెద్ద గాటుతో చేసే శస్త్రచికిత్సల కన్నా చిన్న కోతతో చేసే సర్జరీలతో కలిగే ప్రయోజనాలు ఎన్నో ఉన్నాయి. రక్తం తక్కువగా పోవడం లేదంటే అసలే పోకుండా శస్త్రచికిత్స చేసే అవకాశముంటుంది. నొప్పి నివారణ కోసం వేసుకోవాల్సిన మందులు కూడా తక్కువగానే ఉంటాయి. వెన్నుముక కదలికలను పరిరక్షిస్తుంది. చాలా మట్టుకు శస్త్రచికిత్స చేసే భాగంలోనే మత్తు ఇస్తే సరిపోతుంది. ఒక రోజులోనే సర్జరీ అయిపోతుంది. ఈ విధానంలో శస్త్రచికిత్సలు విజయవంత మయ్యే శాతం ఎక్కువ. మెరుగైన జీవిత కాలం పెరుగుతుంది. కండరాలను, ఎముకలను తొలగించే పని లేదు.

ఎండోస్కోప్‌లో ఏం చేస్తారు..

చర్మంపై చిన్నగాటు మాత్రమే ఉండడం ద్వారా కండరాలు, ఎముకలకు తక్కువ నష్టం ఉంటుంది. దెబ్బతిన్న వెన్నుపూస నుంచి నరాన్ని విడతీస్తారు. వెన్నుపూసలో దెబ్బతిన్న భాగాన్ని తొలగిస్తారు. అనంతరం డిస్క్‌ను క్లీన్ చేస్తారు. అనంతరం నరాన్ని యథాస్థానంలోకి తెస్తారు. అనంతరం ఎండోస్కోపిక్ కోసం ఉపయోగించిన ట్యూబ్‌ను తొలగిస్తారు. దీనితో ఎండోస్కోపిక్ చేసిన ప్రాంతాన్ని కణజాలం కప్పివేస్తుంది. గాటు వేసిన ప్రాంతంలో చిన్న బ్యాండేజీ వేస్తే సరిపోతుంది.

వీటిలోని రకాలు..

ఎండోస్కోపీలలో కూడా పలు రకాలున్నాయి. ట్రాన్స్ ఫొరమినల్ ఎండోస్కోపీ (వీపు మధ్య భాగం నుండి కాకుండా పక్క నుండి చేసేది). దీనితో పెద్దగా ఉపయోగం లేదు. అయితే అనుభవం లేని వారు ఎక్కువగా ఈ ప్రొసీజర్లు చేస్తుంటారు. ఇంటర్ లామినర్ ఎండస్కోపి (మధ్య లైను నుండి చేసేది). మధ్యభాగం నుండి చేసేది. దీనితో ఇబ్బందులు తక్కువ. సక్సెస్ రేట్ ఎక్కువ. ఇది తక్కువ మంది అనుభవజ్ఞులైన వారే చేస్తున్నారు.

ఎవరికి చేస్తారు..

వెన్నుముక శస్త్రచికిత్సల్లో ఇప్పటికీ ఎండోస్కోపిక్ టెక్నిక్‌లో శస్త్రచికిత్సలు తక్కువగా జరుగుతున్నాయి. దీనిపై ఇంకా పరిశోధనలు కొనసాగుతున్నాయి. కాల్షియం ఇబ్బందులు ఉండి వెన్నుపూస సమస్యలున్నట్టు ఎంఆర్ఐ పరీక్షల్లో తేలిన వారికి, వెనుకభాగం నొప్పి కన్నా కాలు నొప్పి ఎక్కువ ఉండి డిస్క్ సమస్య ఉన్నట్టు ఎంఆర్ఐలో తేలిన వారికి దీనిని చేస్తారు. ఎండోస్కోపీ ప్రొసీజర్లు చేయడంలో అనుభవజ్ఞులు దీనిని మెరుగ్గా చేయగలుగుతారు.

ఎవరికి చేయకూడదంటే..

వెన్నుముక స్థిరత్వం లేని వారికి, కాల్షియం చేరిన డిస్క్, స్పైనల్ ట్రామా, తన స్థానం నుంచి కదిలిన డిస్క్ మరోడిస్క్ స్థానాన్ని ఆక్రమించినా, జరిగినా ఎండోస్కోపీ చేయడానికి కుదరదు.



– డాక్టర్ శ్యాంసుందర్ రెండెడ్ల,
కన్సల్టెంట్ మినిమల్లీ ఇన్వేసివ్ స్పైన్ సర్జన్,
ఉదయ్ ఓమ్నీ హాస్పిటల్, నాంపల్లి.

హెల్త్

స్త్రీలు నేడు అన్ని రంగాల్లో అద్భుతంగా రాణిస్తూ, కుటుంబ బాధ్యతలు కూడా సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. కానీ ఆరోగ్యపరంగా ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారు. తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయడమే దీనికి కారణం. సమస్య తీవ్రమైన ప్పుడే వారు వైద్యం కోసం వస్తున్నారు. అలాంటి సమయంలో చికిత్స చేయడం కష్టమ వుతుంది. అందుకే స్త్రీలు తమ ఆరో గ్యాన్ని ఏమాత్రం నిర్లక్ష్యం చేయకూడదు. చిన్న సమస్య వచ్చినా వెంటనే డాక్టర్‌కి చూపించుకోవాలి. ఇంట్లో స్త్రీలు బాగుంటేనే ఆ కుటుంబం ఆనందంగా ఉంటుంది.

కాబట్టి స్త్రీలు ఆరోగ్య స్పృహ పెంచుకుని ముందుకు సాగాలి. ఒబెసిటీ, డయాబెటిస్, హైపర్ టెన్షన్, విటమిన్ 'డి' లోపం, థైరాయిడ్ సమస్యలు, గుండె వ్యాధులు, క్యాన్సర్లు మొదలైన వ్యాధులు బాగా పెరిగాయి.

కుటుంబ సౌభాగ్యం ఇల్లాలి ఆరోగ్యం



మారిన జీవనశైలి, పెరిగిన ఒత్తిడి లాంటివి స్త్రీలలో ఆరోగ్య సమస్యల్ని పెంచుతున్నాయి. 2007 లో నేషనల్ ఫ్యామిలీ హెల్త్ నిర్వహించిన ఒక సర్వేలో దేశవ్యాప్తంగా ఊబకాయంతో బాధపడుతున్న స్త్రీలలో 22.7 శాతంతో ఆంధ్రప్రదేశ్ మూడో స్థానంలో నిలిచింది. 37.5 శాతంతో పంజాబ్ మొదటి స్థానంలో ఉండగా, 24.4 శాతంతో తమిళనాడు రెండో స్థానంలో ఉంది. గుండె జబ్బులు, క్రానిక్ గుండె వ్యాధులు రావడం స్త్రీలలో మామూలే. ఛాతీనొప్పి సమస్యలకు తప్పనిసరిగా డాక్టర్ల సహాయం తీసుకోవాలి. దాంతో పురుషుల్లో గుండె జబ్బులను ముందే గుర్తించినట్టుగా స్త్రీలలోనూ ప్రాథమిక దశలోనే గుర్తించవచ్చు.

తీయటి జబ్బు తీవ్రత..

భారతీయ స్త్రీలలో డయాబెటిస్ వేగంగా వ్యాపిస్తోంది. ఇప్పటికీ కుటుంబం గురించి, కుటుంబ సభ్యుల ఆరోగ్యంపై స్త్రీలే కేర్‌టేకర్ పాత్ర పోషిస్తున్నారు. మిగతా వారి ఆరోగ్యంపై శ్రద్ధ చూపిస్తోన్న స్త్రీలు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు. దీంతో వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించడం కష్టమవుతోంది. దాదాపు 29 మిలియన్ల స్త్రీలు హై బ్లడ్ షుగర్‌తో ఇబ్బంది పడుతున్నారు.

ఎండకు దూరంగా..

మహిళల్లో విటమిన్ 'డి' లోపం, ఎముకల్లో ఖనిజ సాంద్రత తగ్గడం ఇటీవల బాగా పెరిగింది. విటమిన్ 'డి' లోపం మనదేశంలో ఒక సాధారణ సమస్య. దీనికి ఎన్నో కారణాలున్నాయి.

- ఆహారపు అలవాట్లు మారడంతో క్యాల్షియం, విటమిన్ 'డి' తీసుకోవడం తగ్గింది.
- ఫాస్పేట్స్, ఫైటేట్ ఉన్న ఎక్కువ ఫైబర్ కలిగిన ఆహారం విటమిన్ 'డి' నిల్వను తగ్గించి, క్యాల్షియం అవసరాన్ని పెంచుతున్నాయి.
- ఆధునిక జీవనశైలి కారణంగా ఇంట్లోనే ఎక్కువ సమయం గడపడంతో ఎండ తగిలే అవకాశం తగ్గిపోయింది. ఇది విటమిన్ 'డి' లోపాన్ని మరింత పెంచుతోంది. పట్టణ ప్రాంతాల్లో ఇది ఎక్కువగా ఉంది.
- పెరిగిన కాలుష్యం కారణంగా అల్ట్రావయోలెట్ కిరణాలు విటమిన్ 'డి'ని శరీరం నుంచి తొలగిస్తాయి.
- సంప్రదాయ పద్ధతులైన 'బుర్ఖా' పద్ధతి అనుసరించే స్త్రీలలో విటమిన్ 'డి' లోపం ఎక్కువగా ఉంటోంది.
- తరచుగా గర్భం ధరించడం, పిల్లల మధ్య వ్యత్యాసం లేకపోవడంతో తల్లీ బిడ్డల్లో విటమిన్ 'డి' లోపం ఏర్పడుతుంది. కాబట్టి 'డి' విటమిన్ లోపాన్ని అధిగమించడానికి ప్రతిరోజూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల మధ్య అరగంట సేపు సూర్యుని వెలుతురులో గడపండి. ఈ సమయంలో సన్‌స్క్రీన్ రాసుకోవద్దు. చేతులు, ముఖంపై ఏమీ కప్పుకోవద్దు. ఎండ తగిలితే విటమిన్ 'డి' లోపాన్ని అధిగమించడానికి సరిపోతుంది.

వ్యక్తిగత జాగ్రత్తలు అవసరం..


- ప్రతీ వారం బరువును చూసుకోండి. బాడీ మాస్ ఇండెక్స్ 23గా ఉండేలా చూసుకోవాలి.
- రోజూ అరగంటసేపు వ్యాయామం చేయాలి. చాలామంది ఇంటి పనులు చేస్తే సరిపోతుందని భావిస్తారు. కానీ ఇంటి పనులు క్యాలరీలను ఖర్చు చేయవు. అందుకే రోజూ వ్యాయామం చేయాలి.
- ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోండి. హై క్యాలరీ కార్బోహైడ్రేట్స్, శాచురేటెడ్ ఫ్యాట్స్‌కు దూరంగా ఉండండి. మీ రోజువారీ డైట్‌లో కూరగాయలు, పళ్లు ఎక్కువగా ఉండేలా చూసుకోండి.
- రోజూ అద్దంలో చూసుకునేటప్పుడు మెడపై థైరాయిడ్ వాపును చెక్ చేసుకోండి. 30 ఏళ్ల వయసు తర్వాత స్త్రీలు ఏడాదికోసారి షుగర్, బీసీ టెస్ట్ చేయించుకోవాలి. 3–5 ఏళ్ల కొకసారి కొలెస్ట్రాల్ టెస్ట్, థైరాయిడ్ టెస్టును చేయించుకోవాలి.
- సెక్సువల్ లైఫ్ మొదలైన 1–2 ఏళ్ల తర్వాత ప్రతీ అమ్మాయి పాప్‌స్మియర్ టెస్ట్‌ను చేయించుకోవాలి. పెళ్ళికి ముందే సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సిన్ వేయించుకోవడం తెలివైన నిర్ణయం.
- రజస్వల అయిన ప్రతీ అమ్మాయికి స్వయంగా వక్షోజాలను పరీక్షించుకోవడాన్ని నేర్పించాలి.
- గర్భం దాల్చాలని నిర్ణయించుకునే ముందు థైరాయిడ్ చెక్, డయాబెటిస్ రిస్క్‌ను చెక్ చేయించుకోవాలి.
- పాలు తాగడం, క్యాల్షియం పుష్కలంగా ఉన్న ఆహారం తీసుకోవాలి. ఇది మిమ్మల్ని ఓస్టియోపోరోసిస్ నుంచి కాపాడుతుంది.



– డాక్టర్ జి. వింధ్య
కన్సల్టెంట్ గైనకాలజిస్ట్
కేర్ హాస్పిటల్, హైటెక్ సిటీ

ఫిదా

23 భాషల్లో ఒకేసారి రిలీజ్



వివేక్ ఒబేరాయ్ టైటిల్ పాత్రలో భారతదేశ ప్రధాని నరేంద్ర మోదీ బయోపిక్ ఇటీవల ప్రారంభమైన సంగతి తెలిసిందే. ఈ చిత్రానికి ఒమంగ్ కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. ఏకకాలంలో 23 భాషల్లో ఫస్ట్ లుక్ పోస్టర్ ని లాంచ్ చేశారు. అన్ని భాషల్లో ఒకేసారి సినిమాని పూర్తి చేసి రిలీజ్ చేయనున్నామని ప్రకటించారు. ప్రధాని గెటప్‌లో ఒబెరాయ్ లుక్‌కి అభిమానుల నుంచి అద్భుత స్పందన వచ్చింది. మోదీ పాత్రలో ఒబెరాయ్ సరిగ్గా సరిపోయారన్న ప్రశంసలు దక్కాయి. ఈ సీజన్ లో పలువురు నాయకుల బయోపిక్ లు తెరకెక్కుతుండడంతో ప్రధాని పాత్రకు ఇతర రాజకీయ నాయకుల సినిమాల్లోనూ ఆస్కారం కనిపిస్తోంది. తాజాగా వివేక్ ఒబేరాయ్ లుక్ కి ధీటుగా మోహన్ లాల్ లుక్ ఒకటి నెటిజనుల్లో హాట్ టాపిక్ గా మారింది. లాల్ సాబ్.. మోదీ గెటప్ లో దర్శనమివ్వడం ఆసక్తి రేకెత్తిస్తోంది. గజిని సూర్య నటిస్తున్న తాజా చిత్రం 'కప్పన్'లో ప్రధాని పాత్ర లుక్ ఇదని సోషల్ మీడియాలో ప్రచారం సాగుతోంది. మోదీ తరహాలోనే నెరిసిన గడ్డం, కుర్తా, జాకెట్ స్టైల్ ఆకట్టుకుంటున్నాయి. ఈ చిత్రానికి రంగం ఫేం కె.వి.ఆనంద్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇక మోదీ బయోపిక్ తో పాటు శివసేన వ్యవస్థాపక అధ్యక్షుడు థాక్రే (బాల్ థాక్రే) బయోపిక్ లో ప్రధాని పాత్ర కు ఆస్కారం ఉందా? ఉంటే ఆ పాత్ర ఇంకా రివీల్ కావాల్సి ఉంది. అలాగే అనుపమ్ ఖేర్ టైటిల్ పాత్ర పోషిస్తున్న 'ది యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్' చిత్రంలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ పాత్ర లుక్ ఆకట్టుకుంది.

ఫ్రస్టేషన్‌లోనూ కామెడీ.. అదే ప్రత్యేకత!



- వెంకీ

"సమస్య వచ్చినా, ఒత్తిడి పెరిగినా ఏం చేయాలి? ఈ ప్రశ్నకు విక్టరీ వెంకటేష్ తనదైన శైలిలో ఆన్సర్ చేశారు. ప్రకృతితో సహజీవనం ఫ్రస్టేషన్ తగ్గిస్తుంది! వేకువ ఝామున సూర్య కిరణాలు చూడడం, ప్రకృతిని సందర్శించడం, నిత్యవ్యాపకాల్లో మంచిని, మానవతను ఈగోలకు అతీతంగా పెంపొందించుకోవడమే ఫ్రస్టేషన్‌కి సరైన మందు(మెడిసిన్)" అని తనదైన శైలిలో చెప్పారు వెంకీ. విక్టరీ వెంకటేశ్, మెగా ప్రిన్స్ వరుణ్‌తేజ్ హీరోలుగా తమన్నా, మెహ్రీన్ నాయికగా శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్ పై దిల్‌రాజు నిర్మాణంలో రూపొందుతోన్న చిత్రం 'ఎఫ్ 2'. 'ఫన్ అండ్ ఫ్రస్టేషన్' ట్యాగ్ లైన్. అనిల్ రావిపూడి ఈ చిత్రానికి దర్శకుడు. సంక్రాంతి కానుకగా జనవరి 12న ఈ సినిమా విడుదలవుతుంది. ఈ సందర్భంగా హైదరాబాద్ రామానాయుడు స్టూడియోస్‌లో వెంకటేష్ మీడియాతో ముచ్చటించారు.

వినోదం పంచడమే లక్ష్యం

ఫ్రస్టేషన్‌లోనూ కామెడీ ఉంటుంది అన్నదే మూవీ కాన్సెప్ట్. పెళ్లికి ముందు, పెళ్లి తర్వాత ఫ్రస్టేషన్ .. అందులో కామెడీ పుడుతుంది. చాలా లాంగ్ గ్యాప్ తర్వాత మళ్ళీ కామిక్ ఎక్స్‌ప్రెషన్స్ ను ఈ చిత్రంలో చేశాను. అనిల్ నా మునుపటి సినిమాల్ని బాగా పరిశీలించాడు. తనకు మళ్ళీ తిరిగి నేను అలా కుటుంబ సమేతంగా వినోదం పంచితే బావుంటుంది అనిపించినట్టుంది.. అందుకే ఆ జోనర్‌ని ఎంచుకున్నాడు.

కొత్తగా ఉంటుందనే..

నా వైపు వచ్చే కథల్ని బట్టి ఏదైనా చేస్తాను. ఏదైనా ఎంచుకుంటాను. ఇది మల్టీస్టారర్ కావడంతో చూసే ప్రేక్షకులకు కొంచెం కొత్తగా అనిపిస్తుందని ఒప్పుకున్నాను. పైగా ఒక యంగ్ హీరోతో పని చేయడం వల్ల కొత్త కొత్త విషయాలను నేర్చుకోవచ్చనేది నా ఆలోచన. ఎఫ్ 2 కోసం షూటింగ్ చేసేటప్పుడే సహజంగానే ఎక్స్‌ప్రెషన్స్ కుదిరాయి. దాంతో పని చాలా సులవైంది.

టీజర్‌తోనే ఉత్కంఠ..

టీజర్‌తోనే ఉత్కంఠ పెరగడంతో చాలా ఆనందంగా అనిపించింది. టీజర్‌లో ఉన్న ఎక్స్‌ప్రెషన్ ప్రత్యేకించి నాకు డైరెక్టర్ ఏమీ చెప్పలేదు. డైలాగ్ చెప్పారు. దాంతో కెమెరా రెడీ కాగానే సహజంగానే ఆ ఎక్స్‌ప్రెషన్ అలా వచ్చేసింది. అంతేగా అంతేగా! అన్న డైలాగ్ బాగా ఫేమస్ అనిపించింది.

జంటల మధ్య తంటా

కొత్తగా పెళ్లయిన జంట.. ఉంటే ఇంట్లో అందరూ అక్కడే తిరుగుతూ ఉంటారు. ఏంటి విశేషం అన్న డైలాగ్స్ చాలా బాగా పేలాయి. అల్లుడుగా నటించడం ఇదే తొలిసారి. స్కూల్‌లో ఫ్యామిలీస్‌తో ఉన్నప్పటినుంచి కూడా నాకు ఎమోషన్స్ ఎక్కువే. ఎక్కువగా అన్నిటినీ పరిశీలిస్తాను. నాకు చాలా బిగ్ సర్కిల్ ఉంది జాయింట్ ఫ్యామిలీ కూడా ఉండడంతో నాకు ఫ్యామిలీ ప్రేక్షకుల్ని ఎంటర్‌టైన్ చెయ్యడం కష్టం అనిపించదు.

ఆ కోరికలేవీ లేవు

ఇమేజ్ .. ఫలానా తరహా పాత్రలే చేయాలి! అంటూ ప్రత్యేకించి ఏమీ ఉండదు. నాకు అలాంటి కోరికలు ఏమీ లేవు. వచ్చిన పాత్రల్ని చేసుకుంటూ వెళ్ళడమే. సినిమా బావుండాలి. నిర్మాతకు, కొన్నవారికి డబ్బులు రావాలి అని కోరుకుంటా. ప్రత్యేకించి ఏమీ ఇమేజ్ కోసం ఆలోచించను. ఎందుకంటే అది నా కంట్రోల్ లో ఉండదు కదా! నా కంట్రోల్‌లో ఉంటే నేను ఏదైనా చెయ్యగలను. సినిమాలు కొన్ని ఆడతాయి.. కొన్ని ఆడవు.

ఏదీ మన చేతిలో లేదు

ఇటీవల గ్యాప్ రావడానికి కారణం కొన్ని కథలు అనుకున్నాం.. కానీ కుదరలేదు. ఏదీ మన చేతిలో ఉండదు కదా. యంగ్ స్టర్స్ ఇప్పటికే దూసుకొచ్చారు కదా. కథలు దొరకడం కొంచెం కష్టంగా ఉంది. రెగ్యులర్ ఫార్మాట్‌లోనే మీరు వెరైటీ చూస్తారు.

హిట్టు మన చేతిలో లేదు

ఎఫ్ 2 ఓ మల్టీస్టారర్. ఇందులో నా టైమింగ్‌కి వరుణ్ సూట్ అవ్వడం అంటూ ఏమీ లేదు. తనకంటూ సొంతంగా ఓ స్టైల్ ఉంది. సహజంగా చేసేశాడు. ప్రత్యేకించి ఒకరిలా అంటూ ఏమీ చెయ్యలేదు. తనకంటూ ఒక హైట్ పర్సనాలిటీ కూడా ఉంది. నైస్ పర్సనాలిటీ. యాక్టింగ్ అనేది ఏ జనరేషన్ వాళ్ళైనా ఒకటే. ఎన్నో కాంబినేషన్స్ వస్తుంటాయి. ఒకొక్కరికి ఒక్కో స్టైల్ ఉంటుంది. కాకపోతే ఈ రంగంలో ఓపిక ఎక్కువ ఉండాలి. టైం వస్తే అదే కలిసొస్తుంది. అప్పటి వరకు వేచి చూడాలి.

ఎప్పుడు సూపర్ హిట్ వస్తుంది అన్నది మన చేతుల్లో లేదు. యంగ్ స్టర్స్ కి అన్నిరకాలుగా సౌకర్యాలు పెరిగాయి. కానీ నేను ఎప్పుడూ ఆనందంగానే ఉన్నాను. ఫారిన్ కారైనా, అంబాసిడర్ అయినా పాజిటివ్ గా ఆలోచిస్తేనే ప్రతిదీ బావుంటుంది. అందరూ బావుండాలి అనుకుంటే అంతా బావుంటుంది. పక్కవాడు బావుండాలి అనుకోవాలి. అప్పుడే కనీసం మనకు సాయం చెయ్యగలడు అనుకోవాలి.

దర్శకుడే పాజిటివ్ ఎనర్జీ

అనిల్‌రావిపూడి చాలా యంగ్ .. ఎనర్జిటిక్ డైరెక్టర్. మంచి రచయిత కూడా. ఎక్కడైనా పంచ్ కుదరలేదు అంటే .. రైటర్ కావడంతో వెంటనే మార్చేసి మళ్ళీ రాసుకోవడం తనకు తెలుసు. మేం కూడా అనుభవం ఉన్నవాళ్లం కావడంతో చెప్పితే మళ్ళీ సెట్స్‌లో మార్చేసి డెవలప్ చేసేవాళ్లం.

వెంకీ వద్దే వద్దన్నా!

సినిమాల్లో వెంకీ అనే పదం ఎక్కువ ఉపయోగించవద్దని అన్నాను. అదే కామన్ అయిపోతుందని వద్దన్నాను. అంతే తప్పించి ప్రత్యేకించి కారణం ఏమీ లేదు. ఎఫ్ 2లో వెంకీ అన్నది డైరెక్టర్ ఐడియా.. నాది కదు.

ప్రకృతితో గడపాలి

ఫ్రెస్టేషన్ నాకు చాలా తక్కువ. ఎందుకంటే నేను వేకువఝామున ఎక్కువగా ప్రకృతితో గడుపుతాను. సన్‌లైట్, సౌండ్స్ చాలా ఇష్టం. నేచర్ అనేది మనకు చాలా ఇస్తుంది.

ఎమోషన్స్ హైలైట్

ఈ సినిమాలో ఫన్, వినోదంతో పాటు ఎమోషన్స్.. మంచి మెసేజ్ కూడా ఉంటుంది. ఆడవాళ్ళను గౌరవించాలి అన్న ఒక సందేశం అంతర్లీనంగా ఉంటుంది. మహిళ మన జీవితంలో ఎంత ముఖ్యం అన్నది ఓ సందేశం ఉంటుంది.

మీటూ పంచెస్ లేవ్

ఈ చిత్రంలో మీటూ మీద పంచ్‌లు ఏమీ ఉండవు. దానిపైన పంచ్‌లు ఎందుకు వెయ్యాలి? అది ఎందుకు జరుగుతోంది.. ఏంటి? అనేది మనం ఆలోచించాలి.

తదుపరి సినిమాలు

వెంకీమామ, త్రివిక్రమ్‌తో ఓ సినిమా చేస్తున్నా. అనిల్ మళ్ళీ ఒక కొత్త ప్రాజెక్ట్ రాస్తున్నారు. నేను ఇప్పటి వరకు చేసిన పాత్రలు ఓకే. నాకు ఇంకా ఏదైనా ఒక ఛాలెంజింగ్ క్యారెక్టర్ చెయ్యాలని ఉంది.. అని ఇంటర్వ్యూ ముగించారు.

విధేయ రామునికి కాంప్లిమెంట్



తెలుగు నాట బుల్లితెరపై ఆహ్లాదకరమైన కార్యక్రమంగా నంబర్–1 యారీ షోకి పేరొచ్చింది. టాలీవుడ్ బెస్ట్ సెలబ్రిటీలను ఈ కార్యక్రమానికి ఆహ్వానిస్తూ హోస్ట్ రానా అదరగొట్టేస్తున్న సంగతి తెలిసిందే. కాఫీ విత్ కరణ్ జోహార్ అంత పాపులారిటీ ఈ షోకి వచ్చింది. ఇదివరకూ నందమూరి బాలకృష్ణ ఈ షోలో సందడి చేశారు. తాజాగా యారీ షో కి రానా స్నేహితుడు రామ్ చరణ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. చెర్రీతో పాటు కియరా ఈ షోలో పాల్గొని పలు ఆసక్తికర ప్రశ్నలకు సమాధానాలిచ్చింది. రానా అడిగే ప్రశ్నలకు చరణ్, కియరా క్లుప్తంగా సమాధానాలిచ్చారు. ఓ ప్రశ్నకు కియరా ఊహించని జవాబిచ్చింది. చరణ్ మైమ్ మిమిక్రీ ఎపిసోడ్ లో అర్జున్ రెడ్డిని తలచుకుని ఏడిపించింది. కియరా బాలీవుడ్ అర్జున్ రెడ్డిలో కథానాయిక. అందుకే అర్జున్ రెడ్డిని ఈ ఈవెంట్ లో తలచుకుందన్నమాట! చెర్రీని స్కూల్, కాలేజ్ డేస్ గురించి రానా ప్రశ్నించాడు. నువ్వు ఒక రూమర్ స్ప్రెడ్ చేయాలంటే ఏం స్ప్రెడ్ చేస్తావ్? అంటూ ప్రశ్నిస్తే.. నేను చాలా మంచోడిని.. అని చరణ్ ఫన్ క్రియేట్ చేశారు. కియరా అందుకు ప్రతిగా.. చెర్రీ ఫుల్ బద్మాష్ అని రియలైజయ్యా! అంటూ పెద్ద షాక్ నే ఇచ్చింది. విధేయరాముడు టీమ్ తో రానా 'నంబర్ 1 యారీ' కార్యక్రమం ప్రతి వారం రంజింపజేస్తున్న సంగతి తెలిసిందే.

'కాంచన–3' మూడింతల హారర్ ట్రీట్

హారర్ జోనర్ లో వచ్చిన ముని, కాంచన, కాంచన–2 ఘనవిజయం సాధించిన సంగతి తెలిసిందే. రాఘవ లారెన్స్ హీరోగా, దర్శకుడిగా ఫ్రాంఛైజీ చిత్రాలివి. తాజాగా ఈ సిరీస్ లో కాంచన3 తెరకెక్కుతోంది. తమిళ,తెలుగు బాషల్లో ఈ చిత్రం షూటింగ్ దాదాపు పూర్తవుతోంది.



హైదరాబాద్ లో 'కాంచన3' మోషన్ పోస్టర్ ని చిత్రయూనిట్ రిలీజ్ చేసింది. లారెన్స్ లుక్ కి సంబంధించిన పోస్టర్ ని తెలుగులో మెట్టమెదటి సారిగా డాల్బి అట్మాస్ సౌండ్ తో విడుదల చేశారు. ఈ చిత్రాన్ని తెలుగులో లైట్ హౌస్ మూవీమేకర్స్ ఎల్.ఎల్.పి బ్యానర్ పై బి.మధు సమర్పణలో రాఘవేంద్ర ప్రోడక్షన్స్ బ్యానర్ లో రాఘవ నిర్మాణం లో తెరకెక్కించారు. ఏప్రిల్ 18న విడుదల కానున్న ఈ చిత్రం ఫస్టలుక్ మోషన్ పోస్టర్ ని పాత్రికేయులకు ప్రదర్శించారు. బి.మధు మాట్లాడుతూ–"రాఘవ లారెన్స్ స్వయంగా అందించిన హర్రర్ సినిమాలు అన్నీ సూపర్ హిట్లే. అందులో ముని సీక్వెల్స్ మరీ స్పెషల్. కాంచన్ పేరుతో స్టార్టయిన తరువాత ఇప్పుడు కాంచన–3 గా ప్రేక్షకుల ముందుకు ఏప్రిల్ 18న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నాము. రాఘవ లారెన్స్ కి ఈ చిత్రం చాలా ప్రత్యేకం అనే చెప్పాలి. ఈ సీరిస్ లో ఇది నాలుగో చిత్రం. ఆయన ప్రతి చిత్రం లో తన గెటప్ ని సామాన్య ప్రేక్షకుడికి దగ్గరగా వుండేలా చూసుకున్నారు. ఇప్పడు ఈ చిత్రంలో వైట్ హెయిర్ తో కొత్త స్టయిల్ కి నాంది పలికారు. మేం విడుదల చేసిన కాంచన 3 మోషన్ పోస్టర్ శబ్ధానికి స్పందన చాలా బాగుంది. ఈ చిత్రాన్ని సమ్మర్ కానుకగా రిలీజ్ చేస్తాం. గత మూడు చిత్రాలని మించి కాంచన3 ఉంటుంది అని అన్నారు. రాఘవ లారెన్స్, ఓవియా, వేదిక, కొవైసరళ, కబీర్ దుహన్ సింగ్, శ్రీమన్, దేవదర్శిని, సత్యరాజ్, కిషోర్ తదితరులు నటించారు.

గెలవడానికి కాదు.. బతకడానికి!



తార క్రియేషన్స్ పతాకంపై ప్రముఖ పారిశ్రామిక వేత్త బ్రహ్మానందరెడ్డి నిర్మిస్తోన్న చిత్రం 'బైలంపుడి'. హరీష్ వినయ్, తనిష్క తివారి జంటగా నటిస్తోన్న ఈ చిత్రం ద్వారా అనిల్ పిజి రాజ్ దర్శకుడుగా వ్యవహరిస్తున్నారు. గ్రామీణ నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రం లిరికల్ సాంగ్ బుధవారం హైదరాబాద్ లోని ఫిలించాంబర్ లో బాలీవుడ్ హీరోయిన్ మైరా అమిధి చేతుల మీదుగా లాంచ్ చేశారు. అనంతరం మైరా అమిథి మాట్లాడుతూ...పిల్లల దేవుడు పల్లవితో సాగే సాంగ్ చాలా బావుంది. టీమ్ అందరికీ నా శుభాకాంక్షలు అన్నారు. నిర్మాత బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ పారిశ్రామికవేత్తగా ఉన్న నేను సినిమా మీద ఆసిక్తతో తొలిసారిగా నిర్మాతగా 'బైలంపుడి' చిత్రాన్ని నిర్మిస్తున్నా. అందరూ కొత్తవారైనప్పటికీ ఎంతో సహజసిద్ధంగా నటించారు. షూటింగ్ పూర్తయింది. ఇతర పనులు సాగుతున్నాయి. ఇక్కడ యుద్ధం చేయాలి...గెలవడానికి కాదు, బతకాడినికి అనేది మా సినిమా క్యాప్షన్. పిల్లల దేవుడు అనే లిరికల్ సాంగ్ రిలీజ్ చేశాం. అందరికీ పాట నచ్చుతుందన్న నమ్మకం ఉంది అన్నారు. అనిల్ పిజి రాజ్ మాట్లాడుతూ –" కెమెరామేన్ గా నా కెరీర్ స్టార్ట్ చేశాను. చాలా చిత్రాలకు వర్క్ చేశాను. దర్శకుడుగా ఇది తొలి సినిమా. ఋబైలంపుడిఋ అనే గ్రామంలో జరిగే లవ్ అండ్ పొలిటికల్ చిత్రమిది. ప్రతి పాత్ర ఎంతో సహజ సిద్ధంగా ఉంటుంది. ఒక విలేజ్ లో ఏమైతే అంశాలు ఉంటాయో మా సినిమాలో కూడా అన్ని అంశాలుంటాయి. నిర్మాత ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా నిర్మించారు. ప్రస్తుతం కొత్త కథలను ఆదరిస్తున్నారు. ఆ తరహాలో వచ్చే మా సినిమాను కూడా ఆదరిస్తారని కోరుకుంటున్నా" అన్నారు. సంగీత దర్శకుడు సుభాష్ ఆనంద్ మాట్లాడుతూ.. ఇందులో రెండు పాటలున్నాయి. ఈ రోజు పిల్లల దేవుడు అనే పాట లాంచ్ చేశాం. పాట అందరికీ నచ్చుతుంద న్నారు. దర్శకుడు

కుర్ర హీరో ప్రేమలో



టాలీవుడ్ సహ హిందీ చిత్రసీమలో పలు విజయవంతమైన చిత్రాల్లో నటించింది మలయాళీ భామ విమలా రామన్. గాయం 2, ఎవరైనా ఎపుడైనా, చుక్కలాంటి అమ్మాయి–చక్కనైన అబ్బాయి, నువ్వా నేనా, ఓం నమో వెంకటేశాయ తదితర చిత్రాల్లో నటించింది. అటు బాలీవుడ్ లో, మలయాళంలోనూ విమలా రామన్ సుపరిచితం. అయితే గత కొంతకాలంగా ఈ అమ్మడు ఎక్కడా నటిస్తున్న జాడ కనిపించడం లేదు. అవకాశాలు రాకపోవడంతో సినిమాకు దూరమైంది. ఈ అమ్మడి గురించిన ఓ టాప్ సీక్రెట్ సినీవర్గాల్ని వేడెక్కిస్తోంది. విమలా రామన్ ప్రస్తుతం ఓ యువహీరో ప్రేమలో ఉంది. అతడితో కొత్త సంవత్సరం సెలబ్రేషన్స్ కోసం ఓ ఒంటరి దీవికి వెళ్లి జాలీగా ఎంజాయ్ చేసిందిట. ఇంతకీ ఎవరా కుర్రహీరో? అంటే 'వాన' ఫేం వినయర్ రాయ్ అని తెలుస్తోంది. ఆ ఇద్దరికీ ప్రస్తుతం సినిమాల్లేవ్. అయినా చాలా కాలంగా ఎఫైర్ సాగుతోంది. ఆ సంగతిని ఆ ఇద్దరూ ఎప్పుడూ కన్ఫామ్ చేయలేదు. తాజాగా కొత్త సంవత్సరం సెలబ్రేషన్స్ మాల్దీవుల్లో జరుపుకోవడంతో అక్కడి నుంచి కొన్ని ఫోటోలు సామాజిక మాధ్యమాల్లో లీకయ్యాయి. తాజాగా విమలా రామన్ స్వయంగా తన రిలేషన్ షిప్ గురించి రివీల్ చేసారు. మాల్దీవుల్లో హీరో వినయ్ తో కలిసి సెలబ్రేషన్స్ కు సంబంధించిన ఫోటోని సామాజిక మాధ్యమాల్లో షేర్ చేశారు.



మెగా స్ఫూర్తితో 'ప్రాణం ఖరీదు'



సుప్రీం హీరో చిరంజీవి మొదటి సినిమా 'ప్రాణం ఖరీదు'. అదే టైటిల్ తో తెరకెక్కుతున్న సినిమాతో నవతరం హీరో ప్రశాంత్ పరిచయమవుతున్నారు. అవంతిక ఈ చిత్రంలో నాయిక. నందమూరి తారకరత్న ముఖ్య పాత్రలో యన్. ఎస్ క్రియేషన్స్ పతాకంపై పద్మప్రియ సమర్పణలో నల్లమోపు సుబ్బారెడ్డి నిర్మాతగా పి. ఎల్. కె . రెడ్డి దర్శకత్వంలో తెరకెక్కింది. నిర్మాణానంతర కార్యక్రమాలు పూర్తి చేసుకుని సెన్సార్ యుఏ సర్టిఫికెట్ అందుకుంది. ఇటీవలే టీజర్ విడుదలైంది. దర్శకుడు పి.ఎల్. కె. రెడ్డి మాట్లాడుతూ ఈ చిత్రం అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధంగా ఉంది. త్వరలో విడుదల తేదీ ప్రకటిస్తాము. ముందుగా మా చిత్ర టీజర్ ని విడుదల చేసాము మంచి రెస్పాన్స్ రావడం చాలా ఆనందంగా ఉంది అన్నారు. నిర్మాత నల్లమోపు సుబ్బారెడ్డి మాట్లాడుతూ మా ప్రాణం ఖరీదు మూవీ టీజర్ ని సోషల్ మీడియా లో విడుదల చేసాము మంచి విడుదల తేది చూసుకొని అతి త్వరలో ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తాము అని చెప్పారు.

దిశా సమ్మోహనం

సీకే (కెల్విన్ క్లెయిన్) బ్రాండ్ ని ఓ సిరీస్ తరహాలో ప్రమోట్ చేస్తోంది దిశా పటానీ. కార్పొరెట్ కంపెనీ కాంట్రాక్టుతో అన్నివైపులా ఆదాయాన్ని ఆర్జిస్తోంది. ప్రస్తుతం యువతరం ఎక్కడ గుమిగూడినా దిశా గురించి.. ఈ టాప్ మోడల్ కం నటి ధరిస్తున్న సీకే బ్రాండ్ గురించే ముచ్చటిస్తున్నారంటే ఎంతగా పాపులారిటీ వచ్చిందో అర్థం చేసుకోవచ్చు. అథ్లెటిక్ ఫిట్ నెస్ తో దిశా కొత్త లుక్ ని సాధించింది. దాంతోనే ఇదంతా సాధ్యమైంది. తాజాగా మరోసారి దిశా స్విమ్ వేర్ లుక్ తో ట్రీట్ ఇచ్చింది.

అంతర్జాలంలో రివీల్ చేసిన మరో కొత్త ఫోటోలో యువతరంలోకి వేగంగా దూసుకుపోతోంది. సల్మాన్ ఖాన్ అలీ అబ్బాస్ జాఫర్ కత్రిన కైఫ్ కాంబినేషన్ మూవీ భరత్ మినహా చేతిలో వేరొక సినిమా లేకపోయినా దిశా పాపులారిటీ మాత్రం ఏమాత్రం తగ్గలేదు. తన బ్రాండ్ వ్యాల్యూ అంతకంతకు పెంచుకునేందుకు సామాజిక మాధ్యమాల్ని దిశా ఉపయోగిస్తోంది. ఈ బ్యూటీ లోఫర్ తర్వాత మరో తెలుగు సినిమాలో నటించలేదు. ప్రస్తుతం టాలీవుడ్ ఛాన్సుల కోసం ప్రయత్నిస్తోందని తెలుస్తోంది.

లవంగంలోని ఉపయోగాలు

- లవంగంలో ఉండే యూజనల్ అనే రసాయన పదార్థం పంటి నొప్పి ని తగ్గించి, నోటి దుర్వాసనని నివారిస్తుంది.
- దగ్గుకు సహజమైనా మందు లవంగం. శ్వాస సంబంధిత సమస్యలకు కూడా పని చేస్తుంది. రోజూ ఆహారంలో తీసుకున్నా మంచిదే.
- వాంతులు, కడుపులో వికారంగా ఉన్నప్పుడు లవంగాల నూనెను తీసుకుంటే ఉపశమనం ఉంటుంది.
- తేనె ,కొన్ని లవంగాల నూనె ను గోరు వెచ్చని నీటిలో కలిపి రోజుకు మూడు సార్లు తాగితే జలుబు నుండి ఉపశమనం పొందవచ్చు
- లవంగాలు ఏ వంటకంలోనైన వేసుకోవచ్చు. వంటకాలకు మంచి సువాసన రుచిని ఇస్తుంది. వాతావరణంలోని మార్పుల వల్ల వచ్చే రుగ్మతలకు ఇది మంచి మందులా పని చేస్తుంది.
- తులసి, పుదీనా, లవంగాలు, యాలకుల మిశ్రమాన్ని టీలా చేసుకుని తాగితే నరాలకు శక్తి లభించి మానసిక ఒత్తిడి తగ్గుతుంది .
- లవంగాలను పొడి చేసి నీళ్ళలో తడిపి ఈ ముద్దను ముక్కు దగ్గర పెట్టుకుంటే సైనస్ తగ్గి ఉపశమనం కలుగుతుంది.
- మనం ప్రతి రోజు తాగే టీ లో లవంగం వేసుకొని తాగితే కడుపుబ్బరం తగ్గుతుంది.

పెద్దలే పిల్లలను నిద్రపుచ్చాలి...

సంక్రాంతి సెలవులు వచ్చేస్తున్నాయ్. ఇంకేంటి పిల్లలకు స్కూల్ ఉండదు. అదే వారి నిర్లక్ష్యం. ఎప్పుడైనా నిద్ర లేవొచ్చు, రాత్రిళ్లు టీవీ చూస్తూ ఆలస్యంగా పడుకోవచ్చని వారి ప్లాన్. పిల్లలు టైమ్‌ని పాటించకపోతే వారి దినచర్యలలో మార్పు చోటుచేసుకుంటుంది. ఆ సోమరితనపు ఆలోచనలను వారి నుండి వేరు చేసే బాధ్యత తల్లితండ్రులదే. సెలవులు ఉన్నా.. స్కూల్ ఉన్నా.. ఎప్పుడూ ఒకే దినచర్యని ఫాలో అయ్యేలా తల్లులు పిల్లలకు అలవాటు చేయాలి.



సమయం విలువను నేర్పించి, వృథా అవ్వకుండా చిన్నతనం నుంచే అలవాటు చేయాలి. అలాగే చిరుతిళ్లు ఎక్కువగా తినడం, జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండేలా చూసుకోవాలి. ఆహారానికి, నిద్రకి ఎక్కువ ప్రాధాన్యతను ఇవ్వాలి. పిల్లలకి నిద్ర చాలా ముఖ్యమైనది. సరైన నిద్ర వారి ఎదుగుదలను ఆరోగ్యవంతంగా చేయడమే కాక, వారి ఇమ్యూనిటిని, మేధాశక్తిని గణనీయంగా ప్రభావితం చేస్తుంది. అందుకే ప్రతి పేరెంట్ పిల్లల నిద్రకు సంబంధించి కొన్ని విషయాలు తెలుసుకోవాల్సిందే.

సమయానుసారంగా పడుకోవడం, లేవడం

క్రమబద్ధమైన నిద్ర మంచి ఆరోగ్యాన్ని, ఆలోచనలను పెంచుతుంది. అంతేకాకుండా సరైనన్ని గంటల నిద్ర పిల్లలకు అవసరం. ఇది వాళ్ళ స్లీప్ సైకిల్ ని క్రమబద్ధపరచడమే కాకుండా పిల్లలను మరింత శక్తివంతంగా తయారు చేస్తుంది. సమయానుసారంగా పడుకోవడం, లేవడం చిన్న పిల్లలకే కాదు, పెద్దవాళ్లకు కూడా మంచిదే. పెద్దలు సమయానుసారంగా ప్రతిపని చేస్తే పిల్లలు కూడా అది చూసి పాటిస్తారు.

పాజిటివ్ బెడ్ టైం స్టోరీస్

నిత్యం ఒకేలా తినేసి పడుకోవడం బోర్ కొడితే కథలు, పద్యాలు చదవడం మంచిది. పడుకునే ముందు పళ్లుతోముకోవడం, స్నానం చేయడం, నైట్ డ్రెస్ వేసుకోవడం నిద్ర వచ్చే దాకా స్టోరీస్ చదవడం పిల్లల మానసిక ఆరోగ్య ఎదుగుదలకు చాలా దోహదపడుతాయి. వారికి నిద్ర పట్టే దాకా కథలు చెప్తే, వారి ఆరోగ్యంతో పాటు బంధాల పట్ల గౌరవ మర్యాదలు పెరగాగడానికి సహాయపడతాయి.

ఆహ్లాదకరమైన బెడ్‌రూమ్ వాతావరణం

పరిపూర్ణ నిద్రకి పడక గదికి చాల సన్నిహితమైన అనుబంధం ఉంది. పరిశుభ్రమైన పడక గది ఆరోగ్యమైన నిద్రతో పాటు అన్ని రకాల అనారోగ్యాలను కూడా దూరంగా ఉంచుతుంది. ముఖ్యంగా వివిధ ఎలక్ట్రానిక్ పరికరాలను, టీవీ లాంటి వాటికీ బెడ్ రూమ్‌లో ప్లేస్ లేకుండా చేయడం మంచిది. కెఫీన్, ఇతర జంక్ పదార్థాలకు దూరంగా ఉంచడం పడుకునే ముందు జంక్ పదార్థాలు తినడం కాని లేదా కాఫీ తాగడం వలన నిద్ర రావడం పోయి సరిగా నిద్ర పట్టదు. జంక్ ఆహారపదార్థాలు కార్వింగ్‌ను, షుగర్ లెవెల్స్‌ను పెంచుతాయి. ఇది నిద్ర లేమికి దారి తీస్తుంది. నిద్రకు దూరం కూడా చేస్తుంది. డిన్నర్‌లో హోల్ గ్రేయిన్స్‌తో కూడినవి తీసుకోవడం మంచిది. ఇంకా పడుకోవడానికి రెండు మూడు గంటల ముందే తినేయడం మరీ మంచిది.



సరదా కాదు సమస్యే..!



పిల్లలు రాత్రిళ్ళు నిద్ర పోకుండా మెలకువగా వుండి ఆటలు ఆడడం, టీవీ చూడడం, మాటలతో పొద్దు పుచ్చడం యివన్నీ తేలికగా తీసుకున్నప్పటికీ నిద్ర పోకుండా ఉండడం అలవాటుగా మారితే మాత్రం సమస్య తీవ్రంగా వున్నట్టేనని అమెరికన్ నేషనల్ స్లీప్ ఫౌండేషన్ చెబుతున్నది. నిద్ర లేమితో బాధపడుతున్న కొంత మంది పిల్లల ప్రవృత్తులపై అధ్యనం చేస్తే కొన్ని విషయాలు తెలిసాయి. వాటిలో ముఖ్యమైనవి... నిద్ర లేమి జబ్బు, పీడ కలలు, ఆర్ ఎల్ ఎస్ అంటే రెస్ట్ లెస్ లెగ్స్ సింద్రోమ్, నిద్రలో మాట్లాడే అలవాటు, నిద్రలో నడిచే అలవాటు, స్లీప్ టెర్రర్స్, గురక, నిద్రలో ఊపిరి లేమి మొదలైనవి ప్రధాన కారణాలు.

ఇన్సోమ్నియా అంటే నిద్ర లేమి సమస్య ...

నిద్ర పోకుండా ఆలా కూర్చోవడం, పడుకొని నిద్ర నటించడం పిల్లలు చేస్తున్నారంటే వాళ్ళు నిద్ర లేమి సమస్యతో బాధ పడుతున్నట్టే. పట్టించుకోకపోతే అది దీర్ఘ కాల సమస్యగా పరిణమిస్తుంది. పిల్లలు తెల్లవారు జామున లేచి నిద్ర పట్టడం లేదని తరచుగా ఫిర్యాదు చేస్తున్నట్టయితే వైద్యులను సంప్రదించాల్సిందే. తీవ్రమైన ఒత్తిడి, ఏదైనా నొప్పితో బాధ పడుతున్నా అది మానసిక సమస్య కావొచ్చు లేదా వొంట్లో ఏదైనా నలత వల్ల కావొచ్చు... అశ్రద్ధ చేస్తే తీవ్రమైన జబ్బుగా దారి తీస్తుంది.

నైట్ మేర్స్ అంటే పీడ కలలు...

పీడ కలలు పిల్లలలో భయాన్ని రేకెత్తిస్తాయి. ఉలిక్కిపడి నిద్రలోంచి మేలుకొంటారు. భయంతో వణికిపోతూ నిద్రపోవడానికి అసలు యిష్ట పడరు. బాల్యంలో పీడ కలలు సహజం అంటున్నారు చైల్డ్ సైకాలజిస్టులు. ఏదైనా భయానక దృశ్యం చూసినా విన్నా, రొటీన్ కు భిన్నంగా ఏదైనా యిబ్బంది ఎదురైన ఆంక్షలు బెదిరింపులు కూడా పిల్లలను నిద్రకు దూరం చేసి ఏవేవో సంఘటనలు కలలోకి వచ్చి భయాన్ని కలిగిస్తాయి. పీడ కలగా వచ్చి పిల్లలను భయపెట్టి నిద్రకు దూరం చేస్తాయి. ఈ భయాలు పోవాలంటే అందుబాటులో లైట్ స్విచ్ ఒకటి ఏ ర్పాటు చేయాలి. పిల్లలు ఇష్టపడే బొమ్మలను వాళ్ళ పక్కనే వుంచాలి. భయం వేసిన వెంటనే పిల్లలు లైట్ వేసి బొమ్మను హత్తుకొని భయం నుంచి తేరుకుంటారు.

ఆర్ ఎల్ ఎస్...

అంటే నిద్రలో కాళ్ళు లాగడం, విపరీతమైన దురద నిద్రకు దూరం చేస్తాయి. ఐరన్ లోపం వల్ల ఈ విపరీతాలు ఎదుర్కొంటారు పిల్లలు. వైద్యులను సంప్రదించి సప్లిమెంట్లను వాడితే సమస్య తగ్గుముఖం పడుతుంది.

స్లీప్ టాకింగ్... స్లీప్ వాకింగ్

నిద్రలో పిల్లలు మాట్లాడడం,బిగ్గరగా నవ్వడం ,దిగ్గున లేచి కూర్చొని ఏడవడం చేస్తుంటే ఆరోజు వాళ్ళేదో చూడకూడనిది,వినకూడనిది జరిగిందని అనుకోవాలి. మరునాడు వాళ్లకు ఇవేవి గుర్తుండకపోయినా సమస్యగానే తల్లులు తీసుకోవాలి. అలాగే నిద్రలో నడిచే అలవాటు మూడు నుంచీ ఏడు సంవత్సరాల మధ్య వున్న పిల్లలలో వుంటుందట. వందలో నలభై మంది పిల్లలు ఈ సమస్యను ఎదుర్కొంటు ఉంటారని అంటున్నారు.

గురక పెట్టడం...

పిల్లలు గురక పెట్టడమన్నది చాలా అరుదైన విషయం. జలుబు చేసి ముక్కు రంధ్రాలు కూరుకుపోయినా, అడినాయిడ్స్ కారణంగా, టాన్సిల్స్‌తో బాధ పడుతున్నా గురక వస్తుంది. ఆ తరువాత అది అలవాటుగా మారే అవకాశం ఎక్కువ.

ఊపిరి లేమి...

అంటే శ్వాస తీసుకోవడం కష్టంగా మారినప్పుడు గురక వస్తుంది. గురక తీవ్ర స్థాయిలో వున్నప్పుడు ఊపిరి పీల్చుకోవడమూ కష్టంగానే ఉంటుంది. ఇది చాల తీవ్రమైన సమస్య. దీనిని నిద్రలో ఊపిరి లేమి జబ్బని అంటారు. ఈ సమస్యతో బాధపడే పిల్లలు రోజంతా నిద్ర మత్తుతో జోగుతూ వుంటారు. హైపర్ ఆక్టివిటీ అంటే అతిగా రియాక్ట్ కావడం, చదువులో వెనకబడి పోవడం తరచుగా జరుగుతూ ఉంటుంది.

మాటే మంత్రం..



ఒక వ్యక్తిని అర్థం చేసుకోవడంలో ఆలస్యమైన ఫర్వాలేదు..
కానీ, త్వరగా అపార్థం మాత్రం చేసుకోవద్దు..

'చిటికె'లో సాధ్యం..!




- **టమాటాలను వంటకు వాడే ముందు ఆరునిమిషాల దాకా వేడి నీటిలో ఉంచితే, కూర మరింత రుచిగా ఉంటుంది.**
- **జిడ్డుగా ఉండే పాత్రలను ఉప్పులో ముంచిన నిమ్మచెక్కతో రబ్ చేసి, తర్వాత పేపర్‌తో తుడవాలి. ఇలా చేస్తే జిడ్డు పోతుంది. సులభంగా శుభ్రం అవుతాయి.**

ముంగిట్లో ముగ్గు











అందాన్ని పెంచే కార్నేషన్!



మొక్కలన్నా పువ్వులన్నా ఎవరికి ఇష్టం ఉండదు చెప్పండి. రకరకాల పువ్వులు, వాటి రంగులు మనసుకు ఆహ్లాదాన్ని అందిస్తాయి. పువ్వులను గిఫ్ట్‌గా ఇస్తే తీసుకున్న వారు సంతోషంగా ఫీలవుతారు. అలాని ప్రతిసారీ ఒకే రకం పూలు, చూసినవే చూస్తే అంతగా అట్రాక్షన్ ఉండకపోవచ్చు. కాబట్టి ఒకోసారి ఒక్కో వెరైటీని ట్రై చేయండి. అందుకు ఈ కార్నేషన్ పూలు కూడా బాగుంటాయి. బహుమతిగానే కాదండోయ్ ఇంట్లో పెట్టుకున్నా వాటితో ఇంటికే కళ పెరుగుతుంది. మరి మీరు కార్నేషన్‌ని ఒసారి ట్రై చేసి చూడండి.









అందమైన పూలను బహుమతిగా ఇస్తే ఆ సంతోషమే వేరు. అలాంటి వాటిల్లో గులాబీలు ముందున్నా, ఎప్పుడూ అవే ఇస్తే ఏం బాగుంటుంది? వీటితో పాటు కొత్తగా కంటికి ఇంపుగా ఉండే కార్నేషన్ పూలను అందుకోసం ఎంచుకోవచ్చు. కేవలం శుభాకాంక్షలు తెలిపేందుకు కాదు... అలంకరణకూ ఇవెంతో ఉపయోగపడతాయి.

ఈ పూల మొక్కలు రెండు రకాలుగా లభిస్తాయి. ఒకటి.. పొడవైన కాడతో ఉండే కట్ ఫ్లవర్. ఇంకొకటి.. కుండీల్లో చిన్నగా పెంచుకోగలిగే వీలున్న రకం. పూల బొకేలుగా ఇవ్వడానికీ, అలంకరణ వంటి అవసరాల కోసం మొదటి రకాన్ని ఎక్కువగా ఉపయోగిస్తే... రెండోది అభిరుచీ, అందం కోసం పెంచుతారు. పుట్టింది యూరప్‌లో అయినా ప్రపంచ వ్యాప్తంగా మూడొందల రకాల్లో, అనేక రంగుల్లో ఈ పూల మొక్క లభిస్తోంది. ఒక్క మనదేశంలోనే రెండొందల రకాలు అందుబాటులో ఉన్నాయి. ఎరుపు, తెలుపు, గులాబీ వంటి రంగుల్లోనే కాకుండా రెండు, ఐదారు వర్ణాల మేళవింపుగా పూసేవీ లభిస్తున్నాయి. ఇవి ఏడాదికొకసారి నాటుకునే, శాశ్వతంగా పెంచుకునే రకాల్లో దొరుకుతాయి. విత్తనాల ద్వారా ఉత్పత్తయ్యే మొక్కల్లో అధిక శాతం ఏడాదికొకసారి పెంచుకునేవే. టిష్యూ కల్చర్, కాండం కత్తిరించి పెంచేవి పెరెన్నియల్ రకాలు. వీటిని నేలలో నాటితే రెండు, మూడడుగులు పొడవు వరకూ పెరుగుతాయి.

ఇది చాలా సున్నితమైన మొక్క. వాతావరణంలో తేమ ఎక్కువగా ఉండే చల్లని ప్రదేశం దీనికి అనుకూలం. అలాగని ఎండ తగలకూడదని కాదు. పద్దెనిమిది నుంచి ఇరవై ఐదు డిగ్రీల వరకూ నేరుగా ఎండ తగిలేలా చూసుకోవాలి. అంతకంటే ఎక్కువైనప్పుడు పాక్షికంగా నీడ ఉండేలా షేడ్ నెట్ ఏర్పాటు చేసుకోవాలి. కుండీల్లో పెంచుకుంటూ బాల్కనీల్లో పెట్టుకునేప్పుడు తూర్పు, పడమర దిశల్లో ఉంచుకోవాలి. రోజులో కనీసం నాలుగు గంటలు ఎండ తగిలేలా చూసుకుంటే మొక్క ఆరోగ్యంగా ఎదిగి, ఏడాదంతా పూలు పూస్తుంది. వీటిని నాటేందుకు క్షారతత్వం ఉన్న సారవంతమైన మట్టిని ఎంచుకోవాలి. దానిలో తగిన పాళ్లలో సేంద్రియ ఎరువు కలిపి కుండీల్లో నింపుకోవాలి. ఎండ ఎక్కువగా ఉన్నప్పుడు తప్ప నీటి అవసరం పెద్దగా ఉండదు. రోజు విడిచి రోజు నీళ్లు పోసినా సరిపోతుంది. ఈ మొక్కకు నీళ్లు ఎక్కువయితే ఆకులు పండిపోతాయి. ఈ మొక్కలకు ఎన్‌పీకే 20:10:20 నిష్పత్తిలో ఎరువు వేయాల్సి ఉంటుంది. అది తప్పనిసరిగా నీటిలో కరిగేదిగా చూసుకోవాలి. మొక్క నుంచి పువ్వుని కత్తిరించాక పదిహేను రోజుల పాటు తాజాగా ఉంటుంది. ఒకేళ చెట్టుకే వాడిపోతే దాన్ని కిందవరకూ కత్తిరించుకోవాలి. లేదంటే అది కుళ్లిపోవడం, క్రిమికీటకాలు దాడిచేయడం వంటి సమస్యలు ఎదురవుతాయి. ఈ మొక్కకి క్రిమికీటకాల సమస్యా ఎక్కువే. వాటిని ముందుగానే నివారించడానికి తరచూ వేప నూనె చల్లుతూ ఉండాలి. మార్కెట్లో లభించే కార్బన్‌డైజమ్ ఫంగిసైడ్‌ను నీళ్లలో తడిపి మొక్క వేళ్ల వద్ద చల్లాలి. కట్ ఫ్లవర్ తరహా మొక్కలు పది నుంచి యాభై రూపాయల్లో లభిస్తాయి. రకరకాల రంగుల్లో ఉండి, బహుమతులుగా ఇవ్వగలిగినవి రెండొందల రూపాయల్లో దొరుకుతాయి.







కోడిగుడ్లు

రిటైల్ ధర (100కు)

హైదరాబాద్	453	విజయవాడ	453
ముంబయి	508	ఢిల్లీ	487
చెన్నై	460	బెంగళూరు	455



బ్రాయిలర్ చికెన్

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ.

హైదరాబాద్	110	ఢిల్లీ	125
కరీంనగర్	115	ముంబయి	120
వరంగల్	120	చెన్నై	120



సెన్సెక్స్ +231.98
36,213



నిఫ్టీ +53.00
10,855

రూపాయి
₹70.46
(ఒక అమెరికా డాలర్‌కు)



పసిడి
32,631.02
(హైదరాబాద్‌లో) 24 క్యా..10 గ్రాములకు/(రూ.)లలో

లాభాలతో స్టాక్ మార్కెట్

- చివరి గంటలో పుంజుకున్న దలాల్ స్ట్రీట్
- లాభాల్లో ఐటీసీ, హెచ్‌డీఎఫ్‌సీ, టాటా మోటార్స్ షేర్లు
- నష్టాల్లో యస్ బ్యాంక్, భారతి ఇన్‌ఫ్రాటెల్

ముంబయి: వరుసగా మూడో రోజు కూడా స్టాక్ మార్కెట్‌లు లాభాలతో ముగిశాయి. బుధవారం ఉదయం లాభాలతోమ ప్రారంభమైన సూచీలు తర్వాత అనూహ్యంగా నష్టాల్లోకి వెళ్లాయి దీంతో ముదుపర్లు కాస్త ఆందోళన చెందారు. తర్వాత మళ్లీ పుంజుకుని లాభాల్లోకి రావడంతో అందురూ ఊపిరి పీల్చుకున్నారు. చివరి గంటలో కొనుగోళ్లు మార్కెట్లకు కలిసొచ్చాయి. బ్యాంకులు, ఆటోమొబైల్, వినియోగ రంగ షేర్లు రాణించగా.. లోహ, విద్యుత్, పీఎస్‌యూ బ్యాంకులు నష్టాలను మూటగట్టుకున్నాయి. సెన్సెక్స్ బుధవారం ఉదయం 200 పాయింట్లకు పైగా లాభంతో ప్రారంభం కాగా, నిఫ్టీ 10860 పాయింట్ల పైన ట్రేడింగ్ ఆరంభించింది. చివరకు సెన్సెక్స్ 231.98 పాయింట్ల లాభంతో 36212.91 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 53 పాయింట్లు లాభ పడి 10855.15 పాయింట్లకు చేరింది. ఎన్ఎస్ఈలో యాక్సిస్ బ్యాంకు, ఐటీసీ, హెచ్‌డీఎఫ్‌సీ, టాటా మోటార్స్, యూపీఎల్ తదితర కంపెనీల షేర్లు లాభపడ్డాయి. గెయిల్, హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్, యస్ బ్యాంకు, భారతి ఇన్ఫ్రాటెల్ తదితర కంపెనీల షేర్లు నష్టపోయాయి. డాలరుతో రూపాయి మారకం విలువ రూ.70.60 వద్ద కొనసాగుతోంది.

వాట్సాప్‌లో సూపర్ ఫీచర్

- త్వరలో అందుబాటులోకి ఫింగర్ ప్రింట్ ఆప్షన్



కాలిఫోర్నియా: ప్రముఖ మెసేజింగ్ యాప్ వాట్సాప్‌లో మరో అద్భుతమైన ఫీచర్ రాబోతోంది. సోషల్ మీడియాలో డేటా చోరీ వార్తలు భయపెడుతున్న తరుణంలో వాట్సాప్ ఒక సరికొత్త ఫీచర్‌ను త్వరలోనే లాంచ్ చేయనుంది. వాట్సాప్ వినియోగదారుల సంభాషణలు ఇతరులు చూడకుండా కాపాడేందుకు ఆండ్రాయిడ్ వెర్షన్‌లో వాట్సాప్‌కు ఫింగర్ ప్రింట్ అథెంటికేషన్ ఆప్షన్ తీసుకురానుంది. ఇకపై వాట్సాప్ యాప్‌ను ఓపెన్ చేయాలంటే వేలిముద్ర అవసరమని ఒక నివేదిక తెలిపింది. తాజా నివేదికల ప్రకారం ఫేస్‌బుక్ సొంతమైన వాట్సాప్ తీసుకురానున్న ఫింగర్ ప్రింట్ సెన్సర్ ఫీచర్ పరీక్ష, ప్రయోగ దశలో ఉంది. ఈ ఫీచర్ నిర్దిష్ట సంభాషణలను కాపాడటమే కాదు, మొత్తం యాప్‌కు భద్రత నిస్తుందనీ, ఇతరులకు మన వాట్సాప్ యాక్సెస్‌ను నియంత్రిస్తుందనీ.. అంటే వాట్సాప్‌లో మన చాటింగ్‌కు స్పెషల్‌గా లాక్ పెట్టుకోవాల్సిన అవసరం లేకుండా.. డైరెక్టుగా యాప్‌కే ఫింగర్ ప్రింట్ ఫీచర్ రక్షణనిస్తుందని వాబ్ఈటల్ ఇన్ఫో అనే వెబ్‌సైట్ నివేదించింది.

దూసుకుపోతున్న స్థిరాస్తి రంగం

- గ్రేటర్‌లో ప్లాట్స్, ఫ్లాట్‌లకు డిమాండ్
- రిజిస్ట్రేషన్ శాఖకు పెరిగిన ఆదాయం
- గ్రేటర్ నుంచి రూ.3,045 కోట్ల రాక..



విజయక్రాంతి, హైదరాబాద్: స్థిరాస్తి రంగంలో హైదరాబాద్ మహానగరానికి దేశంలోనే ప్రత్యేకమైన స్థానం. ఎప్పుడూ సరికొత్త పోకడలతో విస్తరిస్తూనే ఉంది. భాగ్యనగరం పరిధిలో సొంత ఇల్లు ఉండాలని కల గనేవారు.. దాన్ని నెరవేర్చుకునేవారు ఎప్పటికప్పుడు వస్తూనే ఉన్నారు. ద్వితీయ శ్రేణి నగరాలతో పోలిస్తే ఇక్కడ ధరలు తక్కువ కావడంతో స్థిరాస్తి రంగం శరవేగంగా విస్తరిస్తూ ప్రభంజనంగా మారింది. దీంతో ప్రభుత్వ రిజిస్ట్రేషన్ శాఖకు కూడా దండిగా ఆదాయం సమకూరుతోంది. గ్రేటర్ హైదరాబాద్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల ద్వారా గడిచిన తొమ్మిది నెలల్లో రూ.3 వేల కోట్లకు పైగా ఆదాయం సమకూరింది. కొంత కాలంగా గృహ, వాణిజ్య నిర్మాణాలు ఒకదానికొకటి పోటీ పడుతున్నాయి. అదే స్థాయిలో కొనుగోలుదారుల్లోనూ ఆసక్తి పెరిగింది. ప్రపంచ వ్యాప్తంగా గల ఐటీ, ఐటీ ఆధారిత కంపెనీలకు హైదరాబాద్ అనువైన ప్రదేశంగా గుర్తింపు పొందడంతో 'ఆఫీస్' స్థలాలకు డిమాండ్ కూడా భారీగా పెరిగింది. నగర శివారులోని ఆదిభట్లలో టాటా ఏరోస్పేస్, టీసీఎస్ ఐటీ పరిశ్రమ నిర్మాణం, ముచ్చర్లలో ఫార్మా సిటీల నిర్మాణం స్థిరాస్తి రంగానికి మరింత ఊపునిచ్చాయి. మరోవైపు నగరం చుట్టూ కొత్తకొత్త టౌన్‌షిప్‌లు ఏర్పాటుతో పెద్ద ఎత్తున వాణిజ్య నిర్మాణాలకు కూడా డిమాండ్ ఏర్పడింది. దీంతో స్థిరాస్తి వ్యాపారులు భూయజమానులతో ఒప్పందం చేసుకుని స్థలాలను అభివృద్ధి చేస్తున్నారు. భూ యజమానుల వాటాకు కొంత వాణిజ్య స్థలాన్ని ఇవ్వడంతో పరిస్థితులు మరింత సానుకూలంగా మారాయి.

శివారు చుట్టూ డిమాండ్..

నగర శివారు చుట్టూ 20 నుంచి 30 కిలో మీటర్ల వరకు ప్లాట్స్, ఫ్లాట్స్‌కు డిమాండ్ భారీగా పెరిగింది. ఇండిపెండెంట్ గృహాలు, అపార్ట్‌మెంట్‌లు, గేటెడ్ కమ్యూనిటీల పట్ల కొనుగోలుదారులు ఆసక్తి చూపుతున్నారు. వాణిజ్య, పారిశ్రామిక ప్రాజెక్టులతో శివారు ప్రాంతాల్లో స్థిరాస్తి రంగానికి ఊపొచ్చింది. పలు ప్రాంతాల్లో ఈ ఏడాదిలో 20 వేల చదరపు మీటర్ల నుంచి లక్ష చదరపు మీటర్ల వరకు గల ప్రాజెక్టులకు ప్రభుత్వం పెద్ద ఎత్తున అనుమతులు ఇచ్చింది. మరో 30 ప్రాజెక్టులు ప్రతిపాదనలో ఉన్నట్లు తెలుస్తోంది. జీహెచ్ఎంసీ పరిధిలో రెండేళ్ల క్రితం 8,704 భవన నిర్మాణాలకు అనుమతి లభించగా, గతేడాది మరో 15 వేలకు గ్రీన్ సిగ్నల్ వచ్చింది. హయత్‌నగర్, అల్వాల్, ఎల్బీనగర్, తదితర ప్రాంతాల్లో ఇండిపెండెంట్ గృహాలకు, శేరిలింగంపల్లి, చందానగర్, యూసుఫ్‌గూడ, రామచంద్రాపురంలో అపార్ట్‌మెంట్స్‌కు డిమాండ్ పెరిగింది.

రిజిస్ట్రేషన్ శాఖకు కాసుల పంట

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో స్థిరాస్తి లావాదేవీలు పెద్ద ఎత్తున జరుగుతుండడంతో రిజిస్ట్రేషన్ శాఖకు ఈ ఆర్థిక సంవత్సరం కాసుల పంట పండింది. స్థిరాస్తి లావాదేవీలు అంచనాలకు మించి పెరుగుతుండడంతో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల ఆదాయం నెలనెలా పైకి ఎగబాకుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో డిసెంబర్ నెలాఖరుకు అంటే తొమ్మిది నెలల్లోనే ఆ శాఖకు రూ.3,045 కోట్ల ఆదాయం సమకూరింది. గతేడాదితో పోలిస్తే రూ.584 కోట్ల ఆదాయం అధికంగా సమకూరినట్లు రిజిస్ట్రేషన్ శాఖ గణాంకాలు చెబుతున్నాయి. రాష్ట్రం మొత్తంమీద ఈ ఆర్థిక సంవత్సరం రూ.4,21 కోట్ల ఆదాయం సమకూరగా ఒక్క గ్రేటర్ నుంచే రూ.3,045 కోట్ల ఆదాయం రావడం ఇక్కడి స్థిరాస్తి లావాదేవీల ప్రభంజనాన్ని సూచిస్తోంది.

నగర పరిధిలో మొత్తం 46 సబ్ రిజిస్ట్రేషన్ ఆఫీసులున్నాయి. స్థిరాస్తి రంగం లావాదేవీలతో పాటు రాబడిలో రంగారెడ్డి ఆర్వో అగ్రస్థానాన్ని దక్కించుకుంది. రెండో స్థానంలో మల్కాజిగిరి–మేడ్చల్, మూడో స్థానంలో హైదరాబాద్ (సౌత్), నాలుగో స్థానంలో హైదరాబాద్ ఆర్వోలు నిలిచాయి. అత్యధికంగా కుత్బుల్లాపూర్, ఇబ్రహీంపట్నం, ఉప్పల్, మహేశ్వరం, గచ్చిబౌలి, చంపాపేట, ఎల్బీనగర్, వనస్థలిపురం, మేడ్చల్, రాజేంద్రనగర్, మల్కాజిగిరి, కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, బంజారాహిల్స్, ఎల్బీనగర్, రాజేంద్రనగర్, గండిపేట పరిధుల్లో స్థిరాస్తి లావాదేవీలు అత్యధికంగా జరిగాయి.



భారత వృద్ధిరేటు 7.3శాతం

- ప్రపంచ బ్యాంక్ అంచనాలు

ఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2018–19లో భారత వృద్ధి రేటు 7.3శాతంగా ఉంటుందని ప్రపంచ బ్యాంకు అంచనా వేసింది. ఆ తర్వాత రెండు ఆర్థిక సంవత్సరాల్లో దేశీయ వృద్ధి 7.5శాతంగా ఉండొచ్చని పేర్కొంది. పెట్టుబడులు, వినియోగంలో పెరుగుదలే దీనికి కారణమని తెలిపింది. అంతే గాక వేగంగా అభివృద్ధి చెందుతున్న అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ముందుందని ప్రపంచ బ్యాంక్ వెల్లడించింది.జీఎస్టీ, నోట్ల రద్దు కారణంగా 2017 భారత ఆర్థిక వ్యవస్థ ఒడుదొడుకులకు గురై వృద్ధిరేటు 6.7శాతానికి పరిమితమైనట్లు ప్రపంచ బ్యాంకు పేర్కొంది. దేశీయ వృద్ధిలో గతేడాది భారత్ కంటే చైనా ముందుందని, అయితే ఈ ఏడాది మాత్రం ఆ దేశ వృద్ధి రేటు మందగిస్తుందని అంచనా వేసింది. 2018లో చైనా వృద్ధిరేటు 6.5శాతానికే పరిమితమవుతుందని, 2021 నాటికి అది 6శాతానికి పడిపోయే అవకాశాలున్నాయని ప్రపంచ బ్యాంక్ తమ అంచనాల్లో పేర్కొంది.'వినియోగంలో పెరుగుదల, పెట్టుబడులతో భారత్ వేగంగా వృద్ధి చెందుతోంది. 2018–19 ఆర్థిక వ్యవస్థలో ఆ దేశ వృద్ధిరేటు 7.3శాతంగా ఉంటుందని మేం అంచనా వేస్తున్నాం. ఇక 2019–20, 2020–21 ఆర్థిక సంవత్సరాల్లో భారత వృద్ధిరేటు 7.5శాతంగా ఉండొచ్చు' అని ప్రపంచ బ్యాంక్ ప్రాస్పెక్ట్స్ గ్రూప్ డైరెక్టర్ అయాన్ ఖోస్ ఓ ఇంటర్వ్యూలో తెలిపారు.ప్రపంచవ్యాప్తంగా వృద్ధిరేటు గతేడాది 3శాతంగా ఉంటే.. ఈ ఏడాది 2.9శాతానికి పరిమితమయ్యేలా ఉందని ప్రపంచ బ్యాంక్ అభిప్రాయం వ్యక్తం తెలిపింది. ఈ సంవత్సరం ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఒడుదొడుకులు తప్పేలా లేవని పేర్కొంది.

యాపిల్ సీఈవో జీతం రూ. 110 కోట్ల పైమాటే

- బోనస్ రూపంలో రూ. 84 కోట్లు అందుకున్న టిమ్‌కుక్

వాషింగ్టన్: యాపిల్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ టిమ్‌కుక్ 2018లో అందుకున్న మొత్తం వేతనం ఎంతో తెలుసా..? 15.7 మిలియన్ డాలర్లు.. అంటే భారత కరెన్సీలో దాదాపు రూ. 110కోట్ల పైమాటే. కాగా.. ఇందులో రూ. 84కోట్లు బోనస్ రూపంలోనే తీసుకున్నారట. ఈ మేరకు సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ ఫైలింగ్ సందర్భంగా యాపిల్ ఈ వివరాలను పేర్కొంది. గతేడాది టిమ్ అందుకున్న వేతనంలో 3 మిలియన్ డాలర్లు మూల వేతనం కాగా.. 12 మిలియన్ డాలర్ల బోనస్, 6,80,000 డాలర్లు ఇతర పరిహారాల కింద చెల్లించినట్లు యాపిల్ తెలిపింది. గతేడాది యాపిల్ ఉత్పత్తుల విక్రయాలు భారీగా పెరిగినందువల్లే బోనస్ కూడా ఎక్కువగా ఇచ్చినట్లు వెల్లడించింది. 2018లో 265.6 బిలియన్ డాలర్ల మేర విక్రయాలు జరిపాం. కార్యకలాపాల ద్వారా కంపెనీకి 70.9 బిలియన్ డాలర్ల ఆదాయం వచ్చింది.

స్పోర్ట్స్



టీమిండియాని ప్రశంసలతో ముంచెత్తిన పాక్ మాజీ క్రికెటర్లు

కరాచీ: ఆస్ట్రేలియాలో ఆస్ట్రేలియాను ఓడించిన భారత క్రికెట్ జట్టును పాకిస్థాన్ క్రికెట్ దిగ్గజాలు, మాజీ ఆటగాళ్లు ప్రశంసించారు. నాలుగు టెస్టుల సిరీస్ను టీమిండియా 21తో కైవసం చేసుకుంది. ఆసీస్లో సిరీస్ గెలిచిన తొలి ఆసియా జట్టుగా రికార్డు సృష్టించింది. ఈ నేపథ్యంలో విరాట్ కోహ్లీ జట్టును ఒకప్పటి బౌలింగ్ దిగ్గజం వసీమ్ అక్రమ్ అభినందించాడు. 'ఈ అత్యద్భుత ప్రదర్శనకు గాను విరాట్ కోహ్లీ ప్రశంసలకు అర్హుడు. భారత్లోని పటిష్ఠ దేశవాళీ విధానం వల్లే ఈ విజయం సాధ్యమైందని అనుకుంటున్నా' అని వసీమ్ అక్రమ్ అన్నాడు. పాక్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ సైతం టీమిండియాను అభినందించిన సంగతి తెలిసిందే. 'ఆస్ట్రేలియాలో సిరీస్ కైవసం చేసుకున్న తొలి ఆసియా జట్టుగా అవతరించిన భారత క్రికెట్ జట్టు, కోహ్లీకి అభినందనలు' అని ఆయన అన్నారు. ఆస్ట్రేలియాలో ఆస్ట్రేలియాను ఓడించడం చాలా కష్టమని పాక్ మాజీ సారథి మొయిన్ ఖాన్ అన్నాడు. బౌలర్లు, బ్యాట్స్మెన్ రాణించడంతో ఈ విజయం సాధ్యమైందని వెల్లడించాడు. 'ఈ సిరీస్లో పుజారా, కోహ్లీ, పంత్, మిగతా వారి బ్యాటింగ్ ఆకట్టుకుంది. బౌలర్లు ఒత్తిడి పడకుండా బంతులు వేసేందుకు వారు బాటలు వేశారు' అని మొయిన్ ఖాన్ పేర్కొన్నాడు.

టీమిండియా క్రికెటర్లకు బీసీసీఐ నోటీసులు

- మహిళల పట్ల అనుచిత వ్యాఖ్యలపై క్షమాపణలు చెప్పిన పాండ్య



ముంబై: టీంఇండియా క్రికెటర్ హార్థిక్ ప్యాండ్య కాఫీ విత్ కరణ్ షోలో చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం లేపింది. దీనిపై సోషల్ మీడియాలో కూడా తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో ప్యాండ్య క్షమాపణలు చెప్పాడు. గాయం కారణంగా జట్టుకు దూరమైన ఆల్‌రౌండర్ కొన్ని వారాల క్రితం కాఫీ విత్ కరణ్‌లో మహిళల పట్ల అనుచితంగా మాట్లాడాడు. మహిళలను కించపరిచే విధంగా మాట్లాడినందుకు బీసీసీఐ ఇద్దరు యువ క్రికెటర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఈ షోలో పాల్గొన్నందుకు హార్థిక్ ప్యాండ్యతో పాటు కేఎల్ రాహుల్ కూడా బీసీసీఐ నోటీసులు పంపింది. నోటీసులపై 24 గంటల్లో వివరణ ఇవ్వాలని తెలిపింది. హార్థిక్ ప్యాండ్య మాట్లాడుతూ మా అమ్మానాన్నలతో ప్రతి విషయం షేర్ చేసుకుంటానని, సెక్స్‌కు సంబంధించిన విషయాలను కూడా చెప్తానని షోలో ప్రస్తావించాడు. మహిళలను ఉద్దేశించి ఈ షోలో ఏకవచనంతో అది.. ఇది.. అని హేళనగా మాట్లాడాడు.

వన్డేలలోనూ కోహ్లీయే..టాప్

- బౌలింగ్‌లో బుమ్రా
- వన్డేలలో రెండో స్థానంలో టీం ఇండియా



దుబాయ్: ఐసీసీ వన్డే ర్యాంకుల్లో టీమిండియా సారథి విరాట్ కోహ్లీ, పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా తమ విభాగాల్లో అగ్రస్థానంలో కొనసాగుతున్నారు. జట్టు ర్యాంకింగ్స్‌లో రెండో స్థానంలో భారత్ వరుసగా ఎనిమిది మ్యాచ్‌లు గెలిస్తే 125 పాయింట్లతో ఇంగ్లాండ్‌కు చేరువలో నిలుస్తుంది.. ప్రస్తుతం అగ్రస్థానంలో ఉన్న ఇంగ్లాండ్ ఖాతాలో 126 రేటింగ్ పాయింట్లు ఉన్నాయి. ఆసీస్‌పై 2–1తో టెస్టు సిరీస్ కైవసం చేసుకున్న టీమిండియా ఆ జట్టుతో మూడు వన్డేలు, న్యూజిలాండ్‌లో ఐదు వన్డేలు ఆడనుంది. వరుసగా అన్ని మ్యాచ్‌లు గెలిస్తే 125 పాయింట్లు లభిస్తాయి. మరోవైపు నాలుగో స్థానంలోని దక్షిణాఫ్రికాను దాటేయాలంటే మాత్రం పాక్ 5–0తో సిరీస్ గెలవాల్సిందే. బ్యాటింగ్ జాబితాలో కోహ్లీ, రోహిత్ శర్మ తొలి రెండు స్థానాల్లో ఉన్నారు. బౌలింగ్ విభాగంలో జస్‌ప్రీత్ బుమ్రా అగ్రస్థానంలో ఉండగా కుల్‌దీప్ యాదవ్ మూడో ర్యాంకులో నిలిచాడు. శ్రీలంకపై 3–0తో అద్భుత విజయం సాధించిన న్యూజిలాండ్ ఆటగాళ్ల ర్యాంకులు మారాయి. పరుగుల వరద పారిస్తున్న రాస్ టేలర్ మూడు, మార్టిన్ గప్తిల్ 14 స్థానాల్లో ఉన్నారు. కేన్ విలియమ్సన్ 11వ ర్యాంకుకు చేరుకున్నాడు.

రిషబ్.. నువ్ బెస్ట్ బేబీ సిట్టర్‌వి

- మా పాపను కూడా ఆడించవూ: రోహిత్ శర్మ

సిడ్నీ: టీం ఇండియా క్రికెటర్, వికెట్ కీపర్ రిషబ్ పంత్‌పై ఓపెనర్ రోహిత్ శర్మ సరదాగా వ్యాఖ్యనించారు. పంత్‌ను మార్నింగ్ బడ్డీ అంటూ.. మీరు గుడ్ బేబీ సిస్టర్ కామెంట్ చేస్తూ ట్వీట్ చేశారు. ప్రస్తుతం మా ఇంట్లో ఒక వ్యక్తి అవసరం ఉన్నారంటూ.. తమ కూతురిని ఆడించాలని రోహిత్ శర్మ పంత్‌ను కోరారు. పంత్ గుడ్ మార్నింగ్ అంటూ ట్వీట్ చేయడంతో రోహిత్ మార్నింగ్ బడ్డీ అంటూ తనదైన శైలిలో రీ ట్వీట్ చేశారు. రితికా సంతోషంగా ఉండాలంటే ఓ బేబీ సిస్టర్ కావాలంటూ రోహిత్ శర్మ, పంత్‌కు ట్వీట్ చేశారు. క్రికెటర్ చాహల్ సరిగా ఆడడం లేదా అంటూ.. బేబీని సంతోషంగా ఆడిస్తానంటూ.. రితికాకు పంత్ శుభాకాంక్షలు తెలిపారు.రిషబ్‌పంత్‌పై మీరు ఖాళీగా ఉంటే తమ పిల్లలను మరోసారి ఆడించాలని ఆస్ట్రేలియా కెప్టెన్ భార్య బోనీ సరదాగా ట్వీట్ చేశారు. తమ ఇంట్లో ప్యాకింగ్ చేయని వస్తువులను సర్దుకుంటానని ఆస్ట్రేలియా కెప్టెన్ టీమ్ పైన్ భార్య బోనీ సరదాగా ఈ వ్యాఖ్యనించారు. ఇన్‌స్టాగ్రామ్ ఓ వీడియోను కూడా బోనీ పోస్టు చేసింది.ఇటీవల పంత్ తమ పిల్లలను ఎత్తుకొని ఉన్న ఫోటోను బెస్ట్ బేబీ సిస్టర్ అంటూ ట్వీట్టర్ పోస్టు చేశారు. ఆస్ట్రేలియా ప్రధాని స్కాట్ మొర్రిసన్ అధికారిక నివాసంలో ఈ ఫొటోను తీశారు. భారత్, ఆస్ట్రేలియా జట్టు సభ్యులు ఇక్కడే కొత్త సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా టిమ్ బోనీ దంపతుల పిల్లల్ని రిషభ్ ఎత్తుకుని ముద్దు చేశాడు. వారిని కాసేపు ఆడించాడు. టీమ్ పిల్లల్ని రిషబ్ ఎత్తుకుని ఆడించడంలో ఎటువంటి విశేషం లేకున్నా.. మూడో టెస్టు తర్వాత ఇలా జరగడం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది.







సిడ్నీ చేరుకున్న ధోనీ, రోహిత్

సిడ్నీ: ఆస్ట్రేలియా గడ్డపై చారిత్రక టెస్టు సిరీస్ విజయం సాధించిన భారత జట్టు వన్డే సిరీస్‌కు సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలోనే వన్డే జట్టులో చోటు దక్కించుకున్న ఆటగాళ్లు సిడ్నీ చేరుకున్నారు. భారత మాజీ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోనీ, వన్డే వైస్ కెప్టెన్ రోహిత్ శర్మ, యువ బౌలర్ యుజువేంద్ర చాహల్ తదితరులు తొలి వన్డేకు ఆతిథ్యమిస్తున్న సిడ్నీ నగరానికి వచ్చారు. రోహిత్, ధోనీతో కలిసి భారత్ నుంచి ఆస్ట్రేలియాకు బయలుదేరామని ఆల్‌రౌండర్ కేదార్ జాదవ్ ట్విటర్ ద్వారా వెల్లడించాడు. మూడు వన్డేల సిరీస్‌లో తొలి వన్డే శనివారం ఆరంభంకానుంది. టెస్టు సిరీస్ విజయంలో కీలక పాత్ర పోషించిన స్పీడ్‌స్టర్ బుమ్రా స్థానంలో హైదరాబాదీ పేసర్ మహ్మద్ సిరాజ్‌ను ఎంపిక చేసిన విషయం తెలిసిందే. సిరాజ్ కూడా త్వరలోనే జట్టుతో కలవనున్నాడు. మరోవైపు భారత సారథి విరాట్ కోహ్లీ టెస్టు సిరీస్ విజయాన్ని భార్య అనుష్క శర్మతో కలిసి గెలుపు ఆనందాన్ని ఆస్వాదిస్తున్నాడు.



ఆసియా పారాసైక్లింగ్ ట్రాక్ వరల్డ్ ఛాంపియన్ షిప్‌కు భారత్ రెడీ

విజయక్రాంతి, హైదరాబాద్: టోక్యోలో జరుగనున్న 2020 పారాలింపిక్స్ కోసం ప్రతిభ కలిగిన 100 మంది పారా అథ్లెట్లకు శిక్షణ ఇచ్చేందుకు 'మిషన్ 100' రూపొందిస్తున్నారు. ఇండోనేషియా రాజధాని జకార్తాలో జనవరి 8 నుంచి 13వ తేదీ వరకు జరుగనున్న 8వ ఆసియా పారా–సైక్లింగ్ ట్రాక్ వరల్డ్ ఛాంపియన్‌షిప్‌లో భారతదేశం నుంచి ప్రాతినిధ్యం వహించే పారా సైక్లింగ్ బృందాన్ని ఆదిత్య మెహతా ఫౌండేషన్ (ఏఎమ్ఎఫ్), సైక్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాలు ప్రకటించాయి. ఆసియా ఖండానికి చెందిన అత్యుత్తమ పారా–సైక్లిస్టులు జకార్తాలో జరిగే 'ఆసియా ఛాంపియన్' కోసం పోటీపడనున్నారు. భారతదేశ బృందంలో హరీందర్ సింగ్, గురియల్ సింగ్, కైగోలాల్ అనే ముగ్గురు పారా–సైక్లిస్టులు ఉన్నారు. వీరిలో హరీందర్ సింగ్ 2017–2018లో ఆసియాలో పారా సైక్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో రెండు కాంస్య పతకాలు సాధించారు. ఇటీవలే ముగిసిన ఆసియా పారా గేమ్స్‌లో గుర్లాల్ సింగ్ కాంస్య పతకాన్ని గెలిచారు. గత సంవత్సరం ఎమ్ ఫౌండేషన్ ప్రారంభించిన మిషన్ 100 ద్వారా ప్రతిభ కలిగిన 100 మంది పారా అథ్లెట్లను గుర్తించి వారికి శిక్షణ అందించి ఇండియా తరపున టోక్యోలో జరుగనున్న 2020 పారాలింపిక్స్‌లో పాల్గొనేటట్లు చేయడమే మిషన్ లక్ష్యం అని ఆదిత్య మెహతా అన్నారు.

Printed and Published By Chilappagari Laxmi Rajam, on behalf of Intercontinental Publications Private Limited, Printed at Intercontinental Publications Private Limited, Survey No .713/P, Dundigal Grama Panchayat, Qutubullapur Mandal, Medchal - Malkajgiri District 500043, Published at Plot No. 1267/A, Road No. 63/A, Jubilee Hills, HYDERABAD-500033, Telangana State. Editor: Chilappagari Laxmi Rajam, RNI NO: TELTEL /2018/75203, Ph: +91 40 2355 6603, Fax No. +91 4023556604, Toll Free: 1800 599 3399.